వాసంతి గత వారంలోని పైపెన్స్
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

తిరుపతి

: fb.com/vaartha Digital

ప్రతిబోటు.. ప్రతి మత్స్యకారుడి వివరాలు నమోదు చేయాలి
ఎంఎస్ఎంఇలకు అంతర్జాతీయ మార్కెట్ అవకాశాలు
3లో

Published from Tirupathi, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

21-8-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 202 పేజీలు: 10+4 వెల: 6.50

## స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు
# ఎస్ఇసి కసరత్తు

**బిసిలకు 34 శాతం రిజర్వేషన్లు వర్తింపజేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు**

**పురపాలక సంఘాల చైర్మన్‌ల ప్రత్యక్ష ఎన్నిక బిల్లుకు అసెంబ్లీ ఆమోదం**

**అక్టోబర్ నెలాఖరులోగా ఎన్నికల ప్రక్రియ ముగించేలా కార్యాచరణ**

**విజయవాడ,ఆగస్టు 20,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు కసరత్తు జరుగుతుంది. అక్టోబరు లోపల పంచాయతీరాజ్ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఎపి వర్షాకాల సమావేశాల్లో సిఎం చంద్రబాబు పుర, నగర పాలక సంస్థల ఎన్నికలు అక్టోబరు లోపలే నిర్వహించాలని మంత్రులతో ప్రస్తావించారు. ఈ క్రమంలో పురపాలక, నగర పాలక సంస్థలల్లో చైర్మన్ పదవికి ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించేందు. పంచాయతీరాజ్ వ్యవస్థలో కేంద్రం నిర్దేశించినట్లు జెడ్పీటిసిలు,ఎంపిటిసిలు ఎన్నికలు నిర్వహించాలని, చైర్మన్ ఇటు మండల పరిషత్‌కు. అటు జెడ్పీ చైర్మన్ ఎన్నికలు జరగాలని శాసనసభ బిల్లు ఆమోదించింది. ఇదే బిల్లులో మండల పరిషత్,. జిల్లా పరిషత్ సింగిల్ వైస్ చైర్మన్ వ్యవస్థను పునర్దురించాలని నిర్ణయించింది. ఈ పరిణామాల నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు అక్టోబరులో జరుగవచ్చునని అంచనా వేస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ అంశాన్ని ధృవీకరంచలేదు.

## అమరావతిలో ఎంట్రీకి అందుబాటులోకి రానున్న
# మరిన్ని రహదారులు



**విజయవాడ.,ఆగస్టు 20, ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతిలో ఎంట్రీకి మరిన్ని రహదారులను త్వరితగతిన అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అందులో భాగంగా సీడ్ యాక్సెస్ రోడ్డు ప్రారంభంతో ఇతర రహదారుల కనెక్టివిటీపై మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి నారాయణ దృష్టి సారించారు. గురువారం ఇ 13, ఇ 15, ఇ 1, ఇ 3 రహదారి నిర్మాణ పనుల పురోగతిపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. మంగళగిరి నుంచి అమరావతికిలోకి ప్రవేశించే ఇ 15 రోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రికి అధికారులు వివరించారు. 16వ నెంబర్ జాతీయ రహదారి నుంచి ఎయిమ్స్ ద్వారా అమరావతిలోకి ఇ 13 రోడ్డు ప్రవేశించనుంది. సీడ్ యాక్సెస్ రోడ్డు (ఇ 3) మూడో ఫేజ్‌లో నిర్మించే ఎలివేటెడ్ కారిడార్ (స్టీల్ బ్రిడ మణిపాల్ హాస్పిటల్) పనులు కూడా త్వరగా ప్రారంభించాలని అధికారులకు మంత్రి నారాయణ సూచించారు. సీడ్ యాక్సెస్ రోడ్డుకు సమాంతరంగా కరకట్టను వెడల్పు చేస్తూ ప్రకాశం బ్యారేజీ వరకూ ఇ 1రోడ్డును నిర్మిస్తున్నారు. ఆయారోడ్ల నిర్మాణాలకు అవసరమైన రైల్వే ఇతర అనుమ తులు దాదాపు కొలిక్కి వచ్చాయని మంత్రి నారాయణ దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. రోడ్ల పనులకు ఆటంకాలు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా కలెక్టర్‌ను ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు.

# దక్షిణాది ప్రగతికి సమష్టి అడుగులు

**31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో సిఎం చంద్రబాబు**

**రాష్ట్రాల మధ్య సహకారంతోనే వికసిత్ భారత్ లక్ష్యం సాధ్యం**

2047 నాటికి 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా దక్షిణాది రాష్ట్రాలు

కుప్పం మీదుగా బుల్లెట్ రైలు మూడు రాష్ట్రాలతో సరికొత్త కారిడార్

**కేంద్రం ముందుకు దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి మౌలిక వసతుల ప్రతిపాదనలు**

ఎపి పునర్విభజన చట్టంలో అపరిష్కృత అంశాలు పరిష్కరించండి

**షెడ్యూల్ 9, 10 సంస్థల విభజనపై త్వరిత నిర్ణయం తీసుకోండి**

**కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి**



గురువారం చంగల్‌పట్‌లో నిర్వహించిన 31వ సదరన్ కౌన్సిల్ సమావేశానికి హాజరైన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, విజయ్, సతీషన్, డికె శివకుమార్, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆయా రాష్ట్రాల మంత్రులు

**విజయవాడ, ఆగస్టు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలను పరస్పర సహకారం, సమన్వయంతో పరిష్కరించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. దక్షిణాది రాష్ట్రాలు కలసికట్టుగా ముందుకు సాగితే భారతదేశ అభివృద్ధికి మరింత బలమైన చోదకశక్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. 2047 నాటికి దక్షిణ భారత్ 10 ట్రిలియన్ డాలర్లకుపైగా ఆర్థిక వ్యవస్థగా ఎదిగే సామర్థ్యం ఉందన్నారు. తమిళనాడులోని మహాబలిపురంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా అధ్యక్షతన జరిగిన 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో సిఎం చంద్రబాబు ప్రసంగించారు. 24 అంశాలతో కూడిన అజెండాపై సమావేశంలో చర్చించారు. ఆంధ్రప్రదేశ్ సహా దక్షిణాది రాష్ట్రాల సమగ్ర అభివృద్ధి గురించి ముఖ్యమంత్రి తన ప్రసంగంలో ప్రస్తావించారు. దక్షణాది రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం సాధించటమే లక్ష్యమని సిఎం పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్రాల మధ్య విశ్వాసం, పరస్పర సహకారంతో సమస్యల పరిష్కారం జరగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ఎపి, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలను కలుపుతూ కుప్పం మీదుగా బుల్లెట్ రైలు కారిడార్‌ను అభివృద్ధి చేయాలని చంద్రబాబు ప్రతిపాదించారు. అమరావతి- బెంగళూరు- చెన్నై నగరాలను అనుసంధానించే ఈ మార్గం మూడు రాష్ట్రాల మధ్య ఆర్థిక కార్యకలాపాలకు మరింత ఊతం ఇస్తుందని వివరించారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఉమ్మడి లాజిస్టిక్స్ నెట్‌వర్క్, డ్రై పోర్టుల ఏర్పాటు, దక్షిణ గ్రిడ్‌ను జాతీయ విద్యుత్ గ్రిడ్‌తో అనుసంధానం చేయడం, యూనివర్సిటీలు, ఇతర స్కిల్లింగ్ సంస్థలతో కలిసి సంయుక్త నైపుణ్యాభివృద్ధి వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రకృతి విపత్తుల సమయంలో ఏ రాష్ట్రం ఒంటరిగా ఉండకుండా పరస్పర సహాయానికి ప్రత్యేక విపత్తు నిర్వహణ టాస్క్ ఫోర్సును ఏర్పాటు చేయాలని కేంద్రానికి ప్రతిపాదించారు.

**తిరుపతి నుంచి అయోధ్య వరకు తీర్థయాత్ర సర్క్యూట్**

దక్షిణాది ప్రముఖ పుణ్యక్షేత్రాలను ఉత్తర భారతదేశంలోని ఆధ్యాత్మిక కేంద్రాలతో అనుసంధానిస్తూ ప్రత్యేక వారసత్వ, పర్యాటక, తీర్థ యాత్ర సర్క్యూట్ ఏర్పాటు చేయాలని సిఎం చంద్రబాబు కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. తిరుపతి, శ్రీశైలం, కాంచీపురం, >>2

## సీట్లు, నిధులు తగ్గొద్దు

దక్షిణాది రాష్ట్రాల సమష్టి స్వరం, అమిత్‌షా అధ్యక్షతన చంగల్‌పట్‌లో దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి మండలి సమావేశం 2లో

## అరణ్యానికి సాంకేతిక
# రక్షణ కవచం

- అడవిలో ప్రతి కదలికపై నిఘాకు అత్యాధునిక కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్
- ప్రతి అంగుళం అడవిని పరిరక్షించేందుకు ఆధునిక సాంకేతిక వ్యవస్థ
- 'ఈగస్తు' తరహా మొబైల్ యాప్‌తో వ్యవస్థలో జవాబుదారీతనం
- కర్ణాటక నమూనా అటవీ పరిరక్షణపై డి.సిఎం పవన్ కల్యాణ్ దృష్టి



**విజయవాడ, ఆగస్టు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** కర్ణాటక అటవీ శాఖ అనుసరిస్తున్న తరహా అత్యాధునిక సాంకేతిక పరిపాలనా వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రతి అంగుళం అటవీ భూమిని సంరక్షించే విధంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ఆదేశించారు. నూతనంగా నిర్మిస్తున్న అరణ్యా రామంలో కర్ణాటక తరహా అధునాతన ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఈ వ్యవస్థ ద్వారా అడవుల మ్యాపింగ్‌తోపాటు పూర్తి స్థాయిలో వన్యప్రాణుల కదలికలు, అటవీ కార్యకలాపాలపై డిజిటల్ నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఇటీవల రాష్ట్ర అటవీ శాఖ ఐటీ సలహాదారు పెన్నమరెడ్డి నాగబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర అటవీశాఖ బృందం కర్ణాటకలో మూడు రోజులపాటు పర్యటించింది. కర్ణాటక అటవీ శాఖ అనుసరిస్తున్న ఐటి విధానాలు, జిఐఎస్, మొబైల్ అప్లికేషన్లు, ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ తదితర వ్యవస్థలపై అధ్యయనం జరిపి, పూర్తి వివరాలతో కూడిన నివేదికను పవన్ కల్యాణ్ అందజేశారు. తమ పరిశీలనలు, కర్ణాటకలో విజయవంతమైన విధానాలపై పలు సూచనలు చేశారు. ఈ నివేదికను క్షుణ్ణంగా పరిశీలించిన పవన్ కల్యాణ్ కర్ణాటకలో సత్ఫలితాలు ఇచ్చిన పలు విధానాలను రాష్ట్రంలో కూడా అమలు చేయాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా >>2



## జంతర్ మంతర్ ఘటనపై హైపవర్ కమిటీ

**జస్టిస్ సుభాష్‌రెడ్డి నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో ఏర్పాటు**

**ముగ్గురు రిటైర్డ్ జడ్జిలు, సిబిఐ మాజీ డైరెక్టర్, మాజీ డిజిపి నియామకం**

## విద్యాహక్కు చట్టం కింద
# లక్ష దాటిన ప్రవేశాలు

- ప్రజా ప్రభుత్వ ఘనతన్న మంత్రి లోకేష్
- 2022-26 మధ్య ప్రైవేట్ పాఠశాలల్లో 1,04,046 మందికి అవకాశం
- ఆన్‌లైన్ విధానంలో పారదర్శకంగా అడ్మిషన్ల ప్రక్రియ చేపడుతున్నామని వెల్లడి
- ఆర్‌టిఇపై విస్తృత ప్రచారం, అవగాహన కల్పించడమే కారణమని వివరణ



**విజయవాడ, ఆగస్టు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యాహక్కు చట్టం (ఆర్‌టిఇ) అమలులో గణనీయమైన పురోగతి సాధించామని, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో పేద విద్యార్థుల ప్రవేశాలు భారీగా పెరిగాయని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. గురువారం శాసనమండలిలో ఆర్టీఇ ప్రవేశాలపై సభ్యులు కావలి గ్రీష్మ, భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, పేరాబత్తుల రాజశేఖర్ అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి ఈ గణాంకాలే నిదర్శనమని పేర్కొన్నారు. మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. "విద్యాహక్కు చట్టం సెక్షన్ 12(1)(సి) కింద ప్రైవేట్ పాఠశాలల్లో బలహీన వర్గాల విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించే ప్రక్రియను ప్రజాప్రభుత్వం పటిష్ఠంగా అమలు చేస్తోంది. దీని ఫలితంగా 2022-23 నుంచి 2026-27 విద్యా సంవత్సరం వరకు మొత్తం 1,04,046 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశాలు పొందారు. పూర్తి పారదర్శకత కోసం అడ్మిషన్ల ప్రక్రియను ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్నాం" అని వివరించారు.

గత ప్రభుత్వ హయాంతో పోలిస్తే ప్రవేశాల సంఖ్యలో భారీ వ్యత్యాసం కనిపిస్తోందని లోకేష్ గణాంకాలతో సహా వివరించారు. "2022-23 విద్యా సంవత్సరంలో కేవలం 2,203మంది విద్యార్థులుమాత్రమే ఆర్టీఇకింద ప్రవేశాలు పొందారు. కానీ, ప్రజాప్రభుత్వంవచ్చిన మొదటి యేడాదే, అంటే 2024-25లో, ఈ సంఖ్య ఏకంగా 29,000కు >>2



గురువారం ఉరవకొండ ప్రధాన రహదారిపై బైఠాయించిన రైతులను బలవంతంగా పక్కకు లాగుతున్న పోలీసులు

# పంటలెండిపోతున్నాయ్ నీళ్లు విడుదల చేయండి

హంద్రీ-నీవా అధికారుల తీరుపై రైతుల ఆగ్రహం

ఉరవకొండలో ప్రధాన రహదారిపై బైఠాయింపు

తహశీల్దార్ కార్యాలయం మూసివేసి భారీ ధర్నా

ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో రైతులతో మాట్లాడించిన ఎస్ఐ

సాగునీరు ఇవ్వలేమని తేల్చి చెప్పిన హంద్రీనీవా అధికారులు

ముందుగా ప్రకటించకుండా నీరివ్వమంటే నష్టపోతామని ఆవేదన

**ఉరవకొండ, ఆగస్టు 20 ప్రభాతవార్త:** సాగు నీటి కోసం ఉరవకొండ ప్రాంత రైతులు గురువారం రోడ్డెక్కారు. కళ్లముందరే నీరు పారుతున్నా పంట పొలాలకు అందించే మార్గం లేకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురవుతున్న రైతులు హంద్రీనీవా తూములు ఎత్తి నీరు అందించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన నిర్వహించారు. అనంతపురం జిల్లా ఉరవకొండ మండల పరిధి >>2

# చర్చలు విఫలం

రెండు డిమాండ్లపై సానుకూల స్పందన

మరోసారి చర్చిస్తాం: మంత్రి సత్యకుమార్

జూడాల సమ్మె కొనసాగింపు



గురువారం మీడియాతో జూడాలు

**గుంటూరు మెడికల్, ఆగస్టు 20, ప్రభాత వార్త:** రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్న జూనియర్ వైద్యుల ప్రతినిధులతో ఆరోగ్యశాఖ మంత్రి గురువారం చర్చలు జరిపారు. జూనియర్ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఈశ్వర్ శంకర్, ఉపాధ్యక్షుడు డాక్టర్ భార్గవ్ సాయి, డాక్టర్ రచన తదితరులు చర్చల్లో పాల్గొన్నారు. జూనియర్ వైద్యులు ప్రధానంగా ప్రస్తావించిన మూడు డిమాండ్లపై చర్చించినమంత్రి.. రెండుఅంశాలపై సాను కూలంగా స్పందించినట్లు జూడా ప్రతినిధులు తెలి పారు. జూనియర్ వైద్యులు కోరుతున్న స్టైపెండ్‌ను 20 శాతం పెంచాలన్న డిమాండ్‌పై మంత్రి స్పందిస్తూ.. ఈ అంశాన్ని ఆర్థిక శాఖ దృష్టికి తీసుకెళతామని తెలి పారు. అయితే 20 శాతం పెంపు అమలు చేయడం కష్టసాధ్యమయ్యే అవకాశం ఉందని కూడా మంత్రి పేర్కొన్నట్లు జూడా ప్రతినిధులు వెల్లడించారు. మిగిలిన రెండు డిమాండ్లపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎంబిబిఎస్, పిజి వైద్య విద్య పూర్తిచేసిన అర్హులైన వైద్యులు అందుబాటులో ఉండగా, వైద్యేతర విద్యార్హతలైన ఎంఎస్సీ, పిహెచ్‌డీ చేసిన వారిని అధ్యాపకులుగా నియమించకూడదన్న డిమాండ్‌పై ప్రభుత్వం >>2

# మూలపేటలో 'కోరమండల్'

రూ.2,250 కోట్లతో రసాయన పరిశ్రమ

400మందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు

450 ఎకరాల భూమి కేటాయింపు

రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

**శ్రీకాకుళం, ఆగస్టు 20 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, పాడిఅభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక చొరవతో శ్రీకాకుళం జిల్లా మూలపేట ప్రాంతం పారిశ్రామిక ప్రగతిలో మరో కీలక ముందడుగు వేసింది. ప్రముఖ కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఫాస్ఫరిక్ యాసిడ్, అనుబంధ ఎరువుల తయారీ కాంప్లెక్స్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ఏర్పాటుకు సంస్థకు 450 ఎకరాల భూమిని కేటాయిస్తూ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి డాక్టర్ ఎన్.యువరాజ్ జీవోఎంఎస్ నం.211ను జారీ చేశారు. ఈ భారీ పరిశ్రమద్వారా సుమారు రూ.2,250 కోట్ల పెట్టుబడులు జిల్లాకు రానుండగా, ప్రారంభ దశలోనే 400 మందికి ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. రోజుకు 2,000 టన్నుల సల్ఫ్యూరిక్ యాసిడ్, 650 టన్నుల ఫాస్ఫరిక్ యాసిడ్, 1,000 టన్నుల జిప్సమ్ ప్లాస్టర్ ఉత్పత్తి చేసే సామర్థ్యంతో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నారు. 2030 అక్టోబరు నాటికి ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా నిర్ణయించారు. మూలపేటలో ఇంతటి భారీ పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం శ్రీకాకుళంజిల్లా పారిశ్రామిక అభివృద్ధికి ఒక మైలు రాయిగా నిలవనుంది. పరిశ్రమల రాకతో స్థానిక యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు, అనుబంధ రంగాలు, వ్యాపారాలు, రవాణా, సేవారంగాలు కూడా అభివృద్ధి చెందే అవకాశంఉంది. తద్వారా మూలపేటతో పాటు పరిసర ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి మరింత ఊతం లభించనుంది. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణం కల్పించడంతో పాటు, పెట్టుబడులను ఆకర్షించి స్థానికంగా ఉపాధి అవకాశాలు పెంచాలన్న లక్ష్యంతో మంత్రి అచ్చెన్నాయుడు ప్రత్యేకంగా చొరవ తీసుకుంటు >>2



గురువారం ఉత్తరాఖండ్‌లోని గర్వాల్ జిల్లాలో కొండచరియలు విరిగిపడడంతో ముస్సోరి-కెంప్టి రహదారిలో ఒక పెద్ద భాగం కొట్టుకుపోయిన దృశ్యం

# సీట్లు, నిధులు తగ్గొద్దు

**చెన్నై, ఆగస్టు 20:** దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి మండలి సమావేశం ఈసారి కీలక రాజకీయ, ఆర్థిక అంశాలకు వేదికగా మారింది. డీలిమిటేషన్, కేంద్ర నిధుల పంపకం, రాష్ట్రాల హక్కులు, నదుల అనుసంధానం, అభివృద్ధి, కనెక్టివిటీ వంటి అంశాలపై దక్షిణాది రాష్ట్రాల నేతలు తమ అభిప్రాయాలను బలంగా వినిపించారు. రాష్ట్రాల ప్రత్యేక ప్రయోజనాలతో పాటు కేంద్రం ముందు సమిష్టిగా తమ డిమాండ్లను ఉంచే వేదికగా ఈ సమావేశం కనిపించింది. మొత్తంగా సీట్లు తగ్గొద్దు నిధులు తగ్గొద్దు రాష్ట్రాల హక్కులు క్షీణించవద్దు అన్న సందేశం బలంగా వినిపించింది. జనాభా నియంత్రణలో ముందున్న దక్షిణాది రాష్ట్రాలకు డీలిమిటేషన్ కారణంగా రాజకీయంగా నష్టం జరగకూడదన్న అభిప్రాయం సమావేశంలో ప్రధానంగా వ్యక్తమైంది. కర్ణాటక ముఖ్యమంత్రి డికె శివకుమార్ 1971 జనాభా లెక్కలను ప్రాతిపదికగా కొనసాగించాలని కోరారు. ప్రస్తుత లోక్‌సభలోని 543 స్థానాలను యథాతథంగా కొనసాగిస్తూ, అదే స్థానాల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని ప్రతిపాదించారు. జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన రాష్ట్రాల పార్లమెంటరీ ప్రాతినిధ్యం తగ్గితే అన్యాయం జరుగుతుందని డీకే శివకుమార్ పేర్కొన్నారు. తమిళనాడు సిఎం విజయ్ కూడా పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గకుండా చట్టబద్ధమైన హామీ అవసరమని డిమాండ్ చేశారు. ఆర్థిక సంఘం నిధుల పంపకంలో దక్షిణాది రాష్ట్రాలకు న్యాయం చేయాలన్న డిమాండ్ కూడా సమావేశంలో ప్రధానంగా వినిపించింది. 15వ ఆర్థిక సంఘం సమయంలో కర్ణాటక వాటా 4.7 శాతం నుంచి 3.6 శాతానికి తగ్గిందని డికె శివకుమార్ వెల్లడించారు. నీటి సమస్యలపై దక్షిణాది రాష్ట్రాలమధ్య భిన్న అభిప్రాయాలు కూడా సమావేశంలో స్పష్టమయ్యాయి. నీటి పంపకాల వివాదాల నుంచి నీటి సహకారం వైపు వెళ్లాల్సిన అవసరం ఉందని డికె శివకుమార్ అన్నారు. సమానత్వం, పారదర్శకత, పరస్పర సహకారంతో నీటి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కావేరి, కృష్ణా, తుంగభద్ర, పెన్నా, పాలార్ వంటి నదులు దక్షిణాది ప్రజల జీవనాడులని పేర్కొన్న ఆయన కృష్ణా, అప్పర్ భద్ర, నదుల అనుసంధానం వంటి అంశాలపై కర్ణాటక తన వైఖరిని స్పష్టం చేస్తుందని తెలిపారు. మరోవైపు కావేరి జలాల విషయంలో సుప్రీంకోర్టు తీర్పులు, సంబంధిత అథారిటీల నిర్ణయాలను అమలు చేయాలని తమిళనాడు సిఎం విజయ్ డిమాండ్ చేశారు. ముల్లైపెరియార్ జలాశయం నీటిమట్టాన్ని 152 అడుగులకు పెంచే విషయంలోనూ కోర్టు తీర్పులకు కట్టుబడి ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాత్రం దక్షిణాది అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ, నదుల అనుసంధానంపై ప్రధానంగా దృష్టి పెట్టారు. ఏపీ-కర్ణాటక-తమిళనాడు రాష్ట్రాలను అనుసంధానించే బుల్లెట్ ట్రైన్ ప్రతిపాదనను ఆయన ముందుకు తెచ్చారు. కుప్పం మీదుగా అమరావతి-బెంగళూరు-చెన్నై రవాణా కారిడార్ అభివృద్ధి చేయాలని సూచించారు. దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి లాజిస్టిక్స్ నెట్‌వర్క్, డ్రైపోర్టుల ఏర్పాటు, దక్షిణాది విద్యుత్ గ్రిడ్‌ను జాతీయ గ్రిడ్‌తో అనుసంధానం చేయడం వంటి ప్రతిపాదనలు చేశారు. రాష్ట్రాల యూనివర్సిటీలు, స్కిల్లింగ్ సంస్థలతో ఉమ్మడి కన్సార్టియం ఏర్పాటు చేయాలని, విపత్తుల సమయంలో పరస్పర సహకారం కోసం మ్యూచువల్ ఎయిడ్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. తిరుపతి నుంచి కాశీ, అయోధ్య, చార్‌ధామ్ వరకు ఉమ్మడి ఆధ్యాత్మిక పర్యాటక సర్క్యూట్ అభివృద్ధి చేయాలని చంద్రబాబు ప్రతిపాదించారు. 2047 నాటికి దక్షిణాది ఆర్థిక వ్యవస్థ 10 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. దక్షిణాది ఉమ్మడి అంశాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన పెండింగ్ సమస్యలను కూడా చంద్రబాబు కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. విభజన చట్టంలోని షెడ్యూల్ 9, 10 సంస్థల విభజన సమస్యలను పరిష్కరించాలని కోరారు. 12 యేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర విభజన సమస్యలపై కేంద్రం వేగంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పోలవరం, సౌత్ కోస్ట్ రైల్వే జోన్, అమరావతి ప్రాజెక్టులకు కేంద్ర సహకారం అవసరమని పేర్కొన్నారు. విశాఖ, విజయవాడ మెట్రో ప్రాజెక్టులకు కేంద్ర అనుమతులు ఇవ్వాలని, కడప జేఎస్‌డబ్ల్యూ రైల్వే లింక్‌కు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దక్షిణాది జల సమస్యలకు పరిష్కారంగా నదులఅనుసంధానంపై చంద్రబాబు మరోసారి దృష్టి సారించారు. గోదావరి-కావేరి అనుసంధానం ద్వారా 500 టీఎంసీలకు పైగా నీటిని మళ్లించే ప్రతిపాదనను ప్రస్తావించారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు జలాల విషయంలో సమన్వయంతో ముందుకు వెళ్లాలని కోరారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని గంగా-కావేరి అనుసంధానానికి దీర్ఘకాలిక జాతీయ ప్రణాళిక అవసరమని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. కేరళ కూడా కేంద్ర నిధుల పంపకం, తీర రక్షణ, ఆఫ్‌షోర్ మైనింగ్ అంశాలను సమావేశంలో ప్రస్తావించింది. ఆయుష్మాన్ భారత్ పథకం కింద రాష్ట్రం భారీగా ఖర్చు చేస్తున్నప్పటికీ కేంద్రం నుంచి తగినంత నిధులు రావడం లేదని కేరళ అసంతృప్తి వ్యక్తం చేసింది. రూ.1,493 కోట్లు ఖర్చు చేస్తే కేంద్రం కేవలం రూ.151 కోట్లు మాత్రమే ఇచ్చిందని ఆ రాష్ట్రం పేర్కొంది. కేరళ తీర ప్రాంతంలో 63 శాతం మేర కోతకు గురవుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. తీర రక్షణ కోసం ఎన్డీఆర్ఎఫ్,ఎస్డీఆర్ఎఫ్ నిధులను వినియోగించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరింది. శాస్త్రీయ అధ్యయనాలు, సరైన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ లేకుండా ఆఫ్‌షోర్ మైనింగ్ బ్లాకుల వేలం నిర్వహించవద్దని డిమాండ్ చేసింది. డీలిమిటేషన్, ఆర్థిక సంఘం నిధులు, నీటి పంపకాలు, రాష్ట్రాల హక్కులు వంటి అంశాల్లో రాష్ట్రాల మధ్య అభిప్రాయ భేదాలు ఉన్నప్పటికీ కేంద్రంతో సంబంధించి తమ ప్రయోజనాల విషయంలో దక్షిణాది రాష్ట్రాలు సమిష్టిగా గళం వినిపించాయి. మరోవైపు డ్రగ్స్, అంతర్రాష్ట్ర నేరాల నియంత్రణకు రియల్‌టైమ్ ఇంటెలిజెన్స్ షేరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్న సూచన కూడా వచ్చింది. మొత్తంగా చెన్నైలో జరిగిన దక్షిణ మండలి సమావేశం కేవలం రాష్ట్రాల సమస్యల చర్చకే పరిమితం కాకుండా దక్షిణాది రాజకీయ ప్రాతినిధ్యం, ఆర్థిక హక్కులు, అభివృద్ధి, నీటి వనరులు, కనెక్టివిటీ వంటి అంశాలపై భవిష్యత్‌లో సమిష్టి వ్యూహానికి వేదికగా మారే సంకేతాలను ఇచ్చింది.

# 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమానికి విశేష స్పందన

## కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రజలకు వివరిస్తున్న నేతలు

## స్థానిక సమస్యలు, అవసరాలపై ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ సేకరణ

**విజయవాడ,.ఆగస్టు 20,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన"ఇంటింటికీ తెలుగు దేశం - 2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో ప్రారంభమైన ఈ యాత్ర, 25వ రోజుకు చేరేసరికి 71.80 లక్షల ఇళ్లను సందర్శించి కీలక మైలురాయిని అధిగమించింది. గురువారం ఒక్కరోజే పార్టీ నాయకులు, కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా 2,53,832 ఇళ్లను సందర్శించారు. దీంతో ఈ కార్యక్రమం కింద ఇప్పటివరకు సందర్శించిన మొత్తం ఇళ్ల సంఖ్య 71.80 లక్షలకు చేరినట్లు పార్టీ వర్గాలు ఓ పత్రికా ప్రకటనలో వెల్లడించాయి. 70 లక్షల ఇళ్ల సందర్శన మైలురాయిని దాటడంతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. ప్రతి నియోజకవర్గంలోనూ ఇంటింటి పర్యటనలు విస్తృతంగా సాగుతున్నాయి. ఈ కార్యక్రమం ద్వారా పార్టీ శ్రేణులు ప్రతి ఇంటికీ వెళ్లి, కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో ప్రజలకు అందిన ప్రయోజనాలను వివరిస్తున్నారు. ముఖ్యంగా రైతులు, మహిళలు, యువత, పేద, మధ్యతరగతి వర్గాలకు చేకూరిన లబ్ధిని గణాంకాలతో సహా తెలియజేస్తున్నారు. కేవలం ప్రభుత్వ పథకాల ప్రచారానికే పరిమితంకాకుండా, ప్రజలతోనేరుగా మాట్లాడి వారి స్పందనను తెలుసు కుంటున్నారు. క్షేత్రస్థాయి పర్యటనల్లో స్థానికంగా ఉన్న అవసరాలు, మౌలిక వసతుల కొరత, ప్రజలు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలపై నాయకులు, కార్యకర్తలు సమాచారాన్ని సేకరిస్తున్నారు.

# 'ఉచితాలు' ఉచితమా?

## ఉచిత పథకాలపై తెలంగాణ హైకోర్టు సీరియస్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు20:** తెలంగాణలో అమలవుతున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాల చట్టబద్ధత, ఉచిత పథకాలకు నిధుల వినియోగంపై దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంపై గురువారం తెలంగాణ హైకోర్టు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ పథకాల నిధుల విడుదలపై ఉన్న (గతంలో విధించిన) మధ్యంతర స్టేను ఎత్తివేసేందుకు జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ ధర్మాసనం స్పష్టంగా నిరాకరిం చింది. నిధుల విడుదలపై ఉన్న స్టేను తొలగించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభ్యర్థనను తోసిపుచ్చింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై డేంజర్ బెల్స్ మోగుతున్నాయని హెచ్చరించిన ధర్మాసనం పరిమితి లేకుండా ఉచిత పథకాలకు నిధులు మళ్లిం చడం వల్ల ఇతర అత్యవసర రంగాలపై తీవ్ర ప్రభావం పడుతోందని వ్యాఖ్యానించింది. నీటిపారుదల, ఇతర ప్రాజెక్టుల కోసం నిర్బం ధంగా భూములిచ్చిన బాధితులకు ఏళ్లకు ఏళ్లు పరిహారం చెల్లించకుండా బకాయిలు పెట్టడంపై కోర్టు నిలదీసింది. భూబాధితులకు పరిహారం ఇవ్వడం ప్రభుత్వ చట్టబద్ధమైన బాధ్యత కాదా? అని ప్రశ్నించింది. అలాగే, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు అందాల్సిన పెన్షన్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సమయానికి చెల్లించలేక పోవడంతో వారు న్యాయం కోసం కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితి వస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది.

# దక్షిణాది ప్రగతికి సమష్టి అడుగులు

>> మధురై, రామేశ్వరం, మైసూరు వంటి ప్రాంతాలను వారణాసి, అయోధ్య, చార్ ధామ్ ప్రాంతాలతో అనుసంధానించడం ద్వారా దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక పర్యాటకానికి ప్రోత్సాహం కల్పించే అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి ప్రతిపాదన చేశారు. దేశ స్థూల ఉత్పత్తిలో దక్షిణాది ఐదు రాష్ట్రాల వాటా ప్రస్తుతం 31శాతంగా ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. 2047 నాటికి భారత్ 30-35 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న లక్ష్యానికి దక్షిణాది రాష్ట్రాలు ప్రధాన భూమిక పోషిస్తాయని తెలిపారు. ఏపి 2.4 ట్రిలియన్ డాలర్లు తమిళనాడు 2.6, కర్ణాటక 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థలుగా లక్ష్యాలు నిర్దేశించుకున్నాయని సమష్టిగా దక్షిణ భారత్‌లోని రాష్ట్రాలన్నీ 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదుగుతాయని ముఖ్యమంత్రి వివరించారు.

**విభజన హామీలు పరిష్కరించండి**

ఆంధ్రప్రదేశ్ పునర్విభజనకు సంబంధించిన పెండింగ్ అంశాలను సిఎం చంద్రబాబు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్ర విభజన జరిగి 12 సంవత్సరాలు గడిచినా షెడ్యూల్ 9, 10లోని సంస్థల విభజన పూర్తికాలేదని పేర్కొన్నారు. ఆస్తులు, అప్పులు, సంస్థల విషయంలో సమ న్యాయం జరగాల్సిన అవసరం ఉందన్నారు. విభజన చట్టంలోని సెక్షన్ 66 కింద ఉన్న అంశాలపై కేంద్ర నిర్ణయం కోసం గడచిన 9 ఏళ్లుగా ఎదురుచూస్తున్నామని అన్నారు. విభజన చట్టంలోని సెక్షన్ 56లోని సమస్యలు, వనరుల లోటు, ఆర్థిక భారానికి సంబంధించిన అంశాలను కూడా పరిష్కరించాలని కేంద్రాన్ని కోరారు. ఏపి అభివృద్ధిలో కేంద్రం అందిస్తున్న సహకారానికి చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. హామీ ఇచ్చిన 11 జాతీయ సంస్థల్లో 10 ఇప్పటికే ఏర్పాటు కావడం సంతోషదాయకమని అన్నారు. పోలవరం, సౌత్ కోస్ట్ రైల్వే జోన్, అమరావతి నిర్మాణంలో కేంద్ర సహకారం కీలకమన్నారు. ఢిల్లీలోని ఏపి భవన్ అంశాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రస్తావించారు. అమరావతి రాజధానికి చట్టబద్ధత కల్పించిన కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు. నీటి వనరులు, పచ్చదనం, జీవన ప్రమాణాలు, కనెక్టివిటీ, ఆర్థిక అవకాశాలను దృష్టిలో ఉంచుకుని నూతన రాజధాని నిర్మాణం చేస్తున్నామని సిఎం వివరించారు. చట్టంలోని షెడ్యూల్-13 కింద ఉన్న ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇవ్వాలని సిఎం కోరారు. విశాఖ- చెన్నై పారిశ్రామిక కారిడార్, మూడు విమానాశ్రయాల అభివృద్ధి, కొత్త రాజధానికి రైలు అనుసంధానం వంటి పనులు వేగంగా పూర్తి చేయాలని కోరారు. దుగరాజపట్నం పోర్టు, బిపిసిఎల్ రిఫైనరీ, విశాఖ, విజయవాడ నగరాల్లో మెట్రో రైలు ప్రాజెక్టులు, కడపలోని జిందాల్ స్టీల్‌కు రైలు అనుసంధానంపై అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

**నీటి భద్రతకు 'గోదావరి-కావేరి అనుసంధానం'**

భవిష్యత్ నీటి భద్రతకు నదుల అనుసంధానమే శాశ్వత పరిష్కారమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి, కృష్ణా, వంశధార, నాగావళి, పెన్నా వంటి 40 నదులు 28 జిల్లాలకు సాగునీటిని అందిస్తున్నాయని తెలిపారు. గోదావరి-కావేరి అనుసంధానంలో భాగంగా పోలవరం, కృష్ణా, పెన్నా మీదుగా 500 టిఎంసిలకు పైగా మిగులు వరద జలాలను కావేరి బేసిన్‌కు తరలించే ప్రతిపాదనను సిఎం చంద్రబాబు కేంద్రం ముందు ఉంచారు. ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రా లకు ప్రయోజనం కలిగిస్తుందని అన్నారు. గంగా-కావేరి అనుసంధానాన్ని జాతీయ ప్రాజెక్టుగా చేపట్టాలని సూచించారు. గంగా నది మిగులు జలాలను దక్షిణాది ప్రాంతాలకు తరలించడం ద్వారా తమిళనాడుతో పాటు దక్షిణాది రాష్ట్రాల నీటి భద్రతకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. నదీ పరివాహక ప్రాంతాల మధ్య సమన్వయానికి ప్రత్యేక దక్షిణాది నదీ బేసిన్ల సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, డీపీఆర్‌లు, అనుమతులను కాలపరిమితిలో పూర్తి చేయాలని కేంద్రాన్ని కోరారు. కేంద్ర-రాష్ట్ర సంబంధాల్లో పరస్పర విశ్వాసం, రాష్ట్రాల మధ్య సహకారం, సమష్టి అభివృద్ధి ప్రధాన లక్ష్యాలుగా సదరన్ జోనల్ కౌన్సిల్ పనిచేయాలని చంద్రబాబు ఆకాంక్షించారు. కౌన్సిల్‌లో తీసుకున్న నిర్ణయాలు త్వరితగతిన అమలు అయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. సిఎం చంద్రబాబు ప్రసంగాన్ని దక్షిణాది రాష్ట్రాల సిఎంలు ప్రశంసించారు. ఈ సమావేశంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, తమిళనాడు ముఖ్యమంత్రి జోసఫ్ విజయ్, కర్ణాటక సిఎం డికె శివకుమార్, తెలంగాణా డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, కేరళ సిఎం వి.డి. సతీషన్, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కె.కైలాష్ నాథన్, అండమాన్ నికోబార్ లెఫ్టినెంట్ గవర్నర్ అడ్మిరల్ డి.కె.జోషి సహ ఆయా రాష్ట్రాల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# నీళ్లు విడుదల చేయండి

>> లోని నింబగల్లు, రేణుమాలకులపల్లి, వ్యాసాపురం తదితర గ్రామాలకు చెందిన రైతులు ఉదయం మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామంవద్ద హంద్రీనీవా ప్రధాన కాలువ బ్రిడ్జిపై రాస్తారోకోకు ఉపక్రమించగా విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని రైతులు జాతీయ రహదారిపై ఆందోళన నిర్వహించకుండా అడ్డుకున్నారు. దీంతో రైతులు అక్కడి నుండి ఉరవకొండ మండల తహశీల్దార్ కార్యాలయం చేరుకొని కార్యాలయం ప్రధాన ద్వారా మూసివేసి అక్కడే బైటాయించారు. పంటలను కాపాడేందుకు నీరు ఇవ్వాలని నినాదాలతో హోరెత్తించారు. అయితే ఆ సమయంలో కార్యాలయంలో కిందిస్థాయి ఉద్యోగులు కొందరు మినహా అధికారులు ఒక్కరూ కూడా లేకపోవడంతో రైతులు అక్కడి నుండి ప్రధాన రహదారిపైకి చేరుకొని రాస్తారోకో చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ జనార్ధననాయుడు సిబ్బందితో అక్కడికి చేరుకొని రైతులను సర్దిచెపే ప్ర ప్రయత్నం చేయగా వారు ససేమిరా అన్నారు. దీంతో రైతులను బలవంతంగా పక్కకు తరలించారు. ఈక్రమంలోనే ఎస్ఐ హంద్రీనీవా అధికారులకు ఫోన్‌చేసి రైతుల ఆందోళన చేస్తున్న విషయాన్ని వారికి వివరించారు. అంతేగాక పలువురు రైతులను హంద్రీనీవా అధికారులతో మాట్లాడించారు. హెచ్‌ఎల్‌సి కింద సాగునీరు ఇవ్వమని ఆ అధికారులు ముందే ప్రకటించినట్లు హంద్రీనీవా కింద నీరు ఇవ్వమని మీరు ఎందుకు ప్రకటించలేదని, అలా ప్రకటించి ఉంటే తాము లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి మిరప, తదితర పెట్టుకునేవారం కాదన్నారు. ఇప్పుడు తీరా పంటలు పెట్టుకున్న తరువాత నీరు ఇవ్వమని తూములు మూసివేస్తే మేమెక్కడికి వెళ్లాలని ఫోన్‌లో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నీటి లభ్యత తక్కువగా ఉందని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమిదని, తాము ఏమీ చేయలేమని అధికారులు రైతులకు తేల్చిచెప్పారు. దీంతో రైతులు రెవెన్యూ అధికారులను కలిసి వినతిపత్రం సమర్పించి వెళ్దామని దాదాపు గంటపాటు వేచి చూసి అధికారులెవ్వరూ రాకపోవడంతో చేసేదేమీ లేక వెనుదిరగాల్సి వచ్చింది.

# చర్చలు విఫలం

>> సానుకూలంగా ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా వైద్యుల పదవీ విరమణ వయస్సును 60 యేళ్ల నుంచి 65 యేళ్లకు పెంచకూడదన్న డిమాండ్‌పైనా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు జూడా ప్రతినిధులు తెలిపారు.

**మరోసారి చర్చలకు పిలుపు**

తమ డిమాండ్లపై మరోసారి చర్చించేందుకు రెండు రోజుల్లో జూనియర్‌వైద్యులను పిలుస్తామని ఆరోగ్య శాఖ మంత్రి తెలిపినట్లు జూడా వెల్లడించింది. చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్న ఆశాభావాన్ని జూడాలు వ్యక్తం చేశారు.

**నేడు విజయవాడలో జూడాల విలేకరుల సమావేశం**

మంత్రి చర్చల వివరాలను వెల్లడించేందుకు జూనియర్ వైద్యుల సంఘం శుక్రవారం ఉదయం 11 గంటలకు విజయవాడలో విలేకరుల సమా వేశం నిర్వహించనుంది. ఈ సమావేశంలో ప్రభుత్వంతో జరిగిన చర్చల వివరాలు, మూడు డిమాండ్లపై వచ్చిన స్పందన, తదుపరి కార్యాచర ణను జూడా ప్రతినిధులు వెల్లడించనున్నారు. సమ్మె కొనసాగింపుపై కూడా విలేకరుల సమా వేశంలో స్పష్టత ఇచ్చే అవకాశం ఉంది.

# మూలపేటలో

>> న్నారు. ఈ క్రమంలో కోరమండల్ వంటి ప్రతిష్టాత్మక సంస్థ భారీ పెట్టుబడులతో శ్రీకాకుళం జిల్లాకు రావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇటీవలజరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా ప్రభుత్వం భూకేటాయింపులను ఖరారుచేసింది. ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణతో పాటు తదుపరి చర్యలను వేగవంతం చేయాలని ఏపీఐఐసి వీసీ అండ్ ఎండీ, పరిశ్రమల శాఖ సంచాలకులు, శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. 'మూలపేటలో కోరమండల్ పరిశ్రమ ఏర్పాటు శ్రీకాకుళం జిల్లా పారిశ్రామిక ప్రగతికి ఒక చారిత్రాత్మక ముందడుగు. రూ.2,250 కోట్ల పెట్టుబడులతో వచ్చే ఈ ప్రాజెక్టు ద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు జిల్లా ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపునిస్తుంది. పరిశ్రమల స్థాపన, పెట్టుబడుల ఆకర్షణ, స్థానిక యువతకు ఉపాధి కల్పనకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుంది' అని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

## వారం - వర్జ్యం

21-08-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, శుక్లపక్షం, మఖకార్తె
తి.నవమి రా.11.37
న.అనూరాధ ఉ.11.53
వ.సా.6.10-రా.7.58
దు1.ఉ.8.23-ఉ.9.13
దు2. మ.12.35-మ.1.25
రాహు.ఉ.10.30-మ.12.00 శుభ లేదు

## వార్తాఫలం

**మేషం :** వృత్తి ఉద్యోగాలలో ఎక్కువ శ్రద్ధ కనబరచి అనుకూల ఫలితాలు సాధిస్తారు. ప్రయాణాలు అనుకూలిస్తాయి.

**వృషభం :** మీ క్రింది స్థాయి ఉద్యోగులు మీపై కొండెములు చెప్పడం మీకు తల నొప్పిగా మారుతుంది.

**మిథునం :** ఉత్తర ప్రత్యుత్తరములకు, ప్రకటనల వారితో సంబంధ బాంధవ్యములు పెంచుకొంటారు. శ్రమ అధికంగా ఉంటుంది.

**కర్కాటకం :** నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడుతాయి. పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. క్రయ విక్రయాలలో లాభాలు.

**సింహం :** బంధువుల నుండి శుభవార్తలు అందుకుంటారు. సంగీత సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు. ప్రయాణాలు సౌలభ్యం.

**కన్య :** పూర్వపు మిత్రులను కలుసుకొని ఆనందంగా గడుపుతారు. ఆభరణాలు కొనుగోలు చేస్తారు. వస్త్రాలు కొనుగోలు.

**తుల :** కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. ఉద్యోగావకాశాలు అనుకూలిస్తాయి. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**వృశ్చికం :** చాకచక్యంగా వ్యవహరించి పనులు పూర్తి చేసుకుంటారు. కొత్త కాంట్రాక్టులు లభిస్తాయి. ఇంటా బయటా ప్రోత్సాహం.

**ధనుస్సు :** రావలసిన బాకీలు కొంత ఆలస్యంగా అందుతాయి. జీవిత భాగస్వామి నుండి ధనం లభిస్తుంది. వస్త్ర లాభం.

**మకరం :** మీరు తీసుకునే నిర్ణయాలు నలుగురిలో శ్లాఘించబడతాయి. వాహన సౌఖ్యం. నూతన విద్యావకాశాలు లాభిస్తాయి.

**కుంభం :** నైపుణ్యతతో ప్రతిభతో మెదడుకు పదునుపెట్టి వ్యాపారంలో లాభము తెస్తారు. వివాహ, ఉద్యోగ యత్నాలు ఫలిస్తాయి.

**మీనం :** ఇతరులకు మీరు ఇచ్చే సలహాలు వారికి ఎంతో ఉపకరిస్తాయి. కాంట్రాక్ట్‌లు దక్కుతాయి. సోదరుల కలయిక.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



న్యూఢిల్లీలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయిన జపాన్ రక్షణ మంత్రి షింజిరో కొయిజుమి

# లక్ష దాటిన ప్రవేశాలు

>> పెరిగింది. అదేవిధంగా, 2026-27లో 28,742 మంది విద్యార్థు లకు ప్రైవేట్‌స్కూళ్లలో సీట్లులభించాయి. ఇది మా ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం అని అన్నారు.

విద్యాహక్కు చట్టంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రభుత్వం విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టిందని, దాని ఫలితంగానే అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు పెరిగాయని మంత్రి తెలిపారు. సమాజంలోని ప్రతి పేద విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా ఆర్‌టిఇ చట్టాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

**5 బిల్లులకు ఏకగ్రీవ ఆమోదం:**

ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో పలు కీలక బిల్లులకు ఆమోదం లభించింది. రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ 5 ముఖ్యమైన బిల్లులను సభలో ప్రవేశపెట్టగా, మండలి వాటిని ఏకగ్రీవంగా ఆమోదించింది. విద్యా, గ్రంథాలయ, నైపుణ్యాభివృద్ధి రంగాలలో సంస్కరణల లక్ష్యంగా ప్రభుత్వం ఈ బిల్లులను రూపొందించింది. గురువారం శాసనమండలి సమావేశంలో మంత్రి లోకేష్ ఈ బిల్లులను సభ ముందు ఉంచారు. మండలి ఆమోదించిన బిల్లులలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ గ్రంథాలయాల సవరణ బిల్లు2026, ఏపి ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ సవరణ బిల్లు ఉన్నాయి. వీటితో పాటు ఏపి ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ సవరణ బిల్లు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాసంస్థల (ఉపాధ్యాయుల కేడర్‌లో రిజర్వేషన్) సవరణ బిల్లులను కూడా సభ ఆమోదించింది. రాష్ట్రంలో కొత్తగా ప్రైవేటు నైపుణ్య విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేసేందుకు ఉద్దేశించిన ఏపి ప్రైవేటు నైపుణ్య విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ బిల్లుకు కూడా మండలి ఆమోదముద్ర వేసింది. ఈ బిల్లులకు సభ్యులందరూ మద్దతు తెలపడంతో ఏకగ్రీవంగా ఆమోదం పొందినట్లు ప్రకటించారు.

## రాజ్యసభ సభ్యుడు లింగమనేని రమేశ్

# కుమారుడిపై కేసు నమోదు

## దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తా.. చట్టంపై పూర్తి నమ్మకం ఉంది: సంజూష్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు20:** హైదరాబాద్‌లోని ఇనార్బిట్ మాల్ ఎదురుగా ఈనెల 16న కారు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో లైఫ్‌స్టైల్ స్టోర్‌లో పనిచేస్తున్న భారతి ముఖి(26) మృతిచెందారు. రాజ్యసభ సభ్యుడు లింగమనేని రమేశ్ కుమారుడు సంజూష్ అతివేగంగా ఆస్టన్ మార్టిన్ కారు నడిపి యువతిని ఢీకొట్టినట్లు పోలీసులు గుర్తించారు. మృతురాలి సహచరుల ఫిర్యాదుతో మాదాపూర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు లింగమనేని సంజూష్‌పై భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్)లోని సెక్షన్ 106(1) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా,ప్రమాదం జరిగిన అనంతరం తాను ఎక్కడికీ వెళ్లిపోకుండా స్వయంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లినట్లు సంజూష్ తెలిపారు. జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలను పోలీసు అధికారులకు తెలియజేసినట్లు పేర్కొన్నారు. దర్యాప్తులో పోలీసులకు పూర్తిగా సహకరించానని చెప్పారు. ప్రమాదం జరిగిన వెంటనే గాయపడిన భారతి ముఖిని ఆసుపత్రికి తరలించడం, అనంతరం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి అధికారులకు సమాచారం ఇవ్వడం ద్వారా తాను చట్టపరమైన దర్యాప్తుకు సహకరించానని తెలిపారు. ఘటనకు సంబంధించిన అన్ని వాస్తవాలను పోలీసులు సమగ్రంగా పరిశీలించి, ప్రమాదానికి ముందు మరియు తరువాత జరిగిన పరిణామాలను పరిగణనలోకి తీసుకొని నిబంధనల ప్రకారం పోలీసులు విచారణ జరుపుతున్నారు అన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో తన శారీరక పరిస్థితిని నిర్ధారించేందుకు పోలీసులు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించినట్లు సంజుష్ తెలిపారు. ఇందులో బ్రీత్ అనలైజర్ టెస్ట్, యూరిన్ టెస్ట్, బ్లడ్ టెస్ట్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ మూడు పరీక్షల్లోనూ నెగెటివ్ ఫలితాలు వచ్చినట్లు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి దర్యాప్తులో పోలీసులకు పూర్తి సహకారం అందిస్తానని సంజుష్ తెలిపారు. జరిగిన ఘటనపై పోలీసుల దర్యాప్తుకు పూర్తిగా సహకరిస్తానని, దర్యాప్తులో అవసరమైన ప్రతి సమాచారాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. మన దేశ చట్టవ్యవస్థ, న్యాయవ్యవస్థపై తనకు పూర్తి నమ్మకం మరియు విశ్వాసం ఉందని, దర్యాప్తు ద్వారా వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆశిస్తున్నట్లు సంజుష్ పేర్కొన్నారు.

# స్థానిక సంస్థలకు ప్రత్యక్ష ఎన్నికలొద్దు: సిపిఎం

**విజయవాడ,ఆగస్టు 20,ప్రభాతవార్తప్రతినిధి:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మేయర్, ఛైర్ పర్సన్ పోస్టులకు ప్రత్యక్ష ఎన్నికల పద్దతిని సిపిఎం వ్యతిరేకిస్తున్నది.ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కమిటీ కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేసారు. దీనివల్ల ప్రజలకు దగ్గరగా వుండే కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, యంపిటీసీలు, జెడ్పిటీసీలకు ప్రాధాన్యతవుండదు. అధికారం కేంద్రీకృతమై పోతుంది. 73, 74 రాజ్యాంగ సవరణ స్ఫూర్తి దెబ్బతింటుంది. ప్రజాస్వామ్యం బలహీన పడుతుంది. అందువల్ల ప్రస్తుత విధానాన్నే కొనసాగించాలి. వెనుకబడిన తరగతులకు 34 రిజర్వేషన్లు ఖాయం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ స్వాగతిస్తున్నది. ఇదిఅమల్లోకి రావాలంటే రిజర్వేషన్లపై ఉన్న 50 పరిమితిని సవరించాలి. ఇందుకు పార్లమెంటు చట్టం చేయాలి. కేంద్ర ఎన్డీయే ప్రభుత్వంలో భాగస్వామిగాఉన్న తెలుగుదేశం, జనసేన, బిజెపిలు ఈ రాజ్యాంగ సవరణ జరిగేటట్లు చూడాలన్నారు.

# సాంకేతిక రక్షణ కవచం

>> అడవిలో ప్రతి అణువును కేంద్ర కార్యాలయం నుంచి పర్యవేక్షించే విధంగా ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు పట్ల పవన్ కల్యాణ్ ఆసక్తి కనబర్చారు. జియోస్పేషియల్ డ్యాష్‌బోర్డ్, డ్రోన్ ఆధారిత పర్యవేక్షణ, కెమెరా ట్రాప్‌ల ద్వారా వన్యప్రాణుల సంఖ్యపై ఎప్పటికప్పుడు విశ్లేషణ, అటవీ మార్గాల్లో ప్రయాణించే వాహనాల ట్రాకింగ్, గస్తీ పర్యవేక్షణ, అటవీ అగ్నిప్రమాదాలు, మానవ- వన్యప్రాణి ఘర్షణల పర్యవేక్షణ తదితర కార్యక్రమాలన్నింటినీ ఒకే చోటు నుంచి పర్యవేక్షించే వెసులుబాటు కలుగుతుందని అభిప్రాయపడ్డారు.

**సిబ్బందిలో జవాబుదారీతనం పెంచేలా చర్యలు**

కర్ణాటక అమలు చేస్తున్న ఈగస్తు మొబైల్ అప్లికేషన్ ద్వారా కూడా అద్భుత ఫలితాలు సాధించవచ్చని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ముఖ్యంగా క్షేత్రస్థాయి సిబ్బంది విధుల పర్యవేక్షణ, వారి భద్రతా చర్యల్లో ఇది కీలకంగా వ్యవహరిస్తుందని, గస్తీ, హాజరు, నిరంతర మార్గ నిర్దేశం, నివేదికల సమర్పణకు ఇది సమర్థవంతమైన సాధనంగా పని చేస్తోందని, ఆంధ్రప్రదేశ్ అటవీశాఖలో ఇప్పటికే అమలులో ఉన్న ఫారెస్ట్ పోర్టల్, సింగిల్ సైన్‌ఆన్ వ్యవస్థలను అనుసంధానించి ఈగస్తు మొబైల్ యాప్ రూపొందించాలని డి.సిఎం సూచించారు. ఇది వ్యవస్థలో జవాబుదారీతనాన్ని పెంపొందిస్తుందన్నారు.

**సత్వర పరిహారం అందించేలా..**

వన్యప్రాణుల వల్ల అటవీ సరిహద్దు గ్రామాల్లో జరిగే పంటల నష్టానికి పరిహారం చెల్లించే ప్రక్రియను కూడా డిజిటలీకరణ ద్వారా మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ఏర్పాట్లు చేయాలని, తద్వారా పంటల నష్టంపై నివేదికలు, రైతులకు పరిహారం చెల్లింపుల వ్యవస్థలో మరింత పారదర్శకత వస్తుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. వేగంగా పరిహారం చెల్లించే వెసులుబాటు కలుగుతుందన్నారు. జిఐఎస్ ఆధారిత ధ్రువీకరణ వ్యవస్థను తక్షణం అమలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు.

**అటవీ సరిహద్దులకు చట్టబద్ధమైన భద్రత**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మార్గనిర్దేశకత్వంలో, అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ నాయకత్వంలో ఇప్పటికే అటవీ సరిహద్దుల డిజిటలైజేషన్ ప్రక్రియను రాష్ట్రంలో కూడా చేపట్టిన విషయాన్ని పవన్ కల్యాణ్ గుర్తు చేశారు. తద్వారా అటవీ సరిహద్దుల చట్టబద్ధతను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. దీంతో పాటు హనుమాన్ ద్వారా ఇప్పటికే మానవ- వన్యప్రాణుల ఘర్షణల నివారణ, విశ్లేషణ వ్యవస్థలను విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. ఇందుకోసం ఏఐ ఆధారిత ప్రమాద అంచనా వ్యవస్థలు, వన్యప్రాణుల సంచారానికి సంబంధించిన డ్యాష్‌బోర్డులు సిద్ధం చేసినట్లు స్పష్టం చేశారు.

**కర్ణాటకతో పరస్పర సాంకేతిక సహకారం..**

ఇప్పటికే కర్ణాటక అటవీ శాఖతో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధం వంటి పలు ఒప్పందాలు చేసుకున్నామని, పరస్పర సాంకేతిక సహకారం దిశగా అడుగులు వేయనున్నట్లు డి.సిఎం పవన్ కల్యాణ్ వివరించారు. అందుకోసం ఇరు రాష్ట్రాల అటవీశాఖల ఆధ్వర్యంలో సంయుక్త సాంకేతిక వర్క్‌షాప్‌లు, పత్రాల మార్పిడి, అవసరం ఉన్న చోట సోర్స్ కోడ్ భాగస్వామ్యం, జిఐఎస్‌లో ఉత్తమ విధానాల మార్పిడి, ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సిస్టమ్‌కు సంబంధించి వర్క్‌షాప్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు.

21-8pg3exHMNWJQEBCRP:21-8pg3exHMNWJQEBCRP.qxd 8/21/2026 12:02 AM Page 1



# సర్ క్లెయిమ్‌లు, అభ్యంతరాల విచారణ ప్రక్రియ వేగవంతం చేయాలి

## రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్



**విజయవాడ, ఆగస్టు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ2026 ప్రక్రియను, క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారాన్ని మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ ఆదేశించారు. సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, అదనపు డిఇఒలు, డిప్యూటీ డిఇఒలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు సిఇఒ ఎస్.ఢిల్లీ రావు తదితరులు పాల్గొన్నారు. ఓటర్లకు మరింత సులభంగా సేవలు అందించేందుకు ఈ నెల 22, 23, 29, 30 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ప్రచార దినాలు నిర్వహించనున్నట్లు సిఇఒ వెల్లడించారు. ఆయా రోజుల్లో బూత్ స్థాయి అధికారులు, రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉండి, ఓటర్ల జాబితా పరిశీలన, దరఖాస్తుల స్వీకరణ, మార్గదర్శకాలను అందిస్తారని స్పష్టం చేశారు. మ్యాపింగ్ కాని ఓటర్లకు, మ్యాపింగ్‌లో వ్యత్యాసాలు ఉన్న వారికి నోటీసులు అందజేయడం, క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం, బిఎల్‌ఓలతో బుక్ ఎ కాల్ పెండింగ్ సమస్యలు, ఎన్‌జిఎస్‌పి పోర్టల్‌లో వచ్చిన ఫిర్యాదులపై సిఇఒ నిశితంగా సమీక్షించారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం క్లెయిమ్‌లు, అభ్యంతరాల విచారణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సిఇఒ ఆదేశాలు జారీచేశారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారంలో ఓటర్ల నమోదు అధికారులకు అర్ధన్యాయ అధికారాలు ఉన్నాయని, ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వ్యవహరించాలని స్పష్టం చేశారు. విచారణల సమయంలో ఓటర్లు సమర్పించే ధ్రువీకరణ పత్రాలను బిఎల్‌ఓ యాప్ ద్వారా మాత్రమే అప్‌లోడ్ చేయాలని, ఇందుకు బిఎల్‌ఓలకు సరైన శిక్షణ ఇవ్వాలని సూచించారు.

# ప్రతి బోటు.. ప్రతి మత్స్యకారుడి వివరాలు నమోదు చేయాలి

- ఘటన తర్వాత స్పందించడం కంటే.. ముందే అప్రమత్తంగా ఉండాలి
- గల్లంతైన మత్స్యకారుల ఆచూకీపై సిఎం చంద్రబాబు సమీక్ష
- 216 నాటికల్ మైళ్ల పరిధిలో గాలిస్తున్నట్లు అధికారుల వివరణ



**విజయవాడ, ఆగస్టు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** సముద్రంలో మత్స్యకారులు గల్లంతైన ఘటనలో తర్వాత స్పందించడం కాకుండా.. ముందస్తు జాగ్రత్తలతో ప్రమాదాలను నివారించేలా ఎస్ఓపి అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ప్రతి బోటు, ప్రతి మత్స్యకారుడి వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని, వేటకు వెళ్లే వారి పూర్తి సమాచారం అందుబాటులో ఉంటేనే అత్యవసర సమయాల్లో సత్వర సాయం అందించగలమని స్పష్టం చేశారు. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలంలోని ఓడలరేవు, దుమ్ములపేట, వాసలతిప్ప గ్రామాలకు చెందిన ఏడుగురు మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లి గల్లంతైన ఘటనపై గురువారం కూడా క్యాంపు కార్యాలయంలో సిఎం చంద్రబాబు మత్స్యశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం చేపడుతున్న గాలింపు చర్యలు, వివిధ విభాగాల మధ్య సమన్వయం, చేపట్టాల్సిన చర్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**216 నాటికల్ మైళ్ల పరిధిలో గాలింపు**

ఈ నెల 3వ తేదీన ఏడుగురు మత్స్యకారులు బోటులో వేటకు వెళ్లారని, పది రోజుల తర్వాత తిరిగి వస్తామని కుటుంబ సభ్యులకు చెప్పినట్లు అధికారులు సీఎంకు తెలిపారు. ఈ నెల 16న మత్స్యకారుల ఆచూకీ లభించడం లేదని కుటుంబ సభ్యులు అధికారులకు సమాచారం ఇచ్చినట్లు వివరించారు. సమాచారం అందిన వెంటనే కోస్ట్‌గార్డ్, మెరైన్ పోలీసుల సహకారంతో గాలింపు చర్యలు ప్రారంభించినట్లు చెప్పారు. బోటులో ట్రాన్స్‌పాండర్ ఏర్పాటు, బోటు ఒంటరిగా ఎందుకు సముద్రంలోకి వెళ్లింది? బోటు గల్లంతైన విషయం అధికారులకు ఎప్పుడు తెలిసింది? తెలిసిన వెంటనే గాలింపు చర్యలు ఎప్పుడు ప్రారంభించారు? అనే అంశాలపై సిఎం అధికారులను ప్రశ్నించారు. గాలింపు చర్యలను మరింత విస్తృతం చేయాలని సూచించారు. ఇప్పటికే చెన్నైలోని కోస్ట్‌గార్డ్ హెడ్‌క్వార్టర్స్‌తో రాష్ట్ర మత్స్యశాఖ అధికారులు మాట్లాడినట్లు అధికారులు తెలిపారు. ఎపికి చెందిన బోటు గల్లంతైన విషయాన్ని అండమాన్ సహా బంగ్లాదేశ్ కు కూడా చెన్నైలోని కోస్ట్‌గార్డ్ ఉన్నతాధికారుల ద్వారా తెలియజేసినట్లు చెప్పారు. నేవీ డార్నియర్ విమానాల ద్వారా 216 నాటికల్ మైళ్ల పరిధిలో గాలింపు నిర్వహించినట్లు సిఎంకు వివరించారు. వేటకు వెళ్లే మత్స్యకారులకు అందుతున్న సాంకేతిక సహాయం, రోజువారీ సమన్వయ వ్యవస్థలపైనా చంద్రబాబు సమీక్షించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి మత్స్యకారులు ప్రమాదాల బారిన పడకుండా చూడాలని ఆదేశించారు. గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అధికారులను సిఎం చంద్రబాబు ఆదేశించారు.

**భద్రతలో మత్స్యకారులు మరింత అప్రమత్తంగా ఉండాలి: హోంమంత్రి అనిత**

సముద్రంలో గల్లంతయిన అప్పన్నను క్షేమంగా గుర్తించి కుటుంబ సభ్యుల వద్దకు చేర్చేందుకు అందుబాటులో ఉన్న అన్ని వనరులను వినియోగించాలని ఆదేశించారు. సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారుల భద్రత విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని అనిత సూచించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, గాలింపు చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని హోంమంత్రి అనిత తెలిపారు. ఈ నెల 16న 8 మంది మత్స్యకారులు వేటకు వెళ్లగా సముద్ర తీరం నుంచి 12 నాటికల్ మైళ్ల దూరంలో బోటు ప్రమాదం జరిగిందని, ఈ ఘటనలో అప్పన్న గల్లంతయ్యారని అధికారులు మంత్రికి వివరించారు. మిగిలిన మత్స్యకారుల పరిస్థితిపైనా అనిత ఆరా తీశారు. గల్లంతైన అప్పన్నను క్షేమంగా గుర్తించి కుటుంబ సభ్యుల వద్దకు చేర్చేందుకు అందుబాటులో ఉన్న అన్ని వనరులను వినియోగించాలని ఆదేశించారు. సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారుల భద్రత విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని అనిత సూచించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, గాలింపు చర్యలను ఎప్పటికప్పుడు

# మెడికో ప్రియాంక కేసు సీన్ రీక్రియేషన్

## కొనసాగుతున్న నిందితుల పోలీసు కస్టడీ

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 20 ప్రభాతవార్త:** తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం వైద్య విద్యార్థిని ప్రియాంక కేసులో నిందితుల పోలీసు కస్టడీ కొనసాగుతోంది. సీన్ రిక్రియేషన్ తోపాటు పోలీసుల దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. రెండు రోజుల పోలీసు కస్టడీలో ఉన్న ఏ1 సురవరపు దస్వంత్, ఏ2 ఆండ్రూ ఎడ్వర్డ్ జోసెఫ్‌ల నుంచి పోలీసులు కీలక వివరాలు రాబడుతున్నారు. ప్రియాంక స్కూటీని కారు ఢీకొట్టిన ఘటనకు సంబంధించి ఆధారాలను సేకరిస్తున్నారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు కీలకమైన సీన్ రీక్రియేషన్ నిర్వహించారు. తొలుత మోరంపూడిలోని ద్వారకానగర్‌లో ఉన్న ఏ1 దస్వంత్ ఇంటికి నిందితుడిని తీసుకెళ్లి ఘటనకు సంబంధించిన పరిస్థితులను పరిశీలించారు. అనంతరం లాలాచెరువులోని హనుమ ఎన్‌క్లేవ్ అపార్టుమెంట్‌లో ఉన్న ఏ2 జోసఫ్ ఇంటి వద్ద కూడా సీన్ రీక్రియేషన్ చేశారు. అనంతరం ఘటన జరిగిన ఏవీ అప్పారావు రోడ్డులోని ప్రసాదిత్య మాల్ వద్దకు నిందితులను తీసుకెళ్లి ఘటన ఎలా జరిగిందన్న అంశంపై పోలీసులు వివరాలు సేకరించారు. స్కూటీని కారు ఢీకొట్టిన విధానం, నిందితుల కదలికలు, ఘటనకు ముందు, తరువాత జరిగిన పరిణామాల పై ప్రత్యేకంగా ఆరా తీస్తున్నారు. సీన్ రీక్రియేషన్ తో పాటు ఇతర సాంకేతిక ఆధారాలను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. సేకరించిన ఆధారాలు, నిందితుల వాంగ్మూలాలను క్రోడీకరించి దర్యాప్తు నివేదికలో పొందుపరుస్తున్నారు. కేసులో వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చేందుకు దర్యాప్తును వేగవంతం చేశారు.



# సమ్మెలోనూ జూడాలు సేవాభావం

## రక్తదానంతో మానవత్వం చాటిన జూనియర్ వైద్యులు

**గుంటూరు(మెడికల్), ఆగస్టు 20 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ జూనియర్ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న రాష్ట్రవ్యాప్త సమ్మె 11వ రోజుకు చేరుకుంది. మూడో దశలో నాలుగో రోజైన గురువారం గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల జూనియర్ వైద్యులు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలోని సూపరింటెండెంట్ కార్యాలయం సమీపంలో శాంతియుత నిరసన కొనసాగించారు. ఇంటర్న్ వైద్యులు, పిజి వైద్యులు, సీనియర్ రెసిడెంట్ వైద్యులు తదితరులు చురుగ్గా పాల్గొన్నారు. ఆందోళనలో భాగంగా సుమారు 125 మంది ఇంటర్న్, రెసిడెంట్ వైద్యులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సమ్మె కొనసాగుతున్నప్పటికీ ప్రజారోగ్యం, సేవ పట్ల తమ నిబద్ధతను చాటుకున్నారు. మరో 15 మంది పిజి వైద్యులు స్వచ్ఛంద రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. భారత వైద్యుల సంఘం యువ వైద్యుల విభాగం రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ కార్తీక్ ఆరే నిరసన శిబిరాన్ని సందర్శించి జూనియర్ వైద్యులకు, వారి డిమాండ్లకు సంఘీభావం తెలిపారు. గుంటూరు వైద్యుల సంఘం ప్రతినిధులు కూడా నిరసన ప్రదేశాన్ని సందర్శించి మద్దతు ప్రకటించారు. సంఘం అధ్యక్షుడు డాక్టర్ దేవకుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ స్వరూప్ కాంత్, ఆర్థోపెడిక్స్ విభాగం ఆచార్యుడు, అధిపతి డాక్టర్ పి. అనిల్ బాబు, కోశాధికారి డాక్టర్ కవిత, సంయుక్త కార్యదర్శి డాక్టర్ రవీంద్ర కుమార్, డాక్టర్ శివ గోపాల్ తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ వైద్య కళాశాలలకు చెందిన జూనియర్ వైద్యుల సంఘాల ప్రతినిధులు తమ తమ జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించారు. జూనియర్ వైద్యులు లేవనెత్తిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత మంత్రులు, ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేయడానికి చొరవ తీసుకోవాలని కోరారు. అర్థవంతమైన చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారం చూపి, పరస్పర ఆమోదయోగ్యమైన నిర్ణయానికి రావాలని విజ్ఞప్తి చేశారు. పాటలతో నిరసన: అనంతరం జూనియర్ వైద్యులు తమ ఇంటర్న్‌షిప్, పిజి శిక్షణ సమయంలో ఎదుర్కొంటున్న అనుభవాలు, ఇబ్బందులు, సమస్యలను ప్రతిబింబించే పాటలను ఆలపించారు. పాటల ద్వారా తమ ఆవేదనను, నిరసనను శాంతియుతంగా, సృజనాత్మకంగా వ్యక్తం చేశారు.

# ఒంగోలులో విషాదం

## లిఫ్ట్ దిగుతూ మహిళ మృతి

**ఒంగోలు(క్రైమ్), ఆగస్టు 20 ప్రభాతవార్త:** ఒంగోలు నగరంలోని సూర్య టవర్స్ అపార్ట్‌మెంట్‌లో చోటుచేసుకున్న లిఫ్ట్ ప్రమాదంలో 50 ఏళ్ల మహిళ మృతి చెందారు. కుమార్తె, మనవడితో కలిసి లిఫ్ట్‌లో ప్రయాణించిన వినీత ప్రమాదానికి గురయ్యారు. లిఫ్ట్ ఒక అంతస్తుకు చేరుకున్న అనంతరం కుమార్తె, మనవడు ముందుగా బయటకు వెళ్లారు. వినీత కూడా లిఫ్ట్ నుంచి బయటకు వచ్చేందుకు సిద్ధమవుతున్న సమయంలో అనూహ్యంగా లిఫ్ట్ కిందకు కదిలినట్లు సమాచారం. ఆ సమయంలో లిఫ్ట్ గేట్లు పూర్తిగా మూసుకోకపోవడంతో ఆమె బయటకు రావడానికి ప్రయత్నించగా ఫ్లోర్, లిఫ్ట్ మధ్య ఇరుక్కుపోయారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆమె కుమార్తె తీవ్ర ఆందోళనకు గురై సహాయం కోసం కేకలు వేయగా అపార్ట్‌మెంట్‌లోని ఇతర నివాసితులు అక్కడికి చేరుకున్నారు. లిఫ్ట్ గేటును తెరిచి వినీతను బయటకు తీసేందుకు స్థానికులు తీవ్రంగా ప్రయత్నించారు. కొంతసేపటి అనంతరం ఆమెను లిఫ్ట్ నుంచి బయటకు తీసి అత్యవసరంగా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో వైద్యులు చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగించినప్పటికీ ఆమె ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అందులో వినీత కుమార్తె లిఫ్ట్ గేటును తెరిచి తల్లిని బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. చుట్టుపక్కల వారు కూడా అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో అపార్ట్‌మెంట్ వాసుల్లో భయాందోళన నెలకొంది. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా నగరంలోని అపార్ట్‌మెంట్‌లు, వాణిజ్య భవనాల్లో ఉన్న లిఫ్ట్‌ల భద్రతా ప్రమాణాలను అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

# విశాఖపట్నం స్కూల్ ఘటనపై విద్యాశాఖ తీవ్ర దిగ్భ్రాంతి

## ముగ్గురు సభ్యుల కమిటీ విచారణకు ఆదేశం

**విజయవాడ, ఆగస్టు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** విశాఖపట్నంలోని లిటిల్ గార్డెన్ స్కూల్‌లో మైనర్ విద్యార్థి మృతి చెందిన ఘటన అత్యంత దురదృష్టకరం, బాధాకరం. ప్రభుత్వం ఈ ఘటనను తీవ్రంగా పరిగణిస్తోందని పాఠశాల విద్యాశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఘటన జరిగిన వెంటనే సంబంధిత విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టి ప్రాథమిక నివేదికను సమర్పించారు. ఆ ప్రాథమిక నివేదిక ఆధారంగా వాస్తవాలను సమగ్రంగా పరిశీలించేందుకు త్రీమెన్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ఇందులో విశాఖపట్నం రీజినల్ జాయింట్ డైరెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి, రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్‌డిఓ) సభ్యులుగా ఉంటారు. అదేవిధంగా, విద్యార్థులతో ఉపాధ్యాయులు సున్నితంగా, బాధ్యతాయుతంగా, మానవతా దృక్పథంతో వ్యవహరించేలా అవసరమైన సెన్సిటైజేషన్ కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నా మని పేర్కొన్నారు. విద్యార్థుల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు ఆ ప్రకటనలో పేర్కొంది. త్రీమెన్ కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి తగిన చర్యలు తీసుకోబడతాయని పాఠశాల విద్యాశాఖ స్పష్టం చేసింది.

# ఎపిపిఎస్సీ, డిఎస్సీల మధ్య వ్యత్యాసం జగన్‌కు తెలియదు: మంత్రి లోకేష్



**విజయవాడ, ఆగస్టు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత జగన్‌కు ఎపిపిఎస్సీ, డిఎస్సీల మధ్య గల వ్యత్యాసం కూడా తెలియదని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆరోపణలు చేసారు. జగన్ అజ్ఞానం వల్లే గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. ఈ మేరకు జగన్ పాత ప్రెస్‌మీట్ వీడియోను లోకేశ్ గురువారం ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. "ఎపిపిఎస్సీ అంటే ఏమిటో తెలియదు, డిఎస్సీ అంటే ఏమిటో తెలియదు. రెండూ ఒకటే అని జగన్ భావిస్తున్నార్లు" అంటూ లోకేశ్ తన పోస్ట్‌లో ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని నియామక వ్యవస్థలపై జగన్‌కు ఉన్న అవగాహన లోపం వల్లే గత ఐదేళ్ల పాలనలో ఒక్క డిఎస్సీని కూడా నిర్వహించలేకపోయారని విమర్శించారు. ఉద్యోగ నియామకాలపై అసెంబ్లీలో జరిగే చర్చ నుంచి కూడా జగన్ పారిపోతున్నారని ఆక్షేపించారు. ఎపిపిఎస్సీ (ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్), డిఎస్సీ (జిల్లా ఎంపిక కమిటీ) ఈ రెండు వేర్వేరు వ్యవస్థలనే కనీస పరిజ్ఞానం కూడా జగన్‌కు లేదని లోకేశ్ విమర్శించారు.

**టీచర్ కొట్టడంతో విద్యార్థి మృతి బాధాకరం: మంత్రి లోకేశ్**

విశాఖలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో టీచర్ కొట్టడంతో ఆరేళ్ల ప్రణయ్ తేజ్ మృతి చెందటం బాధాకరమని మంత్రి నారా లోకేశ్ అన్నారు. బాధ్యులపై, సంబంధిత స్కూలు యాజమాన్యంపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రణయ్ తేజ్ తల్లిదండ్రులకు ప్రగాఢ సంతాపం తెలియజేసారు. 'ధైర్యంగా ఉండండి.. మీకు కలిగిన నష్టం ఎవ్వరూ పూడ్చలేనిది.. తమ ప్రభుత్వం మీకు అన్నివిధాలా అండగా ఉంటుంది' అని మంత్రి లోకేశ్ భరోసా ఇచ్చారు. ఈ మేరకు 'ఎక్స్'లో చేసిన పోస్టులో పేర్కొన్నారు. ప్రణయ్ తేజ తల్లిదండ్రులకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేసారు.

# విశాఖ జూపార్క్ వద్ద పోలీస్ ఎస్కార్ట్ వాహనం ప్రమాదంపై హోంమంత్రి అనిత ఆరా

**విజయవాడ, ఆగస్టు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** విశాఖ జూపార్క్ వద్ద పోలీస్ ఎస్కార్ట్ వాహనం ప్రమాదంపై హోంమంత్రి అనిత ఆరా తీసారు. విశాఖ పోలీస్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకుని అవసరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులకు హోంమంత్రి అనిత సూచించారు. ప్రమాదంలో గాయపడిన కానిస్టేబుళ్ల ఆరోగ్య పరిస్థితిని పోలీస్ కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు. విశాఖ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పోలీసు సిబ్బందికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. గాయపడిన కానిస్టేబుళ్ల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని పోలీసు ఉన్నతాధికారులకు సూచన చేసారు. గాయపడిన కానిస్టేబుళ్లు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# మిలాద్ ఉన్ నబీ సెలవు తేదీ మార్పు

**విజయవాడ, ఆగస్టు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో మిలాద్ ఉన్ నబీ ప్రభుత్వ సెలవు తేదీని మార్చారు. గతంలో ఆగస్టు 25న సెలవుగా ప్రకటించగా తాజాగా ఆగస్టు 26, బుధవారానికి మార్చుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ముస్లిం మత పెద్దల అభ్యర్థన, నూతన చంద్ర దర్శనాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా మిలాద్ ఉన్ నబీ సెలవును ఆగస్టు 26కే ఖరారు చేసింది. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఒకే రోజు ఈ పండగకు ప్రభుత్వ సెలవు అమల్లో ఉండనుంది.

# ఎంఎస్ఎంఇలకు అంతర్జాతీయ మార్కెట్ అవకాశాలు

- విశాఖలో అంతర్జాతీయ రివర్స్ బయ్యర్‌సెల్లర్ మీట్
- మూడు రోజులు పాటు సమావేశాలు
- 25 దేశాల నుంచి 40 మందికి పైగా కొనుగోలుదారులు 250కుపైగా ఎంఎస్ఎంఇలు హాజరు




**విశాఖపట్నం, ఆగస్టు 20 ప్రభాతవార్త:** రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఎంఎస్ఎంఈ పెర్ఫార్మెన్స్ (ఆర్ఏఎంపీ) పథకం కింద ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఎంఈడీసీ), ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్ఐఈవో)తో కలిసి నిర్వహిస్తున్న అంతర్జాతీయ రివర్స్ బయ్యర్-సెల్లర్ మీట్ (ఆర్బీఎస్ఎం)ను గురువారం విశాఖపట్నంలో ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకరరావు ప్రారంభించారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో ఎపి ఎంఎస్ఎంఇడిసి డైరెక్టర్లు నీలపు విజయానందరెడ్డి, ముగడ రాజారావు, ప్రధాన విజయరామ్, పి.వి.వి. సత్యనారాయణమూర్తి, డాక్టర్ చిన్నరాజు గుడిపూడి, నల్లే వీర ప్రసన్నకుమార్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఫీయో ప్రతినిధులు, విదేశీ కొనుగోలుదారులు, పరిశ్రమల సంఘాల ప్రతినిధులు, పాల్గొంటున్న ఎంఎస్ఎంఈలు తదితరులు పాల్గొన్నారు. ఆగస్టు 19 నుంచి 21 వరకు మూడు రోజుల పాటు జరుగుతున్న ఈ కార్యక్రమంలో 25 దేశాల నుంచి 40 మందికి పైగా అంతర్జాతీయ కొనుగోలుదారులు, ఆంధ్రప్రదేశ్‌లోని 250కు పైగా ఎంఎస్ఎంఈ లు పాల్గొంటున్నాయి. ఎగుమతి అవకాశాలు, వాణిజ్య భాగస్వామ్యాలు, వ్యాపార ఆర్డర్లకు దారితీసేలా కొనుగోలుదారులు ఎంఎస్ఎంఇల మధ్య నిర్మిత వన్‌టువన్ వ్యాపార సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రారంభ కార్యక్రమంలో ప్రసంగించిన ఎపి ఎంఎస్ఎంఇడిసి చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకరరావు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ఆర్థిక వ్యవస్థకు ఎంఎస్ఎంఇలు వెన్నెముకగా నిలుస్తున్నాయని అన్నారు. ఉపాధి కల్పన, సమతుల్య ప్రాంతీయ అభివృద్ధి, సమగ్ర ఆర్థిక వృద్ధిలో ఎంఎస్ఎంఇల పాత్ర కీలకమని పేర్కొన్నారు. పారిశ్రామికవేత్తలు కొత్త సంస్థలను స్థాపించడం, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడం, ఉత్పత్తుల నాణ్యతను మెరుగుపరచడం, ఆర్థిక వనరులను పొందడం, దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లను నేరుగా చేరుకోవడానికి అనుకూలమైన వాతావరణాన్ని ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, సముద్ర ఉత్పత్తులు, సుగంధ ద్రవ్యాలు, బియ్యం, వస్త్రాలు, రసాయనాలు, ఇంజినీరింగ్ ఉత్పత్తులు తదితర రంగాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ బలాలను అంతర్జాతీయంగా పోటీపడగల ఉత్పత్తులుగా మార్చేందుకు విలువ ఆధారిత ఉత్పత్తులు, మెరుగైన ప్యాకేజింగ్, తగిన ధ్రువపత్రాలు, అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాల పాటింపుపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక పరిశ్రమలకు అంతర్జాతీయ మార్కెట్లకు మధ్య ఉన్న దూరాన్ని ఆర్బిఎస్ఎం వంటి కార్యక్రమాలు తగ్గిస్తున్నాయని చైర్మన్ తెలిపారు. అంతర్జాతీయ కొనుగోలుదారులను నేరుగా రాష్ట్రానికి తీసుకురావడం ద్వారా ఎంఎస్ ఎంఈ లకు కీలకమైన మార్కెట్ అనుసంధానాన్ని ఈ కార్యక్రమం అందిస్తోందన్నారు. పాల్గొంటున్న ఎంఎస్ఎంఇలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, కొనుగోలుదారుల నిర్దిష్ట అవసరాలను అర్థం చేసుకుని, కార్యక్రమం అనంతరం కూడా నిరంతరంగా వారితో సంప్రదింపులు కొనసాగించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ముందుకు తీసుకెళ్తున్న 'వన్ ఫ్యామిలీ - వన్ ఎంటర్‌ప్రెన్యూర్' లక్ష్యాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. గ్రామీణ స్థాయి నుంచే ఔత్సాహికతను ప్రోత్సహించడం, స్వయం ఉపాధి, వ్యాపార అవకాశాలను విస్తరించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఇప్పటికే ఉన్న, కొత్తగా వ్యాపారాలు ప్రారంభించాలనుకునే ఔత్సాహికులకు సామర్థ్యాభివృద్ధి, మార్కెట్ అనుసంధానం, సాంకేతికత స్వీకరణ, ఇతర సహాయక చర్యల ద్వారా ఏపీ ఎంఎస్ఎంఇడిసి నిరంతరం మద్దతు అందిస్తుందని చెప్పారు. కార్యక్రమానికి స్వాగతం పలికిన ఫీయో జాయింట్ డైరెక్టర్ జనరల్ కె.ఉన్నికృష్ణన్ మాట్లాడుతూ, విశ్వసనీయమైన అంతర్జాతీయ కొనుగోలుదారులను గుర్తించడం, అంతర్జాతీయ మార్కెట్లను నేరుగా చేరుకోవడం ఎంఎస్ఎంఇలు ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లలో ఒకటని అన్నారు. ఈ ఆర్బీఎస్ఎంలో పాల్గొంటున్న అంతర్జాతీయ కొనుగోలుదారులు వ్యవసాయ ఉత్పత్తులు, ప్రాసెస్డ్ ఫుడ్, సుగంధ ద్రవ్యాలు, బియ్యం, సముద్ర ఉత్పత్తులు, ఫుడ్ ఇంగ్రిడియంట్స్, రసాయనాలు, తయారీ, విలువ ఆధారిత ఉత్పత్తుల కొనుగోలుపై ఆసక్తి చూపుతున్నారు. వన్‌టువన్ సమావేశాల ద్వారా ఎంఎస్ఎంఇలు తమ ఉత్పత్తులు, సామర్థ్యాలను అంతర్జాతీయ కొనుగోలుదారులకు పరిచయం చేయడంతో పాటు మార్కెట్ అనుకూలతను అంచనా వేసుకోవడం, ఎగుమతులు, సోర్సింగ్, ఉత్పత్తి అభివృద్ధి, దీర్ఘకాలిక వాణిజ్య భాగస్వామ్యాలపై చర్చించే అవకాశం లభిస్తోంది. వ్యవసాయ, విలువ ఆధారిత ఆహార ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్ అనుసంధానాలు పెరగడం ద్వారా రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్పీవో), ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, గ్రామీణ వ్యాపార సంస్థలు కూడా ప్రయోజనం పొందే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రాసెస్డ్, ఎగుమతి ఆధారిత ఉత్పత్తులకు డిమాండ్ పెరగడం ద్వారా స్థానికంగా విలువ జోడింపు, పంట అనంతర నష్టాల తగ్గింపు, ఉత్పత్తులకు మెరుగైన ధర లభించడం, రైతుల ఆదాయాల పెరుగుదలకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రారంభ కార్యక్రమం అనంతరం అంతర్జాతీయ కొనుగోలుదారులను ఎంఎస్ఎంఇ ప్రతినిధులకు పరిచయం చేసి, వన్‌టువన్ వ్యాపార సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఆగస్టు 20, 21 తేదీల్లో కూడా కొనసాగనున్నాయి. ఎపిఎంఎస్ఎంఇడిసి, ఫీయో బృందాలు ఈ సమావేశాలను సమన్వయం చేస్తున్నాయి. కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఆదిశేషు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఎగుమతి అవకాశాలను ఆయన వివరించారు.

# వేగంగా కుప్పం - మారికుప్పం రైల్వేలైన్ పనులు

- రూ.363-500 కోట్ల వ్యయం అంచనా.. కర్ణాటకలో పనులు పూర్తి
- ఆంధ్రప్రదేశ్‌లో ఊపందుకున్న పనులు.. 2028 మార్చికి పూర్తి లక్ష్యంగా చర్యలు

గుడుపల్లె మండలం అగరం వద్ద రైల్వేలైనుకు పనులు చేపడుతున్న దృశ్యం



**కుప్పం, ఆగస్టు 20 ప్రభాతవార్త:** కుప్పం పట్టణం నుంచి కర్ణాటకలోని మారికుప్పం (కెజిఎఫ్) నూతన రైల్వేలైను పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం గుడుపల్లె మండలంలో రైల్వే లైనుకు సంబంధించిన పనులు చేపడుతున్నారు. మొత్తం 23.7కి.మీ.ల మేర ఈ నూతన రైల్వేలైను నిర్మిస్తున్నారు. ఇందులో కర్ణాటక ప్రాంతంలో 6కి.మీ.ల దూరం ఉండగా ఆంధ్రలోనే అత్యధికంగా 17.7కి.మీ.లమేర రైల్వే లైను వస్తోంది. సుమారు రూ.363కోట్ల నుంచి రూ.500కోట్ల అంచనా వ్యయంతో దక్షిణ పశ్చిమ రైల్వే ఈ ప్రాజెక్టు చేపడుతోంది. కర్ణాటక ప్రాంతంలో పరిధిలో ఇప్పటికే రైల్వే ట్రాక్ నిర్మాణం పనులు పూర్తయ్యాయి. ఆంధ్ర ప్రాంతం లో గత ప్రభుత్వ హయాంలో రైతుల నుంచి రైల్వే లైనుకు భూసమీకరణ పనులు ఆలస్యం కావడంతో ప్రాజెక్టు కొంత మందగించింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రైల్వే లైనుకు అవసరమైన భూసేకరణ పనులు దాదాపు పూర్తి చేయడంతో పనులు వేగం పుంజుకున్నాయి.


2028మార్చిలోగా పూర్తి : కుప్పం - మారికుప్పం రైల్వేలైనును 2028మార్చిలోగా పూర్తి చేయాలని డెడ్‌లైన్ విధించుకున్నారు. ప్రస్తుతం ఆంధ్ర ప్రాంతంలో సివిల్ ఇంజనీరింగ్, భూమి చదును, కల్వర్టులు, వంతెనల నిర్మాణాలతో పాటు రైల్వేట్రాక్‌ను నిర్మించాల్సి ఉంది. కాగా ఈ నూతన రైల్వేలైనులో కర్ణాటకలోని విరూపాక్షపురం, కుప్పం ద్రవిడ వర్సిటీ సమీపంలో కొత్తగా రైల్వేస్టేషన్లను నిర్మించనున్నారు. ఈ రైల్వేలైను మారికుప్పం నుంచి అగరం, ద్రవిడ వర్సిటీ, గుత్తార్లపల్లి మీదుగా కుప్పం రైల్వేస్టేషన్‌లో కలుస్తుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే కుప్పం ప్రాంత ప్రజలకు ఉపయుకంగా ఉంటుంది. ఈ నూతన రైల్వేలైను అందుబాటులో వస్తే చెన్నై - బెంగళూరు నగరాల మధ్య తిరిగే ప్రయాణీకులకు సైతం వెసులుబాటు కలగడంతో పాటు ప్రధాన రైలు మార్గంలో సైతం రైళ్ల రాకపోకలకు మరింత వెసులుబాటు, రైళ్లకు రూట్ క్లియరెన్స్‌లు త్వరగా కలిగే అవకాశముంది.

రాజకీయాలలో తప్పులు చేస్తే వాటి విష ఫలితాలను లక్షలు, కోట్ల మంది అనుభవించవలసి వస్తుంది.

న-గోథే


# భూగర్భజల సంక్షోభం?

నీటిని నీలి బంగారం అంటారు. వాస్తవంగా చెప్పాలంటే అసలు బంగారం కన్నా నీలి బంగారమే అత్యంత విలువైనది. గొంతు తడారిపోతున్న వ్యక్తికి కావాల్సింది గుక్కెడు నీళ్లే తప్ప బండెడు బంగారం కాదు. దురదృష్టంఏమిటంటే వేసవిలోనే కాదు, వర్షాకాలంలో కూడా నీటి కష్టాలుఇబ్బడి ముబ్బడిగా ఏర్పడుతున్నాయి. ఈ యేడాది ఎల్‌నినో ప్రభావంతో తెలుగు రాష్ట్రాలతోసహా దేశంలోని అనేక ప్రాంతాల్లో నీటి సమస్య తీవ్రరూపం దాల్చబోతుందన్న సంకేతాలు వెలువడుతున్నాయి. భూగర్భమట్టాలు నానాటికీ దిగజారిపోతుండడం ఆందోళన కలిగిస్తున్నది. యేటాయేటా భూగర్భ జలాల వినియోగం పెరిగిపోతుందనేందుకు ఊహించని రీతిలో పెరిగిపోతున్న బోరుబావుల సంఖ్యనే ఉదహరించవచ్చు. భూగర్భజలాల వాడకం ఎనభై శాతానికిపైగా వ్యవసాయానికి, పదిహేను శాతం పరిశ్రమలకు, తాగునీటి అవసరాలు తీర్చుకోడానికి వినియోగించుకుంటున్నారు. వినియోగం రోజురోజుకు తీవ్రస్థాయిలో పెరుగుతున్నప్పటికీ ఆ మేరకు భూగర్భజలాల భర్తీకి ప్రయత్నాలు జరగక్కపోవడంతో మట్టాలు దిగజారిపోతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశవ్యాప్తంగా కూడా భూగర్భజలాల వినియోగం అంతకంతకు పెరుగుతున్నది. దీనిని నియంత్రించేందుకు పాలకులు చేస్తున్న ప్రయత్నాలు ఏమాత్రం ఫలించడం లేదు. మరొకపక్క గోదావరి, కృష్ణా, గంగా, యమున, కావేరి లాంటి జీవ నదుల నుండి కోట్లాది ఎకరాలకు సరిపడే సాగునీరు నిరుపయోగంగా సముద్రం పాలవుతున్నది. ఇంకొకపక్క ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా దాదాపు మూడువందల ఘనపు కిలోమీటర్ల మేర భూగర్భ జలాలను భారత్ వినియోగించుకుంటున్నది. దేశంలో ఆరు వేల ఐదువందల డెబ్బైరెండు భూగర్భజలాల బ్లాకులు ఉండగా, వీటిలో మూడోవంతు బ్లాకుల్లో అవసరానికి మించి భూగర్భజలాలను తోడేస్తున్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే మిగతా బ్లాకులు పరిధిలోకి చేరుకొని దేశంలో భూగర్భజలాలు మరింతగా అడుగంటిపోతాయి. భారత్‌లో బోరుబావుల సంఖ్య గత అరవైయేళ్లలో దాదాపు నూట అరవై రెట్లకుపైగా పెరిగింది. ఇంకా పెరుగుతూనే ఉంది. వీటి వల్ల సన్నకారు, చిన్నకారు రైతులు లాభపడిన మాట వాస్తవం. లక్షలాది ఎకరాలు బీడుభూములు సాగుల్లోకి వచ్చిన మాట కూడా వాస్తవమే. అయితే ఇది రాను రాను పెరగడం మాత్రం అత్యంత ప్రమాదకరమంటున్నారు. నీటి సంరక్షణ పద్ధతులు పాటించకుండా వాననీటిని ఒడిసిపట్టే కార్యక్రమాలు చేపట్టకుండా బోరుబావుల మీద ఆధారపడే పరిస్థితి అనేక అనర్థాలకు దారితీస్తుందని భూగర్భశాస్త్ర నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో నీటివృథా కూడా బాగా పెరిగింది. పంజాబ్‌లో డెబ్భైఐదు శాతం, రాజస్థాన్‌లో అరవై శాతం, కర్ణాటక, తమిళనాడులో నలభై శాతం భూగర్భజలాలను వాడుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే మరో రెండు దశాబ్దాలు దేశం వనరుల్లో అరవై శాతంపైగా హరించుకుపోతాయని ప్రపంచ బ్యాంకు గతంలో ఒక నివేదికలో హెచ్చరించింది. దేశ రాజధాని ఢిల్లీతోపాటు రాజస్థాన్, హర్యానా,పంజాబ్, ఉత్తరప్రదేశ్, తదితర రాష్ట్రాల్లో యేటా లక్షలాది కోట్లలీటర్ల భూగర్భజలాలను తోడేస్తుండడంతో సముద్ర మట్టాల్లో ఐదు శాతం పైగా పెరుగుదల నమోదవుతున్నది. గతంలో చేసిన అధ్యయనాల్లో వెల్లడయింది. మరొకపక్క దేశంలో అధిక శాతం జిల్లాల్లో భూగర్భజలాలు తాగుయోగ్యమైనవి కావని కేంద్రం అంగీకరించడం కలవరపరిచే పరిణామం. గతంలో పార్లమెంటులోనే ఒక ప్రశ్నకు సమాధానం చెబుతూ ప్రభుత్వం తెలిపిన వివరాల ప్రకారం రెండువందల యాభై నాలుగు జిల్లాల్లో భూగర్భజలాల్లో ఇనుము, రెండువందల ఇరవై నాలుగు జిల్లాల్లో ఫ్లోరైడ్, నూటఅరవైరెండు జిల్లాల్లో క్షారత, ముప్పైనాలుగు జిల్లాల్లో పాషాణం స్థాయికి అధిక శాతంలో ఉన్నదనే విషయం వెలుగు చూసింది. ముఖ్యంగా పాషాణం లాంటి భారీ లోహాలను భూగర్భజలాల నుంచి తొలగించడం కష్టంగా మారుతుందని అధికార వర్గాలు అంగీకరిస్తున్నాయి. ఉచిత విద్యుత్ సరఫరా కూడా బోరుబావుల సంఖ్య పెరగడానికి కారణమవుతున్నది. చట్టాలు, నిబంధనలు ఎన్ని ఉన్నా అంతగా అమలు కాకపోవడం కూడా మరొక కారణంగా చెప్పొచ్చు. కొన్ని పరిశ్రమలు ముఖ్యంగా శీతలపానీయాలు, మద్యం తయారీ కంపెనీలు భారీ స్థాయిలో భూగర్భజలాలను వినియోగించుకుంటున్నాయి. ఇక దేశవ్యాప్తంగా నగర, పట్టణ ప్రాంతాల్లో మున్సిపాలిటీల్లో వాడకం పెరిగిపోతున్నది. నీటి వృథాకు అదుపు లేకుండాపోతున్నది. పాలకుల్లో చిత్తశుద్ధి, ప్రజల్లో అవగాహనలోపం కారణంగా భూగర్భజలాల సమస్య రోజురోజుకు తీవ్రరూపం దాలుస్తుందనే విమర్శలను కొట్టివేయలేం. భూగర్భజలాల మట్టాల పెంపునకు దేశవ్యాప్తంగా చర్యలుతీసుకోవాల్సిన తరుణం ఆసన్నమైంది. తెలంగాణ ప్రభుత్వం గతంలో మిషన్‌కాకతీయ కార్యక్రమం ద్వారా చెరువులు, కుంటల్లో పూడికలు తీయించి మరమ్మతు చేయించడంతో చాలా ప్రాంతాల్లో భూగర్భజలాలు కొంతమేర పెరిగాయని చెప్పొచ్చు. కానీ అవి వాడుతున్న భూగర్భజలాల మట్టాలను భర్తీ చేయలేకపోతున్నాయి. అందుకే భూగర్భజలాల మట్టాలు గణనీయంగా పడిపోతున్నాయి. ఇప్పటికైనా పాలకులు ఈ విషయంపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. సాగునీటి సంగతి దేవుడెరుగు. గుక్కెడు మంచినీళ్ల కోసందేశవ్యాప్తంగా కోట్లాది మంది పడరాని పాట్లు పడుతున్నారు. దాహం తీర్చుకునేందుకు అందుబాటులో ఉన్న కలుషితనీరు తాగి రకరకాల రోగాల బారినపడుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు దాటినా ఇప్పటికీ ప్రజలందరికి కనీస అవసరమైన గుక్కెడు స్వచ్ఛమైన మంచినీరు అందించలేని దురదృష్టపు పరిస్థితుల్లో ఉన్నాం.



ప్రాచీన మూఢవిశ్వాసాలను అంటిపెట్టుకోక, నవ్య సత్యాలకోసం సంసిద్ధుడవై ఉండు.

స్వామి వివేకానంద



నాలుక మనం చెప్పినట్లు వినకపోవడమే అన్ని అనర్థాలకు మూలం.

సెనెకా

# సప్తధారల సంగమమే వికసిత్ భారత్

**భారతదేశం ప్రపంచంలో బలమైన ఆర్థికశక్తిగా ఎదగాలని కలలు కనడం మంచిదే. కానీ ఆర్థిక పరిమాణంతోపాటు మానవ అభివృద్ధి, సామాజిక న్యాయం, ఉపాధి, విద్య, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ కూడా సమానప్రాధాన్యం పొందాలి. దేశ సంపద పెరగడమే అభివృద్ధి కాదు, ప్రతి భారతీయుడి అవకాశాలు పెరగడమే అసలైన అభివృద్ధి. అందుకే సప్తధారలనుకేవలం ఏడు రంగాల జాబితాగా కాకుండా భారతదేశ భవిష్యత్తును నిర్మించే ఏడు అభివృద్ధి ప్రవాహాలుగా చూడాలి. ఈ ప్రవాహాలు సమన్వయంతో సాగితేనే భారత్ ఆర్థికంగా బలమైన, సాంకేతికంగా స్వావలంబన కలిగిన, రక్షణపరంగా సురక్షి తమైన, పర్యావరణపరంగా బాధ్యతాయుతమైన, సాంస్కృతికంగా ప్రభావవంతమైన దేశంగా ఎదుగుతుంది. సప్త ధారల సంగమం సంపన్న భారతానికి మార్గం.**

తిప్పర్తి శ్రీనివాస్

భారతదేశం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకుసాగుతున్న వేళ, వికసిత్ భారత్ అనే లక్ష్యం దేశం ముం దున్న అత్యంత ప్రతిష్ఠాత్మక సంకల్పంగా నిలుస్తోంది. అభి వృద్ధి అంటే కేవలం ఆర్థిక వృద్ధి రేటు పెరగడం కాదు.ప్రతి కుటుంబానికి మెరుగైన జీవన ప్రమాణాలు,యువతకుఉపాధి అవకాశాలు,రైతుకు స్థిరమైన ఆదాయం, పరిశ్రమలకు అను కూల వాతావరణం, సాంకేతికతలో స్వావలంబన, పర్యా వరణ పరిరక్షణ, ప్రపంచ వేదికపై భారతదేశానికి గౌరవ ప్రదమైన స్థానం ఇవన్నీ కలిసిన సమగ్ర పురోగతే నిజమైన వికసిత్ భారత్. ఈ లక్ష్యాన్ని సాధించడానికి తయారీ రంగం, రైతాంగం, సాంకేతికత, గతిశక్తి, రక్షాశక్తి, గ్రీన్ ఎనర్జీ, సాఫ్ట్ పవర్ అనే ఏడు కీలక రంగాలు దేశ ప్రగతికి సప్త ధారలుగా నిలవగలవు. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద యువ జనాభా కలిగిన దేశం. ఈ మానవ వనరు లను అభివృద్ధికి వినియోగించుకోవాలంటే తయారీ రంగం బలపడాలి. కేవలం సేవారంగంపై ఆధారపడకుండా ఎలక్ట్రా నిక్స్, సెమీకండక్టర్లు, రక్షణ పరికరాలు, ఔషధాలు, ఆటోమొబైల్స్, టెక్స్‌టైల్స్, యంత్ర పరికరాలు వంటి రంగాల్లో దేశీయ ఉత్పత్తి పెరగాలి. 'మేక్ ఇన్ ఇండియా' భావన ఉత్పత్తి పెంపుతోనే ఆగిపోకూడదు. 'మేడ్ ఇన్ ఇండియా' ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్లలో విశ్వసనీయత, నాణ్యత, పోటీ సామర్థ్యం పెరగాలి. పెద్ద పరిశ్రమలతో పాటు సూక్ష్మ చిన్న, మధ్య తరహా పరిశ్రమలను బలోపేతం చేయాలి. తయారీ రంగం విస్తరించినప్పుడే కోట్లాది యువతకుప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయి. భారత ఆర్థిక వ్యవస్థకు రైతాంగం వెన్నెముక. వ్యవసాయం లాభసాటిగా మారకుండా వికసిత్ భారత్ కల సాకారం కావడం కష్టం.రైతుకు కేవలం ఉత్పత్తి పెంచేసాంకేతికత ఇవ్వడం సరిపోదు, ఉత్పత్తికి తగిన ధర, నిల్వ సదుపాయాలు, రవాణా,ప్రాసెసింగ్, మార్కెటింగ్ వ్యవస్థలు కూడా అందుబాటులో ఉండాలి. సూక్ష్మ నీటిపారుదల, డ్రోన్ సాంకేతికత, కృత్రిమ మేధస్సు ఆధారిత వ్యవసాయ సలహాలు, మట్టి పరీక్షలు, వాతావరణ సమాచార వ్యవస్థలు రైతుకు అందుబాటులోకిరావాలి. వ్యవసాయాన్ని కేవలం పంటల సాగుగా కాకుండా 'అగ్రిబిజినెస్'గా చూడాలి. ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలను గ్రామీణ ప్రాంతాలకు తీసుకెళ్లడం ద్వారా రైతు ఆదాయాన్ని పెంచవచ్చు. రైతు బలపడితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడితే దేశీయ మార్కెట్ విస్తరిస్తుంది. 21వ శతాబ్దపు ప్రపంచ పోటీలో సాంకేతికతే ప్రధాన శక్తి. కృత్రిమ మేధస్సు, సెమీకండక్టర్లు, క్వాంటమ్ కంప్యూటింగ్, రోబోటిక్స్, బయోటెక్నాలజీ, అంతరిక్ష సాంకేతికత వంటి రంగాల్లో భారత్ స్వయం సమృద్ధి సాధించాలి. సాంకేతికతను కేవలం పెద్ద నగరాలకు పరిమితం చేయకుండా గ్రామీణ భారతానికి తీసుకెళ్లడం అవసరం.డిజిటల్ సేవలు, ఆన్‌లైన్ విద్య, టెలీమెడిసిన్, డిజిటల్ చెల్లింపులు, ఈగవర్నెన్స్ వంటి సేవలు సామాన్యుడి జీవితాన్ని సులభతరం చేయాలి. అదే సమయంలో డిజిటల్ విభజన తగ్గాలి. సాంకేతికత కొద్దిమందికి మాత్రమే అవకాశాలు కల్పిస్తే అది సమగ్ర అభివృద్ధి కాదు. దేశ ఆర్థిక ప్రగతికి రోడ్లు, రైల్వేలు, పోర్టులు, విమానాశ్రయాలు, లాజిస్టిక్స్ వ్యవస్థలు కీలకం. ఒక ప్రాంతంలో తయారైన వస్తువు మరో ప్రాంతానికి తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో చేరేలా మౌలిక



వసతులు అభివృద్ధి చెందాలి. 'గతిశక్తి భావన కేవలం రవాణా వేగానికి సంబంధించినది కాదు.దేశంలోని ఉత్పత్తికేంద్రాలు, మార్కెట్లు, పోర్టులు, పరిశ్రమలు, వ్యవసాయ ప్రాంతాలను సమర్థవంతంగా అనుసంధానించే సమగ్రవ్యవస్థ కావాలి. మౌలిక వసతులపై పెట్టుబడులు పెరిగితే పరిశ్రమలు వస్తాయి, ఉద్యోగాలు పెరుగుతాయి, ప్రాంతీయ అసమానతలు తగ్గుతాయి.దేశం ఆర్థికంగా ఎంత బలంగాఉన్నా,భద్రతా పరంగా బలహీనంగా ఉంటే ఆ అభివృద్ధికి స్థిరత్వం ఉండదు. అందుకే రక్షణ రంగంలో స్వావలంబన అత్యవసరం. ఆయుధాలు, డ్రోన్లు, క్షి పణులు, రాడార్లు, సైబర్ భద్రత, అంతరిక్ష రక్షణ వంటి రంగాల్లో దేశీయ సామర్థ్యాన్ని పెం చాలి. రక్షణ రంగంలో దేశీయ ఉత్పత్తి పెరగడం వల్ల ఒక వైపు జాతీయ భద్రత బలోపేతం అవుతుంది. మరోవైపు అధునాతన పరిశ్రమలకు, పరిశోధనకు, నైపుణ్య ఉపాధికి అవకాశాలు ఏర్పడతాయి. రక్షణ రంగాన్ని దిగుమతులపై ఆధారపడే వ్యవస్థనుంచి పరిశోధన, ఆవిష్కరణ, ఎగుమతు ల కేంద్రంగా మార్చడం వికసిత్ భారత్‌కు కీలకం. అభివృద్ధి పేరుతో పర్యావరణాన్ని ధ్వంసం చేసే నమూనా ఇకపై కొన సాగదు. భవిష్యత్తు ఆర్థిక వ్యవస్థకు సౌర,పవన, జల, గ్రీన్ హైడ్రోజన్ వంటి స్వచ్ఛమైన ఇంధన వనరులు కీలకంకాను న్నాయి. గ్రీన్ ఎనర్జీపై పెట్టుబడులు పెంచడం ద్వారా కాలు ష్యాన్ని తగ్గించడమే కాకుండా ఇంధన దిగుమతులపై ఆధారపడటాన్ని కూడా తగ్గించవచ్చు. విద్యుత్ వాహనాలు, బ్యాటరీ నిల్వ సాంకేతికత, గ్రీన్ హైడ్రోజన్, పునరుత్పాదక ఇంధన పరిశ్రమలకు ప్రోత్సాహం ఇవ్వాలి. పర్యావరణ పరిరక్షణను అభివృద్ధికి అడ్డంకిగా కాకుండా కొత్త ఆర్థిక అవకాశంగా చూడాల్సిన సమయం ఇది. భారతదేశానికి ప్రపంచ వేదికపై ప్రత్యేకమైన సాంస్కృతిక, ఆధ్యాత్మిక, మేధోసంపద ఉంది. యోగా, ఆయుర్వేదం, భారతీయ సంగీతం,నృత్యం, కళలు, సాహిత్యం, సినిమా, వంటకాలు, ప్రజాస్వామ్య విలువలు, ప్రవాస భారతీయుల ప్రభావం ఇవన్నీ భారతదేశ సాఫ్ట్ పవర్‌ను పెంచగల శక్తులు. ప్రపంచంతో సంబంధాలు కేవలం వాణిజ్యం, దౌత్యం, రక్షణ ఒప్పందాలద్వారా మాత్రమే ఏర్పడవు. సంస్కృతి, విద్య, మానవీయ విలువలు కూడా దేశాల మధ్య సాన్నిహిత్యాన్ని పెంచుతాయి. భారతీయ సంస్కృతి, విజ్ఞానం, ఆలోచనా విధానం ప్రపంచవ్యాప్తంగా మరింత విస్తరించాలి. భారతదేశాన్ని కేవలం పెద్ద మార్కెట్‌గా కాకుండా జ్ఞానం, సంస్కృతి, విలువలకు ప్రతీకగా ప్రపంచం గుర్తించేలా చేయాలి. ఈ ఏడు రంగాలను విడివిడిగా చూడటం సరైన విధానం కాదు. తయారీ రంగానికి సాంకేతికత అవసరం. తయారీకి గతిశక్తి అవసరం. రైతాంగానికి సాంకేతికత, మౌలిక వసతులు అవసరం. పరిశ్రమలకు గ్రీన్ ఎనర్జీ అవసరం. రక్షణ రంగానికి అత్యాధునిక సాంకేతికత అవసరం. ప్రపంచ మార్కెట్లలో భారత ఉత్పత్తులకు గుర్తింపు రావడానికి సాఫ్ట్‌పవర్ కూడా తోడ్పడుతుంది. అంటే ఈ సప్త ధారలుపరస్పరం అనుసంధానమైన అభివృద్ధి ప్రవాహాలు. అయితే విధానాలు రూపొందించడం మాత్రమే సరిపోదు. వాటి అమలులో పారదర్శకత, సమర్థత, జవాబుదారీతనం ఉండాలి. కేంద్రం, రాష్ట్రాలు, పరిశ్రమలు, రైతులు, విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థలు కలిసి పనిచేసినప్పుడే ఈ లక్ష్యం సాధ్యమవుతుంది. అభివృద్ధి ఫలాలు దేశంలోని చివరి వ్యక్తి వరకు చేరినప్పుడే వికసిత్ భారత్ అనే పదానికి నిజమైన అర్థం వస్తుంది. భారతదేశం ప్రపంచంలో బలమైన ఆర్థికశక్తిగా ఎదగాలని కలలు కనడం మంచిదే. కానీ ఆర్థిక పరిమాణంతోపాటు మానవ అభివృద్ధి, సామాజిక న్యాయం, ఉపాధి, విద్య, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ కూడా సమానప్రాధాన్యం పొందాలి. దేశ సంపద పెరగడమే అభివృద్ధి కాదు, ప్రతి భారతీయుడి అవకాశాలు పెరగడమే అసలైన అభివృద్ధి. అందుకే సప్తధారలనుకేవలం ఏడు రంగాల జాబితాగా కాకుండా భారతదేశ భవిష్యత్తును నిర్మించే ఏడు అభివృద్ధి ప్రవాహాలుగా చూడాలి. ఈ ప్రవా హాలు సమన్వయంతో సాగితేనే భారత్ ఆర్థికంగా బలమైన, సాంకేతికంగా స్వావలంబన కలిగిన, రక్షణపరంగా సురక్షి

# 'ఇవి' విప్లవంతో ప్రకృతిపై భారం!

నూకల దేవేందర్

ప్రపంచం ఇప్పుడు ఎలక్ట్రిక్ వాహనాల వైపు వేగంగా అడుగులు వేస్తున్నది. భారతదేశం సైతం నగరాలను కాలుష్యరహితం చేయడానికి ఈవీలకు ప్రాధాన్యత ఇస్తున్నది. తెలుగు రాష్ట్రాల్లోనూ దీనికి సంబంధించి కార్యాచరణ కొనసాగుతున్నది. హైదరాబాద్‌ను కాలుష్యం నుంచివిముక్తి చేయడానికి క్యూర్ పరిధిలో ఈవీ ఆటోలకు ప్రోత్సాహకాలు, సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. అయితే ప్రపంచవ్యాప్తంగా నగరాల్లో కాలుష్య నివారణకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నట్లు కనిపిస్తున్నది. అయితే ఈవీల వల్ల పట్టణాలు, నగరాల్లో కాలుష్యాన్ని కొంతమేర నివారించగలిగినా వాటి తయారీకి అవసరమయ్యే ఖనిజాల కోసం గ్రామాలు, అడవులు, పర్వతాలు, తద్వారా ప్రకృతికి ఎంత మేర నష్టం జరుగుతుందో ప్రభుత్వాలు ఒక అంచనా వేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. సాధారణ పెట్రోల్ కారు కంటే ఈవీ కారును తయారు చేయడానికి ఆరు రేట్లు ఎక్కువ ఖనిజాలు అవసరమవుతాయని అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఈఏ) ఇటీవల ఒక నివేదిక విడుదల చేసింది. ఎలక్ట్రిక్ కార్లలో బ్యాటరీలు, మోటార్లు, విద్యుత్ వ్యవస్థల కోసం రాగి, లిథియం, నికెల్, కోబాల్ట్, గ్రాఫైట్ వంటి ఖనిజాలు ఎక్కువగా అవసరం కావడమే దీనికి కారణమని తేల్చింది. ఈవీ మార్కెట్ పుంజుకుంటుండడంతో ఈ ఖనిజాలకు సైతం డిమాండ్ పెరుగుతున్నది. 2040 నాటికి వీటి డిమాండ్ రెట్టింపవుతుందని ఐఈఏ అంచనా వేసింది.ఈవీల తయారీకి అవసరమయ్యే ఖనిజాలు వెలికితీయాలంటే పెద్ద గనులు ఏర్పాటు చేసి మైనింగ్ చేయాల్సి ఉంటుంది. దీని కోసం అడవులను నరకడం, కొండలను తొలగించడంవంటి చర్యలు కూడా చేపట్టాల్సి ఉంటుంది. భూములను తవ్వడం, ఖనిజాలను వేరు చేయడం, శుద్ధి చేయడానికి నీరు, విద్యుత్ అవసరమవుతాయి. దీనివల్ల కూడా పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడి వేరే మార్గాల ద్వారా కాలుష్యం పెరగవచ్చు. గనుల ప్రాంతాలనుబట్టి వ్యర్థాలు, నీటి కాలుష్యం, నేలపై పడే ప్రభావం వల్ల స్థానిక జీవ వైవిధ్యానికి ముప్పు తలెత్తవచ్చు. ఎలక్ట్రిక్ వాహనాలు వంద శాతం కాలుష్యరహిత వాహనాలు కావు. పెట్రోల్ కార్లతో పోలిస్తే మన దేశంలో వీటి జీవిత కాల ఉద్గారాలు సుమారు 20 శాతం మాత్రమే తక్కువగా ఉన్నాయని అనేక నివేదికలు చెప్తున్నాయి. మరోవైపు ఈవీ తయారీకి అవసరమయ్యే ఖనిజాలు తవ్వే సమయంలో,వాటిని శుద్ధి చేసే సమయంలో, బ్యాటరీ తయారు చేసే సమయంలో పర్యావరణంపై తీవ్ర ప్రభావం ఉంటుంది. అంటే ఈవీల ద్వారా ఓ వైపు నగరాల్లో కాలుష్యాన్ని తగ్గిస్తూ గనుల తవ్వకాల పేరుతో మరో చోట పర్యావరణానికి హానీ చేస్తున్నామా? అనేది మనం నిర్ధారించుకోవాల్సి ఉన్నది. 2025 నాటికి ప్రపంచ ఈవీ బ్యాటరీ వినియోగం 1.2 టెరావాట్ గంటలకు చేరింది. 2020తో పోలిస్తే ఏది ఏడు రేట్లు ఎక్కువ. భవిష్యత్తులో ఈ డిమాండ్‌ను తట్టుకోవాలంటే వాడేసిన బ్యాటరీలను రీసైక్లింగ్ చేయడం అత్యంత కీలకం. 2040 నాటికి అవసరమైన ఖనిజాల్లో 20శాతం వాటా రీసైక్లింగ్ ద్వారానే వస్తుందని అంచనా. దీంతో రీసైక్లింగ్‌పై ప్రభుత్వాలు ఇప్పటి నుంచే దృష్టి పెట్టాలి. పటిష్టమైన రీసైక్లింగ్ పాలసీని రూపొందించాలి.ఒక వాహనంలో వాడే బ్యాటరీజీవిత కాలం ఎంత? పాడైపోయాక దాన్ని ఎక్కడ రీసైక్లింగ్ చేయాలి? అనే విషయాలను పొందుపర్చాలి.ప్రతి పెట్రోల్ కారు స్థానంలో ఈవీని రోడ్డెక్కిస్తే పర్యావరణ, కాలుష్య సమస్య తీరదు. దీనివల్ల ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలకు పరిష్కారం దొరకదు. ముందుగా వ్యక్తిగత వాహనాలవాడకాన్ని తగ్గించాల్సి ఉంటుంది. మెట్రో, రైళ్లు, బస్సులవైపు ప్రజలను మళ్లించాల్సి ఉంటుంది. నడిచేదూరం ఉన్నచోట నడక,సైకిల్ వాడకాన్ని ప్రోత్సహించాలి.అప్పుడే వాహనాల అవసరం తగ్గుతుంది.తద్వారా ఖనిజాలతవ్వకాలు తగ్గిప్రకృతిపై పడుతున్న భారం తగ్గుతుంది. పెట్రోల్ కారా, ఈవీ కారా అన్నదికాదు.అసలు మనకు ఎన్నికార్లు అవసరమన్న ప్రశ్నే భవిష్యత్ పర్యావరణ ప్రభావాన్ని నిర్ణయిస్తుంది. ●



# ప్రజావాక్కు

## విద్యాబోర్డులు ఏర్పాటు చేయాలి

దేశంలోపాఠశాలవిద్యకు సంబంధించి 65విద్యా బోర్డులు వేర్వేరుపాఠ్యప్రణాళికలు,మూల్యాంకన పద్ధతులు, గుర్తింపు ప్రమాణాలు,పర్యవేక్షణ వ్యవస్థలతో పనిచేస్తున్నాయి. విద్యలో వైవిధ్యం సహజమే. దేశవ్యాప్తంగా ఉన్న త విద్య, పోటీపరీక్షలు, ఉద్యోగ అవకాశాల్లో విద్యార్థులు ఒకే వేదికపై పోటీపడుతున్నప్పుడు పాఠశాల స్థాయిలోనే వేర్వేరు ప్రమాణాలుండటం విద్యార్థులకు సమాన అవకాశాల సూత్రాన్ని దెబ్బతీస్తుంది. ఈనేపథ్యంలో పార్లమెంటరీ కమిటీ ప్రతిపాదించిన ఏకీకృత జాతీయ నియంత్రణ వ్యవస్థను సీరియస్‌గా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఏ బోర్డుకు అనుబంధంగా పాఠశాల కొనసాగుతోందన్న దానితో సంబంధం లేకుండా, ఉపాధ్యాయుల అర్హతలు, బోధనా నాణ్యత, మూల్యాంకన ప్రమాణాలు, విద్యార్థుల భద్రత, కనీస మౌలిక వసతుల విషయంలో దేశవ్యాప్తంగా ఒకే స్థాయి ప్రమాణాలు ఉండాలి.

- హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## ఆహార కల్తీలను అంతం చేయాలి

మన నిత్యజీవితంలో వాడే అనేక ఆహార పదార్థాలు కల్తీకి గురవుతున్నాయి. మార్కెట్లో ఎక్కువగా కల్తీ జరిగే ముఖ్య వస్తువులనేకం. సింథటిక్ పాలు, ఎండిన బొప్పాయి గింజలు కలిపిన మిరియాలు, చౌకరకం మినరల్ ఆయిల్స్ లాంటివి కలిపిన నూనెలు, వనస్పతి (డాల్డా), జంతువుల కొవ్వు, బంగాళాదుంప గుజ్జు కలిపిన నెయ్యి, వెన్నబెల్లం పాకం,చక్కెర పాకం,కార్న్ సిరప్‌లు కలిపిన తేనె,పండ్లుత్వరగా పండడానికి కార్బైడ్,ఒకటా? రెండా? ఆర్థిక లాభాల కోసం ఆహారంలో నాణ్యతలేని, హానికరమైన లేదా పనికిరాని పై పదార్థాలను కలపడం వల్ల ఆహారం సహజగుణం కోల్పోయి,ప్రజల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటుంది.

- డా.దన్నాన అప్పలనాయుడు, విజయనగరం

## ప్రజల అవసరాలు తీర్చండి

మొరాకో వలసలకు ప్రధాన కారణం అక్కడి అభివృద్ధి నమూనాలోఉన్నది.అక్కడి యువత ఉచితఆరోగ్యంఉచిత విద్య గురించి అడుగుతుంటే అక్కడి ప్రభుత్వం 2030లో ఫుట్‌బాల్ ప్రపంచకప్ నిర్వహణకు మౌలిక సదుపాయాలు,స్టేడియంలు నిర్మిస్తున్నది. ప్రజల మౌలిక సదుపాయాలు పట్టించుకోకుండా హంగు ఆర్భాటాలకు ప్రాధాన్యత ఇవ్వబట్టే ఇలాంటి దుస్థితి దాపురించింది.

- భారత అవినాష్, జనగామ

## గురువులకు విద్యార్థుల శిక్షలా?

నల్లగొండ జిల్లా కొండపల్లిలోని నాగార్జున స్కూల్ ప్రిన్సిపాల్ రూపరెడ్డిని పదవతరగతి చదివే, గంజాయిసేవించే విద్యార్థులు 27కత్తిపోట్లతో చంపడం విద్యవ్యవస్థకే తలవంపు తెస్తుంది. తల్లిదండ్రుల క్రమశిక్షణలేని విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటు పడి విద్యాబుద్ధులు చెప్పే దైవ సమానులైన గురువులను హత్య చేయడం. హింసించడం చాలా బాధాకరం. రాష్ట్రంలో ఇలాంటి విద్యార్థులను గుర్తించి తల్లిదండ్రులు, విద్యార్థులు, కౌన్సిలింగ్ నిర్వహించవలసిన అవసరం ఉంది. నేటికీ కొన్ని గురుకులాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులు, గంజాయి సేవించడం, సిగరెట్ స్మోకింగ్ చేయడం, ఫేరివల్ పార్టీ, బర్త్‌డే, పార్టీలపేరుతో మత్తుమందు పార్టీలు చేసుకుంటున్నారు.క్రమశిక్షణతో ఉండాలని మంచిగా చదవాలని చెప్పే గురువుల పైదాడులు దౌర్జన్యాలుచేస్తున్నారు. గురుకులాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు గంజాయి, స్మోకింగ్, గుట్కాలు తినడం.సిగరెట్ తాగడం వంటి చెడు అలవాటు ఉన్న విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

## ప్రయాణికుల గోడు వినండి

మంగళగిరి బస్టాండులోకి ఎంప్లాయిస్ సచివాలయం అని కొన్ని బస్సులు వస్తున్నాయి. ఎక్కబోతే ఓన్లీ ఫర్ ఎంప్లాయిస్ అని ఎక్కనియ్యలేదు.డిపో మేనేజర్‌కు ఫిర్యాదు చేస్తే సిఆర్‌డిఎ బస్సు ఎక్కించారు. మందడం వరకు టికెట్ తీసుకున్న. మంగళగిరి నుండి హైకోర్టు, సచివాలయానికి 13 బస్సులు ఉన్నాయట.అన్నికూడా ఓన్లీ ఫర్‌ఎంప్లాయిస్ ఆట. ఇదేమిటి? ఎంప్లాయిస్‌కు బస్సులెమిటీ ? దానిలో ప్రయాణికులను ఎక్కనియ్యక పోవటం ఏమిటి?అయ్యా ఆర్టీసీ చైర్మన్ గారూ ఎంప్లాయిస్‌కు లక్షలు లక్షలు జీతాలు ఇస్తున్నారు. ఎంప్లాయిస్ వారి ఏర్పాట్లు వారు చూసుకోవాలి. సరే ఆ పేరుతో ఉన్నవాటిలో ప్రయాణికులను కూడాఎక్కించుకోవాలి.

- నార్నె వెంకట సుబ్బయ్య, ప్రకాశంజిల్లా

## గడువు తేదీని చూసి తీసుకోవాలి


మనం రోజువారి కార్యక్రమాలు చేసే పనిలో పడి మనం ఏం తింటున్నామో ఏం కొంటున్నామో తెలియకుండా రోజు గడిచిపోతుంది. మనం కొంటున్న తినుబండారాలు, ఇంట్లో వాడుకునే నిత్యావసరాల సరుకులు కొన్ని దుకాణాలలో నిరంతరం నిల్వ ఉండి ఎవరు కొనకపోవడంతో ఆ నిత్యావసరాల సరుకులు వాడుకునే తేదీ గడువు ముగిసే సమయం లేదా ముగిసిపోయే అవకాశాలు కూడా లేకపోలేదు.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

# పేరెంట్స్-టీచర్స్ భాగస్వామ్యమే బడులకు బలం

శ్రీ నగేష్ మల్లాడి

విద్యా విషయ విశ్లేషకులు ఒకప్రముఖ విద్యావేత్త డొరొతీ హెచ్ కొహెన్ ఏమన్నారంటే 'ఏపాఠశాల కూడా ఉపాధ్యాయుల, తలిదండ్రుల మధ్య సత్సంబంధాలు బలపరచకపోతే పిల్లల ప్రగతికి సరైన వ్యూహాలు రచించలేరు,విద్యార్థి అభిరుచులకు అనుగుణంగా అవకాశాలు ఏర్పరచలేరు' అని వక్కాణించారు. తలిదండ్రులే పిల్లలకు తొలి గురువులుగా పిల్లలను చదువు లేదా ఇతర అభివృద్ధి పథంవైపు ప్రభావితం చేసే ఒక దిక్సుచిగా చెప్పవచ్చు. చాలా సందర్భాల్లో తలిదండ్రులు బాలలకు ఒక రోల్ మోడల్‌గా నిలబడడమే కాకుండా బాలల ప్రవర్తనా నియమావళిలో, ఉత్సుకతను అందించడంలో, మంచి చెడుల బేరీజులో, జీవననైపుణ్యాల పరికల్పనలో,సామాజికభావోద్వేగ వికాసాన్ని అందించడంలో తలిదండ్రులు ప్రధాన భూమిక వహిస్తారనడంలో ఎంత మాత్రం సందేహంలేదు.పిల్లలు తమ గురించి తాము అర్థం చేసుకోవడం, తమ భావాలను మంచి భావాలను అలవరచుకోవడం, ఇతరులతో ఆరోగ్యకరమైన సంబంధాలను ఏర్పరచుకునే నైపుణ్యాలను అభివృద్ధి చేయడం తప్పనిసరి. దీనికి తోడు ఆత్మవిశ్వాసం,సామాజికస్పృహ బాధ్యతా యుతమైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందించడంలో తల్లిదండ్రులు తమకర్తవ్యాన్ని నిర్వహించడం అనివార్యమనిఅనేక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో అమ్మ, నాన్న ఇరువురూ ఉద్యోగ, ఉపాధి బాటలో, కొన్ని కుటుంబాలు తమ జీవనపోరాటంలో మునిగితేలుతూ తమ పిల్లల ఆలనా,పాలనా అజమాయిషీలో కొంచెం సమయాభావం, కొన్నిసార్లు ఏమరుపాటుగా వుంటున్నారు. డిజిటల్ మాధ్యమాల ప్రభావం, ఉమ్మడి కుటుంబాలకు దూరం, పట్టణ సంస్కృతీ, పొరుగువారితో పోలిక, సంపాదనపట్లే ఎక్కువ మక్కువ, సమయపాలనలేని ప్రయాసలు, ప్రయత్నాలు, పిల్లల బాగోగులను పర్యవేక్షి ంచే సమయం దొరకక ఒక యాంత్రిక జీవితంలో తమ కన్నపిల్లల్ని తామే నిర్లక్ష్యం చేస్తున్న తరుణమిది. ఇదే కొనసాగితే పిల్లలు ప్రగతివైపు పయనించకుండా తీవ్రమైన మానసిక సంక్షోభంతో సరైన మార్గదర్శకత్వం లేక తొలుత తప్పటడుగులు అనిపించినా క్రమేణా చేతికందని చెడుస్నేహాలు, చెడు అలవాట్లకు, ప్రతి విషయంలోనూ విపరీతధోరణి, చదువుపట్ల నిర్లక్ష్యం, ఆలా కాదని వారిస్తే తల్లిదండ్రులపై కోపం, తాను స్వతంత్రుణ్ణి కాదనే ఆలోచన, తనను నిబంధనలతో నియంత్రిస్తున్నారే ఆరోపణలు, ఇలా పిల్లలు పెడదారిలో నడుస్తున్న ఉదాహరణలెన్నోన్నో. ఈపరిస్థితి రాకుండా బాల్యం నుండి పిల్లలను సరైనపంథాలో నడిపించడానికి తలిదండ్రులే బాధ్యతగాతమ సమయాన్ని కేటాయించడమే కాకుండా వారిని మంచి వైపు నడిపించడానికి, ప్రధాన బాధ్యత వహించాలి. కొత్త విషయాల అవగాహన కల్పించడానికి,జీవననైపుణ్యాల,కుటుంబ విలువలను బోధించడానికి,తమపిల్లలు తనకుతానే తనలక్ష్యాన్ని నిర్దేశించుకొనేలా తీర్చిదిద్దడానికి,చదువులో,సంరక్షణలో,



భవిష్యత్తుకు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవడంలో తల్లిదండ్రుల పాత్ర అత్యంతం. అంతేకాక,ముఖ్యంగా పాఠశాలలో చేరాక తన పిల్లల ప్రగతి, అంచనా, కావలసిన తోడ్పాటు వంటి విషయాలను ఉపాధ్యాయులకు కూడా విడమరచి నచ్చచెప్పే నైపుణ్యం, నేర్పరితనం చొరవ తల్లిదండ్రులకే ఉంటుంది. అందుకే ప్రతివిద్యార్థి తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యాలతో తరచూ సత్సంబంధాలు కలిగి ఉండాలని, తరచూ తమ పిల్లల గురించి చర్చించాలని, తన అభిప్రాయాలను సూటిగా చెప్పి చదువులో, ప్రవర్తనలో ఏమైనా ఒడిదుడుకులు ఉంటే అప్పటికప్పుడే సరిచెయ్యాలని ఎందరో మేధావులు హెచ్చరిస్తున్నారు. బాలలు ఏవర్గమైనా, పేద,ధనిక లేదా ఏనేపథ్యంలో ఉన్నావారిని ప్రోత్సహించే లేదా తీర్చిదిద్దే తీరులోనే వారి భవిత ముడిపడి ఉంటుంది. పిల్లల బాగోగుల దర్యాప్తు లేదా చదువు పర్యవేక్షణ తనపిల్లలతో ఇంటిదగ్గర తల్లిదండ్రులు చర్చించడం సంప్రదించడమే కాకుండా మరొక చురుకైన చొరవకూడా తీసుకోవాలి. సమయం తీసుకొని తమ పిల్లలు చదువుతున్న పాఠశాలకు వెళ్లి అక్కడ జరుగుతున్న కార్యక్రమాలు, చదువుల సారాంశాలు కూడా పర్యవేక్షి ంచాలి. తరచూ పాఠశాల ఉపాధ్యాయు లను, క్లాస్ టీచర్ని కూడా కలసి తమబిడ్డల ప్రగతి గురించి దర్యాప్తు చెయ్యాలి. తల్లిదండ్రులు నిరక్షరాస్యులైనా, చదువు కున్నవారైనా ఉపాధ్యాయులను కలవడంవలన పిల్లల చదు వుపట్ల తల్లిదండ్రులకున్న శ్రద్ధ, ఆసక్తిస్పష్టంగా కనిపిస్తుం ది. పాఠశాల యాజమాన్యం పిలిచినప్పుడే కాకుండా తల్లి దండ్రులు కనీసం నెలకు ఒక్కసారైనా వెళ్లి పిల్లల గురించి తెలుసుకోవాలి. మార్కులొక్కటేకాదు ఉపాధ్యాయులతో ఎలా మెలుగుతున్నారు, తరగతిగదిలో ఎలా వ్యవహరిస్తున్నారు, పాఠం చెప్పేటప్పుడు శ్రద్ధ ఎలా ఉంది,ఎపుడైనా సందేహ నివృత్తికై ప్రశ్నిస్తాడా లేక నిశబ్దంగానే కూర్చుంటున్నాడా, మిత్రులతో ఎలామెలుగుతున్నాడు, ఉపాధ్యాయులపట్ల, పెద్దలపట్ల గౌరవభావాలూ ఎలా ఉన్నాయి?అనే విషయాలు క్షుణంగా అడిగి తెలుసుకోవాలి. దీనితోబాటు ఆటపాటల్లో ఉత్సహం, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారా, లేకసిగ్గు బిడియంతో ఉంటున్నారా అనే విషయాలను గమనించాలి. ఈప్రక్రియ వలన తమపిల్లల ప్రగతి లేదా వెనుకబాటు తనాన్ని అంచనా వేయడమేకాదు ఆయా అంశాలలో ఉపాధ్యాయులతో భాగస్వామ్యమై తగిన జాగ్రత్తలు తీసుకోవడానికి ఉపాధ్యాయుల సలహాలను పాటించి ఇంటి దగ్గర కుడా పర్యవేక్షి ంచడానికి వీలు కలుగుతుంది. బాలల భవిష్యత్తు, అభివృద్ధి తరగతిగదిలోనే నిర్మించబడు తుంది గనుక దానికి సంబంధించిన వ్యూహాలను రచించడం లో ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యాలు ఎప్పటిక ప్పుడు చర్చిస్తూనే ఉండాలి. పేరెంట్ సమావేశాల పేరిట తల్లిదండ్రులతో నామమాత్రపు సమావేశాలే కాకుండా పిల్లల ప్రగతి, విద్యార్థి ఏదేని రంగంలో వెనుకబడి ఉంటే ఆ విష యాలను తల్లిదండ్రులతో కూడా చర్చించి ఆవిద్యార్థినేపథ్యా లను పరిగణనలోనికి తీసుకొని అనువైన వ్యూహాలను నిర్మించాలి. ఈప్రక్రియ ద్వారా విద్యార్థికి ఒక మానసిక సంబంధమైన పరిపుష్టి లభిస్తుంది. తద్వారా ఎదురైన లోపాలను సమర్థవంతంగా ఎదుర్కోగలుగుతాడు. అంతేగాక అభ్యసనలో లేదా తరగతి గదిలో ఉత్సహంగా పాల్గొనని విద్యార్థి నిర్లక్ష్యానికి గురైతే అది సమ్మిళిత విద్యా సూత్రానికే వ్యతిరేకం. అందుకే పాఠశాల యాజమాన్యాలు కూడా ఈ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# జంతర్‌మంతర్ ఘటనపై హైపవర్ కమిటీ



## జస్టిస్ సుభాష్‌రెడ్డి నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో ఏర్పాటు

### ముగ్గురు రిటైర్డ్ జడ్జిలు, సిబిఐ మాజీ డైరెక్టర్, మాజీ డిజిపి నియామకం

**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** నీట్‌యుజి ప్రశ్నపత్రం లీక్ నేపథ్యంలో గత నెలలో జరిగిన నిరసనల సందర్భంగా ఢిల్లీలోని జంతర్ మంతర్‌వద్ద, దేశవ్యాప్తంగా ఇతర ప్రాంతాలలో పోలీసులు, ఇతర భద్రతా సిబ్బంది మితిమీరి, అసమానంగా బలప్రయోగం చేశారన్న ఆరోపణలపై విచారణ జరిపేందుకు జస్టిస్ ఆర్. సుభాష్ రెడ్డి నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో కూడిన అత్యున్నత స్థాయి విచారణ కమిటీని సుప్రీంకోర్టు గురువారం ఏర్పాటు చేసింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రెడ్డితో పాటు, ఈ ప్యానెల్‌లోని ఇతర సభ్యులలో పంజాబ్ - హర్యానా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి రవిశంకర్ ఝా, ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శాలిందర్ కౌర్, సిబిఐ మాజీ డైరెక్టర్ రిషి కుమార్ శుక్లా, మేఘాలయ మాజీ డిజిపి ఎల్ ఆర్ బిష్ణోయ్ ఉన్నారు. పిటిషనర్లు, ప్రతివాదులు ఇచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకుని, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్‌లు జయమాల్య బాగ్చి, వి మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం, ప్యానెల్ పరిశీలించబోయే అంశాలను నిర్దేశించింది.

**ఆందోళనకారులపై పోలీసుల చర్యలను విచారించనున్న కమిటీ**

ఈ కమిటీ ప్రధానంగా రెండు కోణాల్లో సమగ్ర విచారణ చేపట్టనుంది. మొదటగా పోలీసుల చర్యలపై వచ్చిన ఆరోపణలు, నిరసనకారులపై పెల్లెట్ గన్స్, ఎలక్ట్రిక్ లాఠీలు, టియర్ గ్యాస్ ప్రయోగం, లాఠీఛార్జి వంటి తీవ్రమైన చర్యలపై విచారణ జరపనుంది.

మహిళా నిరసనకారులపై హింస, పోలీసుల నిఘా వ్యవహారాలు, అల్లర్లను నియంత్రించే క్రమంలో అవసరానికి మించి భద్రతా బలగాలు వ్యవహరించాయా అన్న కోణంలో విచారణ చేయనుంది. మరోవైపు ఆందోళనకారుల వల్ల విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిపై జరిగిన దాడులు, హింసాత్మక ఘటనలు, నిరసనల పేరుతో జరిగిన ప్రభుత్వ, ప్రజా ఆస్తుల ధ్వంసంపైనా ఉన్నతస్థాయి కమిటీ విచారణ జరపనుంది."ఈ అత్యున్నత స్థాయి విచారణ కమిటీని ఏర్పాటు చేసేటప్పుడు సభ్యుల వ్యక్తిగత నైపుణ్యం, అనుభవం, కమిటీలోని వైవిధ్యం వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకున్నాం. హైపవర్ కమిటీచేసే సిఫార్సులు ఈ న్యాయస్థానానికి ఎంతో విలువైన సహాయాన్ని అందిస్తాయి. తగిన పరిశీలన అవసరమైన అన్ని అంశాలపై కమిటీ సమగ్ర అంచనాను చేపట్టగలదని మాకు నమ్మకం ఉంది. అదేవిధంగా పోలీసు అధికారులు, భద్రతా సిబ్బంది వల్ల నిరసనకారులకు తీవ్రమైన హాని, గాయాలు కలిగినట్లు వచ్చిన ఆరోపణలపై కూడా అంచనా వేయవచ్చు.

అలాగే, అటువంటి అకృత్యాలకు దారితీసిన పరిస్థితులు, అందుకు బాధ్యులైన వ్యక్తులు, బలాన్ని ప్రయోగించేటప్పుడు ఏవైనా చట్టాలు, నిబంధనలు లేదా ప్రమాణాలు ఉల్లంఘించారా? వంటి అంశాలను కూడా విచారించవచ్చు అని ధర్మాసనం పేర్కొంది. హైపవర్ చేపట్టే విచారణ ఒక్కసారి మాత్రమే చేసే ప్రక్రియగా పరిమితం కాకూడదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ అంశాలపై నిరంతర, క్రమబద్ధమైన సమీక్షను చేపట్టాలని, అలాగే తమకు మధ్యంతర నివేదికలను ఎప్పటికప్పుడు సమర్పించాలని కమిటీని ఆదేశించింది.



# చెత్త నిర్వహణ బాధ్యత ప్రతి ఒక్కరిది

## కఠిన చర్యలు తీసుకోండి: సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** చెత్త నిర్వహణ అనేది పారిశుద్ధ్య సిబ్బంది పని మాత్రమే కాదు, చెత్తను ఉత్పత్తి చేసే ప్రతి వ్యక్తి, సంస్థ బాధ్యత అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.పాఠశాలలు, కాలేజీల్లో వ్యర్థాల నిర్వహణపై అవగాహన

ఘన వ్యర్థాల నిర్వహణపై విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు పాఠశాలలు, ఉన్నత విద్యా సంస్థల పాఠ్యాంశాలు, శిక్షణ కార్యక్రమాల్లో సైద్ధాంతిక, ప్రాక్టికల్ విద్యను వెంటనే చేర్చాలని సుప్రీంకోర్టు సూచించింది. ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో పాటు, శిక్షణ పొందిన విద్యార్థులు తమ ఇళ్లలోనే వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని ధర్మాసనం పేర్కొంది. దేశవ్యాప్తంగా బల్క్ వేస్ట్ జనరేటర్లను ఆరు వారాల్లో గుర్తించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. నిబంధనలను పాటించని సంస్థలు, సముదాయాలపై చర్యలు తీసుకోవాలని సూచించింది. ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలను పాటించడంలో విఫలమైతే అవసరాన్ని బట్టి నీరు లేదా విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయవచ్చని ధర్మాసనం పేర్కొంది. నిబంధనలు పాటించినట్లు ధ్రువీకరణ పత్రం సమర్పించిన తర్వాతే ఆయా సదుపాయాలను పునరుద్ధరించాలని సూచించింది. మున్సిపల్ సంస్థలు ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలను సక్రమంగా అమలు చేయాలన్న అంశంపై నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ (ఎన్‌జిటి) ఇచ్చిన ఉత్తర్వులకు సంబంధించిన అప్పీళ్లను సుప్రీంకోర్టువిచారించింది. మొదట భోపాల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన వ్యవహారంగా ప్రారంభమైన ఈకేసు.. సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని దేశవ్యాప్తంగా ఘన వ్యర్థాల నిర్వహణపై దృష్టి సారించేలా విస్తరించింది. సమాజంలో 'చెత్తను ఉత్పత్తి చేసే హక్కు ఉంది కానీ దాని ప్రభావాన్ని నియంత్రించేందుకు సహకరించాల్సిన అవసరం లేదు' అనే ధోరణి ఉండటం విచారకరమని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

ఘన వ్యర్థాల నిర్వహణను పర్యవేక్షించేందుకు డిజిటల్ విధానాలను విస్తృతంగా ఉపయోగించాలని సుప్రీంకోర్టు సూచించింది. చెత్త పేరుకు పోయిన ప్రాంతాల జియోట్యాగ్‌డ్ ఫొటోలు, ప్రతి నెలా అమలు నివేదికలను ప్రత్యేక పోర్టల్ ద్వారా సమర్పించాలని



# కెన్యాలో హెలికాప్టర్ కూలి ఏడుగురు దుర్మరణం

**నైరోబి, ఆగస్టు 20:** కెన్యాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సఫారీ ప్రయాణంలో ఉన్న హెలికాప్టర్ కుప్పకూలడంతో ఏడుగురు మరణించారు. మృతుల్లో ఈక్వెడార్ ఇంటెలిజెన్స్ చీఫ్ దంపతులతో పాటు ఐదుగురు అమెరికన్లుఉన్నారు. ఉత్తర కెన్యాలోని మారుమూల ప్రాంతంలో బుధవారం ఈ ప్రమాదం జరిగింది. కెన్యా పౌర విమానయాన సంస్థ తెలిపిన వివరాల ప్రకారం.. లోయిసాబా కన్జర్వెన్సీ నుంచి ఎవాసో న్యిరో ప్రాంతానికి వెళ్తుండగా ఉదయం 9.13 గంటలకు సాంబురు కౌంటీలోని పర్వత ప్రాంతంలో హెలికాప్టర్ ప్రమాదానికి గురైంది. ఘటన సమయంలో హెలికాప్టర్‌లో ఆరుగురు ప్రయాణికులు, ఒక పైలట్‌ఉన్నారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. అయితే హెలికాప్టర్‌లో ఉన్నవారంతా మృతి చెందినట్లు సాంబురు పోలీసు కమాండర్ డేవిడ్ న్కోరోయ్ వెల్లడించారు. మృతుల్లో ఐదుగురు అమెరికా పౌరులు ఉన్నట్లు అమెరికా విదేశాంగ శాఖ ధ్రువీకరించింది. ఈక్వెడార్ నేషనల్ ఇంటెలిజెన్స్ సెంటర్ డైరెక్టర్ పేరు మిచెల్ సెన్సీ-కాంటూగి.. ఆయన సతీమణి స్టెఫనీ హోలిహన్ కూడా మృతి చెందారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపిన అమెరికా రాయబార కార్యాలయం.. స్థానిక అధికారులతో కలిసి కాన్సులర్ సహాయం అందిస్తున్నట్లు పేర్కొంది.

# భార్య, సోదరిని చంపి ఆత్మహత్య చేసుకున్న ఎస్‌బిఐ ఉద్యోగి

**లక్నో, ఆగస్టు 20:** మానస్ వాజ్‌పేయి అనే ఎస్‌బిఐ బ్యాంక్‌లో ఉద్యోగి గురువారం మధ్యాహ్నం లక్నోలోని ప్రముఖ ప్రాంతమైన గోమతి నగర్‌లో ఉన్న ఐసిఐసిఐ బ్యాంక్ బయట తన భార్యను కాల్చి చంపాడు. ఈ ఘటనను చూసిన ప్రత్యక్ష సాక్షులు పోలీసులకు సమాచారం అందించారు. వారికి ఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. 38 ఏండ్ల మానస్ వాజ్‌పేయి బ్యాంక్‌లో పనిచేస్తున్న తన భార్య దివ్య మిశ్రాను బయటకు పిలిచాడు. కొద్దిసేపు మాట్లాడిన తర్వాత కాల్పులు జరిపి అక్కడి నుంచి పారిపోయాడు. అక్కడ ఉన్నవారు ఆమెను ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయిందని డాక్టర్లు నిర్ధారించారని పోలీసులు తెలిపారు. మానస్, దివ్యలకు 12 యేండ్ల క్రితం వివాహం అయ్యింది. కొంతకాలంగా వారు విడిగా ఉంటున్నారు. దివ్య గతేడాది విడాకుల కోసం దరఖాస్తు చేసుకుందని సమాచారం. మానస్ మానసిక సమస్యలతో బాధపడుతున్న తన 28 ఏండ్ల చెల్లెలు శివ వాజ్‌పేయిని కూడా కాల్చి చంపాడు. అనంతరం తాను ఆత్మహత్య చేసుకునేముందు తన భార్యను, చెల్లెలిని చంపిన విషయాన్ని వాట్సప్ స్టేటస్‌లో పెట్టాడు. ఈ రోజు నన్ను మోసం చేసిన నా భార్యను చంపేశాను.

నా చెల్లెల్లిని చంపి, నేను చనిపోతున్నాను. ఆమె చెల్లెలు ప్రజ్ఞ అన్నీ అంతం కావాలి అని వాట్సప్ స్టేటస్‌లో రాశాడు. మానస్ 12:30కు ఇంటికి వచ్చాడని, ఆందోళన, చెమటలు పట్టిన ముఖంతో కనిపించాడని పొరిగింటివారు చెప్పారు. ఇంటిలోకి వెళ్లిన అతడు హనుమాన్ చాలీసాను ప్లే చేశాడు. తరువాత అతడి వాట్సాప్ స్టేటస్ చూసి లోనికివెళ్లి చూడగా మానస్ విగతజీవిగా కనిపించాడని వారు చెప్పారు. ఈ ఘటన గురించి దివ్య సోదరి ప్రజ్ఞ మిశ్రా సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేశారు. నా సోదరిపై కాల్పులు జరిగాయని నాకు ఇప్పుడే ఫోన్ వచ్చింది. ఆమెను లోహియా ఆస్పత్రికి తరలించారు. దయచేసి ప్రార్థించండి అని ఆమె యుపి పోలీసులకు ట్యాగ్ చేశారు. మానస్ తన వాట్సప్ స్టేటస్‌లో ప్రస్తావించిన ప్రజ్ఞ ఈమె అని పోలీసులు నిర్ధారణకు వచ్చారు.

# చీనాబ్ వంతెనపై 100 కిమీ వేగంతో వందేభారత్

**శ్రీనగర్, ఆగస్టు 20:** భారతీయ రైల్వే చరిత్రలో మరో సువర్ణాధ్యాయం ఆవిష్కృతమైంది. దుర్భేద్యమైన కాశ్మీర్ లోయను దేశంలోని ఇతర ప్రాంతాలతో అనుసంధానించే క్రమంలో నిర్మించిన ఇంజనీరింగ్ అద్భుతమైన చీనాబ్ రైల్వే బ్రిడ్జిపై మన ప్రతిష్టాత్మక వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు వంద కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లి సరికొత్త రికార్డు సృష్టించింది.

ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే వంతెనపై గంటకు దాదాపు 100కి.మీ వేగంతో శరవేగంగా ప్రయాణించి, భారత్ తన రవాణా సాంకేతికతతో ప్రపంచాన్ని మరోసారి ఆశ్చర్యపరిచింది. ఉత్తర రైల్వే పరిధిలోని శ్రీమాతా వైష్ణోదేవి కత్రా నుంచి బనిహాల్ వరకు ఉన్న 111 కిలోమీటర్ల పొడవైన నూతన బ్రాడ్ గేజ్ రైలు మార్గంలో రైళ్ల వేగాన్ని గంటకు 100 కిలోమీటర్లకు పెంచేందుకు రైల్వే మంత్రిత్వ శాఖ అధికారికంగా ఆమోదం తెలిపింది. గతంలో ఈ మార్గంలోని కత్రాసంగల్దాన్ సెక్షన్‌లో గంటకు 85 కి.మీ, సంగల్దాన్ బనిహాల్ సెక్షన్‌లో గంటకు 75 కి.మీ మాత్రమే గరిష్ట వేగానికి అనుమతి ఉండేది.

# ఇరాన్‌కు ఆర్థిక సాయం చేస్తే భారీ మూల్యం తప్పదు

## దేశాలకు ట్రంప్ 'ఎకనామిక్ డీ-డే' హెచ్చరిక

**వాషింగ్టన్, ఆగస్టు 20:** ఇరాన్‌కు ఆర్థికంగా లేదా లాజిస్టిక్స్ పరంగా సహాయం చేసే దేశాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్‌కు ఎలాంటి ఆర్థిక సహాయం అందించినా 'భారీ ఆర్థిక పరిణామాలు' ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇరాన్‌పై కొనసాగుతున్న అమెరికా సైనిక చర్యను అత్యంత తీవ్రమైన ఆర్థిక ఆపరేషన్‌గా ట్రంప్ అభివర్ణించారు. ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో చేసిన సుదీర్ఘ పోస్టులో ఇరాన్‌కు సంబంధించిన చమురు అక్రమ రవాణా, నగదు బదలీలు, ఎక్స్ఛేంజ్ హౌస్‌లు, షిప్ రిజిస్ట్రేషన్లు, నకలీ లేదా ముందస్తు కంపెనీల ద్వారా జరిగే లావాదేవీలను వెంటనే నిలిపివేయాలని కోరారు.

**'ఎకనామిక్ డీ-డే' అంటూ ట్రంప్ హెచ్చరిక**

ఇరాన్‌కు సహాయం చేస్తున్న దేశాలను ఉద్దేశించి ట్రంప్ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. అమెరికా మిత్రదేశాలన్నీ తమతో కలిసి ఇరాన్‌ను ఒంటరిగాచేసి, ఆ దేశం నుంచి ఎదురయ్యే ముప్పును ఓడించేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఇరాన్ ప్రస్తుతం తీవ్ర ఒత్తిడిలో ఉందని, ఆ దేశం 'ఒక దారంతో వేలాడుతున్నట్లుగా' ఉంది ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ అణ్వాయుధాల్ని పొందేందుకు అనుమతించబోమని కూడా మరోసారి స్పష్టం చేశారు.

**ఇరాన్‌పై మరిన్ని కఠిన ఆంక్షలకు సంకేతాలు**

ఇరాన్‌పై మరిన్ని కఠిన ఆంక్షలు విధించే అవకాశం ఉందని ట్రంప్ వ్యాఖ్యలు సూచిస్తున్నాయి. ఫిబ్రవరి 28 నుంచి అమెరికా, ఇరాన్ మధ్య సైనిక ఘర్షణ కొనసాగుతున్న నేపథ్యంలో ఈ హెచ్చరికలు వచ్చాయి. ఇరాన్‌పై ఆర్థిక ఒత్తిడిని మరింత పెంచేందుకు అమెరికా సిద్ధమవుతోందనే సంకేతాలను ట్రంప్ తాజా వ్యాఖ్యలు ఇస్తున్నారు.



ఇరాన్‌పై చేపట్టిన నౌకాదళ దిగ్బందనం విజయవంతమైందని ట్రంప్ పేర్కొన్నారు. ఈ దిగ్బంధనం '100 శాతం విజయవంతమైంది' అని అన్నారు. ఇరాన్‌పై ఆంక్షలు, సైనికచర్యలు కొనసాగుతున్నప్పటికీ అంతర్జాతీయ చమురు ధరలు పెద్దగా పెరగలేదని ట్రంప్ పేర్కొన్నారు. చమురు మార్కెట్‌లో అంతరాయాలు ఉన్నప్పటికీ ధరలు ఎక్కువగా స్థిరంగా ఉన్నాయని అన్నారు.

ఇరాన్‌పై అమెరికా చర్యల విషయంలో ట్రంప్‌పై ఒత్తిడి పెరుగుతున్నట్లు సమాచారం. నివేదిక ప్రకారం.. ఇరాన్ స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్‌నుతెరిస్తే అమెరికా తనచర్యలను నిలిపివేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రపంచ చమురు సరఫరాకు స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్ అత్యంత కీలకమైన మార్గాల్లో ఒకిటి కావడంతో, ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు అంతర్జాతీయ ఇంధన మార్కెట్లపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

# జార్ఖండ్ ప్రభుత్వం పరీక్ష, నియామకాల రద్దుపై హైకోర్టు స్టే



**రాంచి, ఆగస్టు 20:** జార్ఖండ్‌లోని హేమంత్ సోరెన్ ప్రభుత్వానికి భారీ ఎదురుదెబ్బ తగిలింది. జెపిఎస్‌సి పరీక్షల్ని రద్దు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై జార్ఖండ్ హైకోర్టు స్టే విధించింది. సింగిల్ బెంచ్ జడ్జి జస్టిస్ దీపక్ రోషన్ గురువారం ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో జెపిఎస్‌సి పరీక్షల ద్వారా ఇటీవల నియామకమైన ప్రభుత్వ ఉద్యోగులకు ఊరట లభించింది. జెపిఎస్‌సి (జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్)తోపాటు జెపిఎస్‌సి (జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్) చేపట్టిన పరీక్షల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ అక్కడి విద్యార్థి సంఘాలు, యువత గత నెల నుంచి పెద్ద ఎత్తున ఆందోళన చేసిన సంగతి తెలిసిందే. కొందరు విద్యార్థులు ఆమరణ నిరాహార దీక్షలకు దిగారు. విద్యార్థి సంఘాలతోపాటు ప్రతిపక్షాలు కూడా విద్యార్థులకు మద్దతుగా నిలిచాయి. రెండేళ్లుగా ఈ రెండు సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షల్ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. చివరకు వారి డిమాండ్లకు తలొగ్గిన సిఎం హేమంత్ సోరెన్ ఆధ్వర్యంలోని సర్కార్ పరీక్షల్ని రద్దు చేసింది. 2024 నుంచి జెపిఎస్‌సి ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షలు, నియామకాల్ని రద్దు చేస్తూ ఇటీవలే నిర్ణయం తీసుకుంది. దీంతో ఈ నిర్ణయాన్ని తాజాగా ఎంపికైన ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. జెపిఎస్‌సిద్వారా రెండేళ్లుగా దాదాపు 39 ఉద్యోగ నియామక పరీక్షలు జరిగాయి. వాటిలో కొన్ని ఫలితాలు వెలువడి నియామకాలు కూడా పూర్తయ్యాయి. వేలాది మంది ఉద్యోగాల్లో చేరిపోయారు. జెపిఎస్‌సి ప్రక్రియద్వారా ఎన్నికై.. యేడాది, రెండేళ్ల నుంచి ఉద్యోగాలు కూడా చేస్తున్నారు. అయితే, ప్రభుత్వం ఈ పరీక్షల్ని, నియామకాల్ని రద్దు చేయడంతో వారి ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి వచ్చింది. దీంతో వారు ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ జార్ఖండ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇటీవల ఎంపికైన ఉద్యోగుల ఆధ్వర్యంలో ఈ పిటిషన్ దాఖలైంది. ప్రభుత్వ నిర్ణయంవల్ల తమకు అన్యాయం జరుగుతుందని వారు పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై విచారించిన కోర్టు పరీక్షల్ని రద్దుచేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై స్టే విధించింది. ఈనేపథ్యంలో ప్రభుత్వం ఏనిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

# కాంగ్రెస్ మాజీ ఎంపి సజ్జన్‌కుమార్ కన్నుమూత

**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ సజ్జన్ కుమార్ కన్నుమూశారు. 1984 నాటి సిక్కు అల్లర్ల కేసులో ఆయన జీవితకాల శిక్షను అనుభవిస్తున్నారు. ఢిల్లీలోని సఫ్దార్‌జంగ్ ఆస్పత్రిలో ఆయన ప్రాణం విడిచారు. తీహార్ జైలు నుంచి ఆయన్ను చివరి క్షణాల్లో ఆస్పత్రికి తరలించారు. ఆయన వయసు 80 ఏళ్లు. చాలా కాలంగా పలు రకాల రుగ్మతలతో ఆయన బాధపడుతున్నారు. ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టు గత ఏడాది ఫిబ్రవరి 12వ తేదీన సజ్జన్ కుమార్‌ను దోషిగా తేల్చింది. ఆ తర్వాత ఆయనకు ఆ కేసులో జీవితకాల శిక్షను విధించింది. సజ్జన్ కుమార్‌కు మరణశిక్ష విధించాలని కోరుతూ సిక్కు అల్లర్ల బాధితులు డిమాండ్ చేశారు. మూడు సార్లు ఆయన లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఔటర్ ఢిల్లీ నియోజకవర్గం నుంచి ఆయన పోటీ చేశారు. కాంగ్రెస్ పార్టీలో ప్రముఖ నేతగా గుర్తింపు ఉన్నది. 2018లో దోషిగాతేలడంతో ఆయన పార్టీకి రాజీనామా చేశారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హత్య తర్వాత ఢిల్లీలో అల్లర్లు చోటుచేసుకున్నాయి. 1984 అక్టోబర్ 31వ తేదీన ఇందిరా గాంధీ బాడీగార్డులు సత్వంత్ సింగ్, బియాంత్ సింగ్ ఆమె హత్యకు పాల్పడ్డారు. అయితే ఆ హత్య నేపథ్యంలో సిక్కులపై ఢిల్లీలో ఊచకోత జరిగింది. సిక్కుల ఇండ్లు, షాపులపై దాడి చేశారు. సుమారు 3వేల మంది సిక్కులను హతమార్చారు. జశ్వంత్ సింగ్‌తో పాటు ఆయన కుమారుడి హత్య కేసులో సజ్జన్‌కుమార్ నిందితుడిగా ఉన్నారు. ఇందిరా గాంధీ మరణం తర్వాత ఇద్దరు సిక్కులను హతమార్చిన కేసులో మరో వ్యక్తి యశ్‌పాల్ మాలిక్‌కు మరణశిక్ష వేశారు. ఇక ఇదే ఘటనతో లింకున్న కిషోరి లాల్ అనే వ్యక్తికి కూడా 1996లోనే మరణశిక్ష విధించారు. కానీ సిక్కుల మర్డర్ కేసులో సజ్జన్ కుమార్‌కు కేవలం జీవితకాల శిక్ష పడింది.



# రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా నేతల నివాళులు!

**న్యూఢిల్లీ,ఆగస్టు 14:** భారతదేశ మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేతలు గురువారం ఘన నివాళులు అర్పించారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ సహా పలువురు నేతలు ఆయనకు అంజలి ఘటించారు. వారంతా రాజీవ్ గాంధీ స్మారక చిహ్నమైన వీరభూమిని సందర్శించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వీడియోను ఎక్స్ వేదికగా కాంగ్రెస్ పార్టీ షేర్‌చేసింది. ఈ సందర్భంగా ఆధునిక భారతదేశ నిర్మాణంలో రాజీవ్ గాంధీ కృషి ఎప్పటికీ స్మరించుకోతగినది అని కాంగ్రెస్ పేర్కొంది. దేశవ్యాప్తంగా ఉన్న ఆ పార్టీ శ్రేణులు నేడు మాజీప్రధాని జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నాయి. ఎక్కడికక్కడ రాజీవ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్నారు. దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకుంటున్నారు. మరోవైపు రాజీవ్ గాంధీకి ప్రధాని నరేంద్ర మోడీ కూడా నివాళులు అర్పించారు. సద్భావనా దివస్ సందర్భంగా ఆయనను మోడీ స్మరించుకున్నారు. భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు అంటూ ఎక్స్ వేదికగా మోడీ పోస్టు చేశారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా నేడు సద్భావనా దివస్ (గుడ్‌విల్ డే) జరుపుకుంటారు. ఈ రోజు మాజీ ప్రధాని ప్రతిపాదించిన విలువలను స్మరించుకుంటారు.

# మోహన్ భగవత్‌కు దౌత్య మర్యాదలు వద్దు

## అమెరికా కమిషన్ సంచలన వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** ఆర్‌ఎస్‌ఎస్‌పై ఆంక్షలు విధించాలని అమెరికాకు చెందిన మత స్వేచ్ఛల కమిషన్ (యుఎస్సీ ఐఆర్‌ఎఫ్) డిమాండ్ చేసింది. ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఈ నెల 29న న్యూయార్క్ పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో ఈ ప్రతిపాదన రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. భగవత్‌తోపాటు ఆర్‌ఎస్‌ఎస్ నేతలకు అమెరికా ప్రభుత్వం ఉన్నతస్థాయి దౌత్య మర్యాదలు ఇవొవ్వద్దని కమిషన్ సభ్యులు కోరారు. ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన అనుబంధ సంస్థలు భారత్‌లో మైనారిటీలపై దాడులకు పాల్పడ్డాయని యుఎస్సీ ఐఆర్‌ఎఫ్ చైర్మన్ ఆసిఫ్ మహమూద్ ఆరోపించారు.



ప్రధాని నరేంద్ర మోడీ సైతం ఆర్‌ఎస్‌ఎస్ సభ్యుడేనని పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ నేతలపై ఆంక్షలు విధించాలని కమిషనర్ జీన్ మిల్స్ సూచించారు. మత స్వేచ్ఛ ఉల్లంఘనలకు బాధ్యులైన ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులపై చర్యలు తీసుకోవాలని అమెరికా ప్రభుత్వాన్ని కోరారు. మార్చిలో విడుదల చేసిన వార్షిక నివేదికలోనూ భారత్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేసిన యుఎస్సీ ఐఆర్‌ఎఫ్.. ఆర్‌ఎస్‌ఎస్, రా వంటి సంస్థలపై ఆంక్షలు విధించాలని సిఫార్సు చేసింది.

అయితే యుఎస్సీ ఐఆర్‌ఎఫ్ ఆరోపణలను భారత్ గతంలోనే ఖండించింది. భారత్‌పై వక్రీకరించిన, ఏకపక్ష చిత్రాన్ని ఆ సంస్థ చూపుతోందని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.

అనుమానాస్పత వర్గాలు, భావజాల కథనాల ఆధారంగా యుఎస్సీ ఐఆర్‌ఎఫ్ నివేదికలు తయారవుతున్నాయని విమర్శించింది. భారత బహుళత్వ సమాజంపై తప్పుడు ముద్ర వేసేందుకు ఆ సంస్థ ప్రయత్నిస్తోందని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మండిపడ్డారు. అమెరికాలో హిందూ దేవాలయాలపై దాడులు, భారతీయులపై పెరుగుతున్న అసహనాన్ని ముందుగా పరిశీలించాలని సూచించారు.

# సంక్షిప్త వార్తలు

## పాక్ హైకమిషన్‌వద్ద ఢిల్లీ సర్కార్ బుల్‌డోజర్



**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** పాకిస్థాన్‌కు భారత్ తగిన గుణపాఠం చెప్పింది. పాకిస్తాన్ చర్యకు ధీటుగా బదులిచ్చింది. ఇటీవల పాకిస్తాన్‌లోని భారత రాయబార కార్యాలయం వద్ద ఉన్న బారికేడ్లను పాక్ ప్రభుత్వం తొలగిస్తే ఇప్పుడు ఇండియా కూడా ఇక్కడ ఉన్న పాక్ రాయబార కార్యాలయం వద్ద బుల్డోజర్ చర్యకు దిగింది. పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో భారత రాయబార కార్యాలయం ఉంది. ఈ కార్యాలయం వద్ద ఉన్న సెక్యూరిటీ బారికేడ్లను ఇటీవల పాకిస్థాన్ ప్రభుత్వం తొలగించింది. ఇది జరిగి మూడు రోజులు అవుతోంది. దీంతో పాక్ చర్యకు భారత్ కూడా అదేరీతిలో బదులిచ్చింది.

## గ్యాంగ్‌స్టర్ వినోద్‌ను కాల్చివేసిన దుండగులు

**హిసార్, ఆగస్టు 20:** గ్యాంగ్‌స్టర్ వినోద్ పను అలియాక్ కనాను దుండగులు గురువారం కాల్చి చంపారు. హరియాణాలోని హిసార్‌లో ఉన్న కోర్టు గేటు బయట కాల్చిచంపారు. ఒక కేసు విచారణ కోసం వినోద్ కోర్టుకు వెళ్తుండగా, బైకుపై వచ్చిన దుండగులు అతడిపై గేటు బయట కాల్పులు జరిపారు. దాదాపు 12 రౌండ్ల కాల్పులు జరపడంతో అతడు అక్కడికక్కడే మరణించాడు.ముందుగా వినోద్ దగ్గరికి వచ్చిన దుండగులు సమీపం నుంచి వరుసగా కాల్పులు జరిపారు. అనంతరం రెండు రౌండ్లు గాలిలో కాల్పులు జరిపారు. కాల్పుల అనంతరం ఇద్దరు దుండగులు వేగంగా బైకుపై అక్కడినుంచి పారిపోయారు.

## రూ. 20 లంచం కేసులో 30 యేళ్లకు సుప్రీం క్లీన్ చిట్

**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** 1996లో నమోదైన రూ.20 లంచం ఆరోపణల కేసులో గుజరాత్ ప్రభుత్వానికి చెందిన ఓ క్లర్క్, ప్యూన్‌కు విధించిన శిక్షను సుప్రీంకోర్టు రద్దు చేసింది. విద్యార్థికి ఆదాయ ధ్రువీకరణ పత్రం జారీ చేసేందుకు రూ.120 లంచం డిమాండ్ చేశారని ఆరోపణలు వచ్చాయి. ఎసిబి నిర్వహించిన ట్రాప్‌లో ప్యూన్ వద్ద రూ.20 స్వాధీనం చేసుకోగా.. క్లర్క్ వద్ద ఆరోపించిన రూ.100 లభించలేదు. లంచం డిమాండ్ చేసినట్లు నిర్ధారించే స్పష్టమైన ఆధారాలు లేవని సుప్రీంకోర్టు పేర్కొంది. ఫిర్యాదుదారు వాంగ్మూలంలోనూ భిన్నతలు ఉన్నాయని ధర్మాసనం గుర్తించింది.

## బాంబే హైకోర్టు తీర్పుపై సుప్రీంలో తేజ్‌పాల్ సవాల్

**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** లైంగిక దాడి కేసులో బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పుపై జర్నలిస్టు తరుణ్ తేజ్‌పాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో తరుణ్ తేజ్‌పాల్‌కు పదేళ్ల జైలుశిక్ష విధించగా, ఆ తీర్పును సవాల్ చేస్తూ తరుణ్ తరుఫున అడ్వకేట్ ఆదిత్య సమద్దర్ పిటిషన్ దాఖలు చేశారు. తెహల్కా మాజీ ఎడిటర్‌కు శిక్ష విధించాలని గోవా ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించిన విషయం తెలిసిందే. తీవ్రమైన నేరానికి చాలా తక్కువశిక్ష విధించినట్లు గోవా సర్కారు అభిప్రాయపడింది.

## రెండుట్రక్కులు ఢీ...నలుగురు మృతి



**సిమ్లా, ఆగస్టు 20:** హిమాచల్ ప్రదేశ్‌లో రెండు ట్రక్కులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో నలుగురు మరణించారు. మరో ఏడుగురు గాయపడ్డారు. ఈ ఘటన హిమాచల్ ప్రదేశ్, మండి జిల్లా, చండీగఢ్‌మనాలి నేషనల్ హైవేపై, హనోగి టన్నెల్ లోపల గురువారం ఉదయం జరిగింది. టన్నెల్ లోపల ఉదయం 7.45 గంటలకు రెండు ట్రక్కులు వేగంగా వెళ్తూ, ఎదురెదురుగా ఢీకొన్నాయి. వేగంగా ఢీకొనడంతో వాహనాల ముందుభాగం నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో ట్రక్కుల్లోని ముగ్గురు అక్కడికక్కడే మరణించారు. మరొకరు ఆస్పత్రిలో మరణించారు.




# గ్రామీణ ఆరోగ్య కేంద్రాలకు శరవేగంగా శాశ్వత భవన నిర్మాణాలు

- 4500కు పైగా విలేజ్ హెల్త్ క్లినిక్‌ల భవన నిర్మాణాలు
- శాసనసభలో రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

**సచివాలయం,ఆగష్టు 20,ప్రభాతవార్త :** రాష్ట్రంలో ప్రాధమిక ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు పిహెచ్‌సీలు,అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు,విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు సొంత భవనాల నిర్మాణాల పనులను ప్రభుత్వం వేగవంతం చేస్తుందని రాష్ట్ర వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలకు తొలి కేంద్రాలుగా ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్స్,ఆయుష్మాన్ ఆరోగ్య మంది రాలను పటిష్టం చేయడంతోపాటు పట్టణ ప్రాంతాల్లో అర్బన్ పిహెచ్‌సిలకు శాశ్వత భవనాలు కల్పిస్తున్నామని వెల్లడించారు. శాసనసభలో గురు వారం జరిగిన ప్రశ్నోత్తరాల సమ యంలోపలువురు సభ్యుల ప్రశ్నలకు మంత్రి సత్యకుమార్ జవాబిచ్చారు.

**పిహెచ్‌సీల్లో వైద్యుల పోస్టుల ఖాళీలు 57మాత్రమే:** రాష్ట్రంలో పిహెచ్‌సిలకు సంబంధించి భవనాల నిర్మాణం,మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి సారించామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 1231పిహెచ్‌సీలు ఉండగా...1143పి హెచ్‌సీలు సొంత భవనాల్లో కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు.కొత్తగా మంజూరైన 88పిహెచ్ సీభవనాల్లో 13పూర్తయ్యాయి. శిధిలావస్థకు చేరిన 140పిహెచ్‌సీ భవనాల స్థానంలో కొత్త భవనాల నిర్మాణానికి చేపట్టగా.. వాటిలో 118పూర్తయ్యాయి.


అసెంబ్లీలో వివరాలు తెలియజేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్

మరో 22నిర్మాణంలో ఉన్నాయి.పిహెచ్‌సి భవనాల బలోపేతానికి చేపట్టిన 948పనులు పూర్తయ్యాయి. 15వ ఆర్థిక సంఘం నిధులతో మరో 100పిహెచ్‌సీ భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టారు.ఆర్ అండ్ బి శాఖ ద్వారా చేపట్టిన 43పనుల్లో 14పూర్తికాగా, 29నిర్మాణంలో ఉన్నాయి, మరో 57భవనాల పనులు టెండర్ దశలో ఉన్నాయి. గత రెండేళ్ళలో పిహెచ్‌సీల్లో 600కి పైగా నియామకాలు చేపట్టాం. మొత్తం 1200పిహెచ్‌సీలు ఉండగా ప్రస్తుతం 57వైద్యుల పోస్టులు మాత్రమే ఖాళీగా ఉన్నాయని, వాటిని కూడా త్వరలో భర్తీ చేస్తాం అని మంత్రి వెల్లడించారు.

**502పట్టణ ఆరోగ్య కేంద్రాలకు సొంత భవనాలు:** పట్టణ ప్రాంతాల్లో 560అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు ఉండగా 175 ఇప్పటికే ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్నాయి.కొత్త భవనాల నిర్మాణానికి మరో 385కి అనుమతులు మంజూరయ్యాయి.వీటిలో 327భవనాలు నిర్మించి అప్పగించారు.మరో55 భవనాల నిర్మాణం కొనసాగుతోంది.మూడు భవనాల అంశం కోర్టులో ఉంది.మొత్తంగా 502యూపి హెచ్‌సిలకు సొంత భవనాలు అందుబాటులో ఉన్నాయి.మరో 55కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి అని మంత్రి తెలిపారు.

**విలేజ్ హెల్త్ క్లినిక్స్ భవన నిర్మాణాల్లోనూ పురోగతి:** గ్రామీణ ప్రాంతాల్లోని విలేజ్ హెల్త్ క్లినిక్స్, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు,హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లపై మంత్రి మాట్లాడుతూ ఇవి జాతీయ ఆరోగ్యమిషన్ పరిధిలో కొనసాగుతు న్నాయని చెప్పారు. గత ప్రభుత్వం కేంద్రం నుంచి నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ 15వ ఆర్థిక సంఘం,ఎన్‌హెచ్‌ఎం,పిఎం అభీమ్ తదితర పథకాల కింద 3105సంఖ్యలోనే సొంత భవనాలు నిర్మించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వ సహకా రంతో కేవలం రెండేళ్ళలోనే 4500కు పైగా భవనాల నిర్మాణాలు పురోగతిలోఉన్నాయన్నారు. పంచాయితీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఈ పనులు జరుగుతున్నాయని, గ్రామీణ ప్రాంతాల్లో ఇవే ప్రజలకు తొలి ఆరోగ్య సేవా కేంద్రాలు కావడంతోవాటిని పటిష్టం చేస్తున్నామని వివరించారు. అవసరమైన చోట కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల (ఎంఎల్‌హెచ్‌పిలు) నియామకాలు కూడా చేపడుతున్నామనితెలిపారు.

**ఉచితంగా 41రకాల పరీక్షలు:** ముఖ్యమంత్రి దార్శనికత మేరకు వ్యక్తి కేంద్రంగా వైద్యసేవలు అందించేందుకు సంజీవని డిజిటల్ హెల్త్ ప్లాట్‌ఫామ్‌ను తీసుకొచ్చామని మంత్రి చెప్పారు. ఇందులో ఇంటివద్దే 41రకాల పరీక్షలు నిర్వహించి ఆరోగ్య ప్రొఫైల్ రూపొందించడ ంతోపాటు అవసరమైన వారికి తదుపరి వైద్యం, అపాయింట్‌మెంట్లు, మందులు, డిజిటల్ హెల్త్ రికార్డు నిర్వహణ వంటి సేవలు అందించేలా వ్యవస్థను రూపొందించినట్లు తెలిపారు.

# కేంద్ర జల కాలుష్య నివారణ, నియంత్రణ సవరణ చట్టం

- 2024ను రాష్ట్రంలో అమలుపర్చే తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించిన శాసనసభ....
- తీర్మానాన్ని అసెంబ్లీ ప్రవేశపెట్టిన మంత్రి నాదెండ్ల మనోహర్

**విజయవాడ,ఆగస్టు 20,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జల (కాలుష్య నివారణ మరియు నియంత్రణ) సవరణ చట్టం-2024ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలుపర్చే తీర్మానాన్ని రాష్ట్ర శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తరఫున రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టగా, శాసనసభ సభ్యులు అందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ సందర్బంగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2024 ఫిబ్రవరి 15న నోటిఫై చేసిన ఈ సవరణ చట్టం, తొలుత హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాలకు వర్తించేలా రూపొందించబడిందన్నారు. అదే విధంగా, ఇతర రాష్ట్రాలు తమ శాసనసభలు, అవసరమైతే శాసన మండళ్లలో తీర్మానం ఆమోదించడం ద్వారా తమ రాష్ట్రాల్లో ఈ చట్టాన్ని అమలు చేయవచ్చన్నారు. ఆయా రాష్ట్రాలు తీర్మానాన్ని ఆమోదించిన తేదీ నుంచి ఆ రాష్ట్రాల్లో ఈ సవరణ చట్టం అమల్లోకి వస్తుంది. ఈ చట్టం ప్రధాన ఉద్దేశ్యం కాలుష్య నియంత్రణ వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చడం, నిబంధనలను సరళీకరించడం, వ్యాపార నిర్వహణను సులభతరం చేయడం మరియు పర్యావరణ పరిరక్షణకు అవసరమైన నియంత్రణలను కొనసాగిస్తూ, కొన్ని ఉల్లంఘనలకు సంబంధించి జైలు శిక్షలకు బదులుగా ద్రవ్యపరమైన జరిమానాల విధానాన్ని ప్రవేశపెట్టడం ముఖ్యమైన అంశం అన్నారు. అలాగే రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ నియామక ప్రక్రియను సరళీకరించడం, చట్టంలోని ఉల్లంఘనలపై విచారణ జరిపి జరిమానాలు విధించేందుకు అడ్జుడికేటింగ్ అధికారిని నియమించడం వంటి కీలక మార్పులు ఈ చట్టం ద్వారా అమల్లోకి వస్తాయన్నారు. ఈ సవరణ చట్టం అమలుతో పర్యావరణ పరిరక్షణకు మరింత ప్రాధాన్యతనిస్తూ, కాలుష్య నియంత్రణ వ్యవస్థలో పారదర్శకత, సమర్థత, బాధ్యతాయుతమైన పరిపాలనను బలోపేతం చేయడంతో పాటు పరిశ్రమలు, వ్యాపార సంస్థలకు అనుకూలమైన సరళమైన విధానాలు అందుబాటులోకి రానున్నాయన్నారు. తద్వారా ఆంధ్రప్రదేశ్‌లో జల వనరుల పరిరక్షణ, కాలుష్య నియంత్రణ చర్యలు మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి ఈ చట్టం దోహదపడనుందని మంత్రి తెలిపారు. ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తరఫున రాష్ట్ర పౌర సరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ సభలో ప్రవేశపెట్టిన జల (కాలుష్య నివారణ మరియు నియంత్రణ) సవరణ చట్టం-2024ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలుపర్చే తీర్మానాన్ని రాష్ట్ర శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

# వ్యవసాయభూముల నీటితీరువా రద్దుచేయాలి

**గన్నవరం(కృష్ణా), ఆగష్టు 20, ప్రభాతవార్త :** ప్రస్తుత ఎల్‌నినో కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో పంటలు పండించేందుకు సాగునీరులేక ఇబ్బందులు పడుతున్న రైతులను ఆదుకునేందుకురాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయభూముల నీటితీరువాలనురద్దుచేయాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసారు. శాసనసభ వర్షాకాల సమావేశాల్లో గురువారం పలు సమస్యలను యార్లగడ్డ అసె ంబ్లీలో ప్రస్తావించారు. గన్నవరం నియోజకవర్గంలోని పోలవరం కాలువ పరివాహక ప్రాంతాల్లోని గ్రామాల్లో చెరువులను పోలవరం నీటితో నింపి ప్రజలు, మూగజీవాలకు తాగునీటి ఇబ్బందులు తొలగించాలని కోరారు. మైనింగ్ అక్రమాలకు పాల్పడిన వారిపై మైనింగ్‌శాఖ ఉమ్మడి కృష్ణా జిల్లావ్యాప్తంగా రూ.87కోట్ల జరిమానాలు విధించిందని, ఇందులో ఒక్క గన ్నవరం నియోజకవర్గంలోనే రూ.52కోట్లు జరిమానా విధించిందని ఈమొత్తాన్ని అక్రమార్కుల నుండి వసూలు చేయాల్సి ఉందని, ఇదే అంశంపై సామాజికకార్యకర్త హైకోర్టులో పిల్‌వేసినట్లు యార్లగడ్డ వివరించారు. గన్నవరం విమానాశ్రయ విస్తరణ కోసం భూములు ఇచ్చిన నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. గన్నవరం నియోజకవర్గం నిడమానూరు గ్రామంలోని శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన 12.42ఎకరాల భూమి గత 20ఎళ్ళుగా ఇతరుల ఆధీనంలో ఉందని, తక్షణమే అన్యాక్రాంతం అయిన భూమిని స్వాధీనం చేసుకోవాలని దేవాదాయశాఖా మంత్రికి యార్లగడ్డ విజ్ఞప్తి చేసారు. పాతపాడులోని చెన్నకేశ్వరస్వామి ఆలయానికి చెందిన భూమిని బైపాస్ రోడ్డునిర్మాణం కోసం సేకరించి పరిహారం రూ. 38.98లక్షలు మంజురు చేయగా, ఆనిధులు జతీయరహదారులసంస్థ, కలెక్టర్ ల్యాండ్ ఎక్విజేషన్‌ఖాతాలో ఉన్నాయని వాటిని దేవాదాయశాఖలోకి మళ్ళించి వీటితో ఆలయ పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని యార్లగడ్డ శాసనసభలో విజ్ఞప్తి చేసారు.


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంక ట్రావ్

# రూ.11,285 కోట్లతో 51.56 లక్షల కాపులకు లబ్ధి

**విజయవాడ.ఆగస్టు 20,ప్రభాతవార్తప్రతినిధి:** కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్ల కాలంలో కాపు కార్పొరేషన్ ద్వారా వివిధ పథకాల ద్వారా రూ.11,285.72 కోట్లతో 51,56,172 లక్షల మందికి లబ్ధి చేకూర్చినట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. వర్షాకాల అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా గురువారం శాసనమండలిలో కాపు కార్పొరేషన్ ద్వారా కాపు సామాజిక వర్గీయులకు కూటమి ప్రభుత్వం ఎంతమేర నిధులు కేటాయించారు.. ఎంతమంది లబ్దిదారులకు ప్రయోజనం కల్పించారన్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తుల ప్రశ్నపై మంత్రి పైవిధంగా సమాధానమిచ్చారు. కాపు కార్పొరేషన్ కు చైర్మన్ ను నియమించామన్నారు. కాపుల అభివృద్దికి కాపు కార్పొరేషన్ కు ఏటా నిధులు కేటాస్తున్నామన్నారు. కాపుల అభివృద్ధికి కాపు కార్పొరేషన్ ద్వారా వెచ్చించిన వివరాలను బడ్జెట్ల వారీగా వివరించారు. 2024-25లో రూ.4,646.99 కోట్లుకేటాయించగా రూ.4.440.25 కోట్లు వెచ్చించి 9,55,144 మంది లబ్దిదారులకు ప్రయోజనం చేకూర్చామన్నారు. 2025- 26లో రూ.4,924.28 కోట్లు కేటాయించగా, రూ.4,360.28 కోట్లతో 20,63,907 మందికి లబ్ధి చేకూర్చామన్నారు. 202627లో రూ.5,012.10 కోట్లుకేటాయించగా, నేటి వరకూ రూ.2,485.19 కోట్లతో 21,37,121 మంది కాపులకు ప్రయోజనం చేకూర్చామని మంత్రి సవిత సవిత తెలిపారు.



# కాంట్రాక్టు ఉద్యోగుల (సవరణ) బిల్లు, ఆమోదించిన శాసన సభ.

- బిల్లును సభలో ప్రవేశపెట్టిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

**విజయవాడ,ఆగస్టు 20,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసుల క్రమబద్ధీకరణ (సవరణ) బిల్లు, 2026ను రాష్ట్ర శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టగా, శాసనసభ సభ్యులు అందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణ చట్టం-2023 పరిధిలో సెకండరీ హెల్త్ డైరెక్టరేట్‌ను చేర్చేందుకు ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణ (సవరణ) బిల్లు-2026ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. చట్టపరమైన కాలక్రమ వ్యత్యాసం కారణంగా ఈ డైరెక్టరేట్‌లో పనిచేస్తున్న సుమారు 157 మంది అర్హతగల కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణకు అవకాశం లేకుండా పోయింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు చట్టం అనుసూచిని సవరించే బిల్లుకు శాసన సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

# పేద విద్యార్థులకు ఐఐటీ, నీట్ ఎక్సలెన్సీ సెంటర్..

మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి..

**విజయవాడ, ఆగష్టు 20, ప్రభాతవార్తప్రతినిధి:** ఐఐటీ, నీట్ ఎక్సలెన్సీ సెంటర్లో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతోపాటు, అత్యాధునిక సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతి సచివాలయంలో గుంటూరు జిల్లా తాడికొండలోని ఐఐటి నీట్ ఎక్సలెన్సీ సెంటర్ లో అదనపు భవనాల నిర్మాణం, విద్యార్థులకు సౌకర్యాల కల్పనపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఐటీ, నీట్ క్యాంపస్ నిర్మాణ నమూనాను మంత్రి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ... క్యాంపస్ లో అదనపు భవనాల నిర్మాణం, అంతర్గత రోడ్లతోపాటు వాకింగ్ ట్రాక్,బ్యాడ్మింటన్ కోర్టు, కోకో కోర్టు, మల్టీపర్పస్ కోర్టు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు ప్రశాంతమైన వాతావరణం ఉండేలా నిర్మాణాలు, ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు. పేద విద్యార్థులు సమాజంలో ఉన్నత స్థాయిలో ఉండాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్ష అని మంత్రి తెలిపారు.

# పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుకు ఆమోదం

**విజయవాడ,ఆగస్టు 20,ప్రభాతవార్తప్రతినిధి:** పంచాయతీ రాజ్ వ్యవస్థలో రెండో వైస్ ప్రెసిడెంట్, వైస్ చైర్‌పర్సన్ పదవులను తొలగించేందుకు ప్రతిపాదించబడిన ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ (రెండో సవరణ) బిల్లు2026 ను రాష్ట్ర శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తరఫున రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టగా, శాసనసభ సభ్యులు అందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.ఈ సందర్బంగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం, 1994లో చేసిన 2021 నాటి సవరణల ద్వారా మండల ప్రజా పరిషత్‌లలో రెండో వైస్ ప్రెసిడెంట్, జిల్లా ప్రజా పరిషత్‌లలో రెండో వైస్ చైర్‌పర్సన్ పదవులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ విధానం వల్ల ఆశించిన పరిపాలనా ప్రయోజనం చేకూరలేదని ప్రభుత్వం సమీక్షలో గుర్తించడం జరిగిందన్నారు.బహుళ నాయకత్వం కారణంగా స్థానిక పరిపాలనలో స్పష్టత తగ్గడంతో పాటు, పరిపాలనా సామర్థ్యాన్ని పెంచడంలో రెండో వైస్ ప్రెసిడెంట్, రెండో వైస్ చైర్‌పర్సన్ పదవుల వల్ల అదనంగా ఎటు వంటి ప్రయోజనం ఒనగూరడం లేదనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించిదన్నారు. ఈ నేపథ్యంలో ఈ రెండు పదవులను తొలగించి, గతంలో అమలులో ఉన్న విధానాన్ని పునరుద్ధరించాలని నిర్ణయించడం జరిగిందని మంత్రి తెలిపారు. దీని ప్రకారం ప్రతి మండల ప్రజా పరిషత్‌కు ఒక వైస్ ప్రెసిడెంట్, ప్రతి జిల్లా ప్రజా పరిషత్‌కు ఒక వైస్ చైర్‌పర్సన్ మాత్రమే ఉండేలా ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టంలో అవసరమైన సవరణలు చేయడానికి ప్రభుత్వ బిల్లును సభలో ప్రమేశపెట్టడం జరిగిందన్నారు. ఈ సవరణ ద్వారా స్థానిక సంస్థల్లో స్పష్టమైన నాయకత్వం, సమర్థవంతమైన పరిపాలన, బాధ్యతల విభజన మరింత మెరుగుపడటంతో పాటు, మండల మరియు జిల్లా ప్రజా పరిషత్‌ల పరిపాలనలో సరళత, సమన్వయం పెంపొందించేందుకు మార్గం సుగమం కానుందని మంత్రి తెలిపారు...ఉప ముఖ్యమంత్రి శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ తరఫున రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ ప్రభుత్వ బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టగా, సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు

# పోరాట స్ఫూర్తిని కొనసాగించేలా స్థానిక ఎన్నికల్లో పోటీ

**విజయవాడ,ఆగస్టు 20,ప్రభాతవార్తప్రతినిధి:** త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం సిద్ధంగా ఉండాలని జనసేన శ్రేణులకు పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. అమరావతిలో పవన్ కళ్యాణ్ అధ్యక్షతన జరిగిన శాసనసభాపక్ష సమావేశంలో ఎన్నికల వ్యూహంపై కీలక చర్చ జరిగింది. శాసనసభ ఎన్నికల సమయంలో పొత్తు ధర్మాన్ని పాటిస్తూ.. పార్టీ కోసం నిలబడిన జనసేన కార్యకర్తల ఆత్మగౌరవాన్ని కాపాడే విధంగా స్థానిక ఎన్నికల్లో బరిలోకి దిగాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. కార్యకర్తల అభిప్రాయాలు, మనోభావాలను గౌరవించేలా ఎన్నికలకు సిద్ధం కావాలని నేతలు భావించారు. రాష్ట్రంలోని 21 జనసేన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితిపై పవన్ కళ్యాణ్ ఆరా తీశారు. అలాగే ఆయా నియోజకవర్గాలతో పాటు పార్టీకి బలమున్న ఇతర ప్రాంతాలను గుర్తించి స్థానిక ఎన్నికలకు వ్యూహం సిద్ధం చేయాలని నేతలు నిర్ణయించారు. సమావేశం వివరాలను పవన్ కళ్యాణ్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలపై లోతుగా చర్చించినట్లు పవన్ తెలిపారు. జన సైనికుల పోరాట స్ఫూర్తిని కొనసాగించేలా ఎన్నికల్లో పోటీ చేస్తామన్నారు. జనసేన పార్టీ ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తుందనే అంశంపై చర్చలు జరుగుతున్న తరుణంలో కార్యకర్తల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా ముందుకు వెళ్తామని పవన్ ప్రకటించారు. సాధారణ ఎన్నికల్లో కూటమి విజయం కోసం జనసేన పార్టీ 21 ఎమ్మెల్యే, రెండు ఎంపీ సీట్లతో సరిపెట్టుకుంది. ఇప్పుడు ఎక్కువ సీట్లలో పోటీ చేయాలని పార్టీ శ్రేణులు భావిస్తున్న తరుణంలో పవన్ కళ్యాణ్ ప్రకటన వారిలో ఉత్సాహాన్ని నింపింది.మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నికలు నిర్వహించడం మంచిదేనని సమావేశంలో ఎమ్మెల్యేలు అభిప్రాయపడ్డారు. నియోజకవర్గాల్లో పార్టీ బలాబలాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని పవన్ కళ్యాణ్ సూచించారు. కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లకు సంబంధించి నియోజకవర్గాల్లో ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తులపై కూడా సమావేశంలో చర్చించారు. కార్యకర్తలు చెబుతున్న సమస్యలను ఎమ్మెల్యేలు స్వయంగా విని.. వాటి పరిష్కారానికి కృషి చేయాలని పవన్ సూచించారు. జనసేన యంత్రాంగం స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిస్తూ.. పొత్తుల అంశాన్ని తాను చూసుకుంటానని స్పష్టం చేశారు. ఎవరూ పార్టీ లైన్ దాటి మాట్లాడవద్దని నేతలకు.. కార్యకర్తలకు పవన్ కళ్యాణ్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. పొత్తు ధర్మాన్ని పాటిస్తూనే కార్యకర్తల మనోభావాలకు ప్రాధాన్యం ఇచ్చేలా స్థానిక ఎన్నికల్లో పార్టీ బలాన్ని చూపించాలని జనసేన భావిస్తోంది.పవన్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి మంత్రులు మనోహర్, దుర్గేశ్‌తో పాటు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు.



# స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 34 శాతం రిజర్వేషన్ల అమలు చరిత్రాత్మక నిర్ణయం

- బీసీలను దగా చేసింది వైసిపి
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం వెల్లడి

**తిరుపతి హెల్త్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అమలు చరిత్రాత్మక నిర్ణయమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రివర్గం సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలలో 34 శాతం రిజర్వేషన్లు అమలకు నిర్ణయం తీసుకున్న సందర్భంగా తిరుపతి చంద్రశేఖర్ రెడ్డి కాలనీలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో 1986లో అప్పటి ముఖ్యమంత్రి గౌరవ ఎన్టీ రామారావు స్థానిక సంస్థ ఎన్నికల్లో బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం జరిగిందని అన్నారు. ఆ తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 34 శాతానికి పెంచారని చెప్పారు. 2020లో స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్లను వైయస్ జగన్మోహన్ రెడ్డి 34 నుంచి 24 శాతానికి తగ్గించారని తెలిపారు. ఇందువల్ల 16,800 మంది బీసీలు స్థానిక సంస్థల ఎన్నికలకు దూరమై తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. 2024 ఎన్నికల మేనిఫెస్టోలో తెలుగుదేశం పార్టీ స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని హామీ ఇచ్చి దానికి కట్టుబడి ఇప్పుడు అమలు చేయడం జరిగిందన్నారు. తాజాగా గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక సంస్థ లలో 34 శాతం పట్టణ ప్రాంతాల్లో 33.3 శాతం రిజర్వేషన్ల అమలు చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఇది ఒక చరిత్రాత్మక నిర్ణయం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో బీసీ సబ్ ప్లాన్ అమలు, కార్పొరేషన్ల వ్యవస్థ తొలిసారిగా అమలు చేయడం జరిగిందని వివరించారు. కూటమి ప్రభుత్వం బీసీల సామాజిక న్యాయానికి, వెనుకబడిన వర్గాల గౌరవం కోసమే టిడిపి పుట్టిందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి సుమారు 2730 కోట్లు ఉపాధి హామీ నిధులు విడుదల చేయకుండా అడ్డుకున్నారని ఇందువల్ల నష్టపోయింది బీసీ నేతలేనని చెప్పారు. చివరికి ఆదరణ పథకాన్ని నిర్వీర్యం చేసి బీసీలకు ఉపాధి హామీ అవకాశాలు లేకుండా చేశారన్నారు. స్టడీ సర్కిల్స్, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్, విదేశీ విద్యాధరణ, స్కిల్ డెవలప్మెంట్ వంటి పథకాలను రద్దుచేసి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బీసీలను తీవ్రంగా దెబ్బతీశారన్నారు. ఈ కార్యక్రమంలో కె. సుధాకర్, అక్కినపల్లి లక్ష్మయ్య, గాండ్ల జగన్నాథం, ఆముదాల తులసీదాస్, వడ్డెర శ్రీరాములు, దేవల్ల శ్రీనివాసులు, రాఘవులు యాదవ్, టి మోహన్ రమణయ్య, ఎల్లయ్య, అంజి, సిద్దయ్య, వి. వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అసెంబ్లీ సమావేశాలు

లేని రోజుల్లోనూ సందర్శించే అవకాశం

**విజయవాడ,ఆగస్టు 20,ప్రభాతవార్తప్రతినిధి:** సమావేశాలు లేని రోజుల్లోనూ విద్యార్థులకు అసెంబ్లీ ప్రాంగణం సందర్శించే అవకాశం కల్పిస్తామని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. భావి భారత పౌరులకు చట్టసభల పనితీరు, ప్రజాస్వామ్య వ్యవస్థ విశిష్టతను చేరువ చేసేందుకే 'అసెంబ్లీ విజ్ఞాన యాత్ర'కు శ్రీకారం చుట్టామని వెల్లడించారు. అసెంబ్లీ సమావేశాల చివరి రోజు 741 మంది విద్యార్థులు గ్యాలరీ నుంచి అసెంబ్లీ సమావేశాలను ప్రత్యక్షంగా వీక్షించగా, గత నాలుగు రోజుల్లో 23 విద్యాసంస్థలకు చెందిన 2,716 మంది విద్యార్థులు శాసనసభను సందర్శించారు. 'స్లేట్ స్కూల్'కు చెందిన 180 మంది విద్యార్థులతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆప్యాయంగా ముచ్చటిస్తూ అసెంబ్లీ వ్యవహారాలు, బిల్లుల రూపకల్పనపై వారి సందేహాలను నివృత్తి చేశారు.

# కావలిలో పలు కేసులపై సమీక్ష నిర్వహించిన ఐజి

**కావలి, (నెల్లూరు) ఆగష్టు20ప్రభాతవార్త :** కావలి సబ్ డివిజన్‌లోని పలు కేసులపై స్థానిక కమాండ్ కంట్రోల్ రూమ్ నందు గుంటూరు రేంజ్ ఐజి సర్వే శ్రేష్ట త్రిపాఠి కావలి డివిజన్ పోలీస్ అధికారులతో గురువారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు డివిజన్ పరిధిలోని ముఖ్యమైన కేసుల గురించి సమీక్ష నిర్వహించడం జరిగిందన్నారు. అందులో భాగంగా కొన్ని పోలీస్ స్టేషన్‌లను కూడా తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు ఏమేమి కేసులు ఉన్నాయి వాటి గురించి వివరాలు తెలుసుకోవడం జరిగిందన్నారు. ఓవరాల్‌గా లాండ్ ఆర్డర్ పరిస్థితి బాగుందన్నారు. నెల్లూరు జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల పనితీరు బాగుందన్నారు. పబ్లిక్‌కు సహకారం అందించే విధంగా పోలీసుల పనితీరు ఉండాలన్నారు. కావలి డివిజన్ పోలీసుల పనితీరు కూడా బాగుందన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా ఏఎస్పి సిహెచ్. సౌజన్య, కావలి డిఎస్పి వివి.రమణ కుమార్, కావలి డివిజన్లోని సిఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పంటల బీమా విషయంలో రైతులు త్వరపడాలి

- బీమా నమోదుకు ఈ నెలాఖరు వరకే గడువు
- ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రతి రైతు బీమా రక్షణ పొందాలి
- రైతు చెల్లించాల్సిన ప్రీమియం వాటా స్వల్పమే
- ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో రైతులకు అవగాహన కల్పించాలి
- అసెంబ్లీ వేదికగా రైతులకు మంత్రి అచ్చెన్నాయుడు పిలుపు

**విజయవాడ, ఆగస్టు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం, అనిశ్చిత వర్షపాతం పరిస్థితులు తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు పంటల బీమా విషయంలో అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. పంటల బీమా నమోదు చేసుకునేందుకు ఈ నెలాఖరు వరకే గడువు ఉన్నందున రైతులు ఆలస్యం చేయకుండా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని శాసనసభ వేదికగా పిలుపునిచ్చారు. వాతావరణ పరిస్థితులు ఎప్పుడు ఎలా మారతాయో అంచనా వేయలేమని, ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావం వంటి పరిస్థితుల్లో రైతుకు ఆర్థిక రక్షణ కల్పించడంలో పంటల బీమా అత్యంత కీలకమని మంత్రి పేర్కొన్నారు. రైతులు చివరి తేదీ వరకు వేచి చూడకుండా ముందుగానే నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని కోరారు.రైతుపై ప్రీమియం భారం చాలా స్వల్పమే..పంటల బీమా కోసం రైతులు చెల్లించాల్సిన ప్రీమియం వాటా చాలా తక్కువగా ఉంటుందని అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రాంతం, పంటను బట్టి రైతు వాటా మారుతుందని, కొన్ని ప్రాంతాల్లో రైతు చెల్లించాల్సిన మొత్తం అత్యంత స్వల్పంగా ఉందన్నారు. మిగిలిన ప్రీమియం భారాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తున్నాయని వివరించారు. స్వల్ప మొత్తాన్ని చెల్లించడం ద్వారా పంట నష్టం సంభవించినప్పుడు బీమా రక్షణ పొందే అవకాశం ఉన్నందున రైతులు దీనిని నిరక్ష ్యం చేయవద్దని సూచించారు. మ్మెల్యేలు ప్రత్యేక చొరవ తీసుకోవాలి..పంటల బీమా నమోదును కేవలం వ్యవసాయ ప్రతి ఎమ్మెల్యే తన నియోజకవర్గంలో రైతులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, పంటల బీమా వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బందితో సమన్వయం చేసుకుని అర్హులైన రైతులందరూ బీమా నమోదు చేసుకునేలా ఎమ్మెల్యేలు చొరవ చూపాలని కోరారు. ఎల్‌నినో ప్రభావం ఉన్న నేపథ్యంలో రైతులు పంటల బీమాను తేలికగా తీసుకోవద్దు. ఈ నెలాఖరు వరకే అవకాశం ఉంది. చివరి రోజు వరకు వేచి చూడకుండా ప్రతి రైతు వెంటనే నమోదు చేసుకోవాలి. స్వల్ప ప్రీమియంతో లభించే బీమా రక్షణను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలి అని మంత్రి అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు.



## 2023లో తనపల్లిలో ఏం జరిగింది?

# చెట్లను కొట్టేశారెందుకు!?

● వైసిపి నేత భూమనను ప్రశ్నించిన పోలీసులు

**తిరుపతి, ఆగస్టు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి ఎమ్మెల్యేగా, టిటిడి ఛైర్మన్‌గా 2023లో కొనసాగిన భూమన కరుణాకర్‌రెడ్డి తిరుపతి రూరల్ తనపల్లిలో 7.91 ఎకరాల అప్పూప్ లేబెట్‌లోకి దౌర్జన్యంగా ప్రవేశించారని, అక్కడ ఉన్న పలురకాల చెట్లను కొట్టివేశారని వెంకటేశ్వరప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదుపై భూమనపై నమోదైన భూకబ్జా కేసులో పోలీసు నోటీసులతో గురువారం కరుణాకర్‌రెడ్డి తిరుచానూరు పోలీసు స్టేషన్‌కు హాజరయ్యారు. అక్కడ ఆయనను తిరుపతి చంద్రగిరి డిఎస్పీ ప్రసాద్, తిరుచానూరు సిఐ సునీల్‌కుమార్ బాధితుడి ఫిర్యాదుపై పలు ఆధారాలతో భూమనను పలు ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబట్టినట్లు తెలిసింది. కరుణాకర్‌రెడ్డి కుమారుడు అభినయ్‌రెడ్డి పోలీసుల ఎదుట హాజరై పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారని తెలుస్తోంది. న్యాయవాదితో కలసి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. తనపల్లిలో అప్పూప్ లేబెట్‌లో మామిడి, టేకు, జామ, నేరేడు చెట్లను కొట్టివేశారని, ఆ భూమిలో భూమన కుటుంబానికి చెందిన మామిడి తోటకు రోడ్డువేసేందుకు యత్నించారని, అక్కడున్న తన మనుషులను బెదిరించారని ఫిర్యాదులో కూడా ఆరా తీశారు. "హైకోర్టు ఆదేశాలతో భూమనను పోలీసులు ఆధారాలతో విచారణ చేయడం విశేషం. తిరుచానూరు పోలీస్ స్టేషన్‌లో అధికారులు ఆయన్ను ప్రశ్నించారు.

అయితే ఈ కేసు నమోదు ప్రక్రియపై భూమన కరుణాకర్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ఇది పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు చర్య అని ఆరోపించారు. తొలుత ఎఫ్ఐఆర్‌లో ఫిర్యాదుదారుగా జిల్లా కలెక్టర్ పేరును నమోదు చేసి, ఆ తర్వాత అదే క్రైమ్ నంబర్‌పై ప్రైవేట్ వ్యక్తి పేరును చేర్చారని, అధికారిక రికార్డులను తారుమారు చేశారని ఆరోపించారు.

భూమన ఆరోపణలను తిరుపతి ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు తోసిపుచ్చారు. రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారన్న ప్రచారంలో వాస్తవం లేదని, కేవలం ఒకే ఎఫ్ఐఆర్ నమోదైందని స్పష్టం చేశారు. భూ కబ్జాలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదిక ఆధారంగా క్రిమినల్ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తమకు లేఖ రాశారని తెలిపారు. ఆ లేఖ ఆధారంగా, సిఐ ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేశారని వివరించారు.

## సాంకేతిక విప్లవానికి ఆద్యుడు రాజీవ్ గాంధీ

**తిరుపతి, ఆగస్టు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశంలో ఆధునికతను, సాంకేతిక విప్లవానికి ఆద్యుడని తిరుపతి అర్బన్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొడ్డేటి విట్టిబాబు కొనియాడారు. నేడు ప్రపంచంలోనే ఆధునిక సాంకేతిక విప్లవంతో భారత్ వేగంగా అభివృద్ధి చెందడానికి ఆనాడు రాజీవ్ గాంధీ వేసిన పునాదులే కారణమని వివరించారు. భారతదేశంలో కంప్యూటర్లు, సమాచార సాంకేతికత రంగాల అభివృద్ధికి ఆయనే పునాది వేయడం జరిగిందని, విదేశాల నుండి కంప్యూటర్ల దిగుమతిపై పన్నులను తగ్గించారని అన్నారు. ఈ కారణంగానే దేశంలో కంప్యూటర్లు, సెల్ ఫోన్లు ప్రతి ఒక్కరి వద్ద అందుబాటులో ఉన్నాయని తెలిపారు. భారత మాజీ ప్రధాని భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ తిరుపతి నగర అర్బన్ జిల్లా అధ్యక్షులు గొడ్డేటి విట్టిబాబు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. తిరుపతి పాత మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం కేక్ కట్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. రాహుల్ గాంధీ అదే స్ఫూర్తితో దేశ అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని వివరించారు. ఆయన నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ బలపడుతోందని 2029 ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాంగాటి గోపాల్ రెడ్డి, పిసిసి కార్యదర్శి తమటం వెంకట నరసింహులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిత్తూరు శివకరర్, పిసిసి మాజీ కార్యదర్శి సుబ్రహ్మ, పార్టీ సీనియర్ నాయకులు వెంకటరామయ్య, శివబాలాజీ, గౌతమ్, దుర్గాని రెడ్డెప్ప, పార్థసారథి రెడ్డి, తవన్ కళ్యాణ్, ముసినాబేగం తదితరులు పాల్గొన్నారు.



## గంజాయిపై డ్రోన్లు, స్నిఫ్ఫర్ డాగ్స్‌తో నిఘా

**శ్రీకాకుళం, ఆగస్టు 20 ప్రభాతవార్త:** గంజాయి విక్రయాలు, అక్రమ రవాణాను సమర్థంగా అరికట్టేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డ్రోన్లు, స్నిఫ్ఫర్ డాగ్స్ ద్వారా విస్తృత తనిఖీలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన నార్కో కోఆర్డినేషన్ సెంటర్ జిల్లా స్థాయి కమిటీ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గంజాయి సాగు, నిల్వల గుర్తింపునకు జూన్, జులై నెలల్లో 320 ప్రదేశాల్లో డ్రోన్ సర్వేలు, 53 ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించామని వివరించారు. సరిహద్దు చెక్ పోస్టులైన పురుషోత్తపురం, పాతపట్నం, గొప్పిలి, పైడిభీమవరం వద్ద వేలాది వాహనాలను తనిఖీ చేసి, పురుషోత్తపురం చెక్ పోస్ట్ వద్ద 1,127 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అంతర్రాష్ట్ర ముఠాల నెట్‌వర్క్‌ను ఛేదించడంలో భాగంగా ఫార్వర్డ్ లింక్స్ ద్వారా 28 మందిని, బ్యాక్‌వర్డ్ లింక్స్ ద్వారా 47మంది నిందితులను గుర్తించి వివిధ రాష్ట్రాల సరిహద్దుల్లో నిఘా పెంచామని వివరించారు. నేరాలకు పాల్పడే 329 మందిపై సస్పెక్ట్ షీట్లు తెరిచామని, పిట్ ఎన్‌డిపిఎస్ కింద కఠిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. బడి ఈడు పిల్లలు, యువత మత్తు పదార్థాల బారిన పడకుండా పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించిన 'సంకల్పం' సదస్సుల ద్వారా జూన్, జులై నెలల్లో ఏకంగా 7 లక్షలకు పైగా విద్యార్థులు, వేలాది మంది ప్రజలకు అవగాహన కల్పించామని కలెక్టర్ పేర్కొన్నారు. శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలోని డీఅడిక్షన్ సెంటర్‌లో ఫాళీగా ఉన్న 11 పోస్టుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేసి, బాధితులకు మెరుగైన కౌన్సెలింగ్, వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు కలిగించే ఎన్‌ఆర్‌ఎక్స్ ఔషధాలు విక్రయించే మెడికల్ షాపులపై నిర్వహించిన 18 తనిఖీ ఫలితంగా విక్రయాలు 10 శాతం తగ్గాయని, నిబంధనలు ఉల్లంఘిస్తే షాపుల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. రైల్వే స్టేషన్లలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ దళాలతో కలిసి సంయుక్త తనిఖీలు నిర్వహించి రవాణాను అరికట్టాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఈగల్ అదనపు ఎస్పీ మక్కా శ్రీనివాసరావు, డిఎస్పీలు వివేకానంద, లక్ష్మణరావు, భవాని, ఆర్టీవో గంగాధర్, పోలీస్, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నిరాహారదీక్ష.. 22 మంది వైసిపి శ్రేణులపై కేసు

**తిరుపతి, ఆగస్టు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రశాంత తిరుపతి నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల విధులకు ఆటంకం కలగకుండా జిల్లా పోలీసులు 30 పోలీస్ యాక్ట్ అమలుచేస్తున్నారు. ఇదే సమయంలో బుధవారం తిరుపతిలో నిత్యంరద్దీగా ఉండే నాలుకాళ్ళ మండపం వద్ద వైసిపి నేత వాసు యాదవ్‌పై అక్రమ కేసు బనాయించారంటూ ఆతని తల్లి రేణుక నిరాహారదీక్షకు దిగారు. అక్కడ ఆమెకు మద్దతుగా వైసిపి శ్రేణులు దీక్షలో కూర్చున్నారు. అయితే శాంతియుతంగా భగవద్గీత చేతిలో పెట్టుకుని ఆమె నిరాహారదీక్ష చేయడంతో, ధర్నాకు అనుమతి లేదని 30 పోలీస్ యాక్ట్ ఉందంటూ పోలీసులు రంగప్రవేశం చేశారు. అనుమతి లేకుండా దీక్ష కొనసాగించడం తగదని ఆమెను అదుపులోకి తీసుకుని తదుపరి తిరుపతి తూర్పు పోలీసులు అరెస్ట్ చేశారు. ఇంకా ఈ ఘటనలో వాసు యాదవ్ తల్లి వై.రేణుక, మాజీ మేయర్ డాక్టర్ ఆర్.శిరీషతో బాటు పార్టీ శ్రేణులు జి.విజయలక్ష్మి, ఎం.ఉమా యాదవ్, బి.గీతా యాదవ్, టి. ప్రియాంక, కె.రాజమ్మ, వి. కృష్ణవేణమ్మ, ఇ. సుశీల, ఎం. మునెమ్మ, సి. పుష్పలత, ఎన్. మమత, ఇంకా వైసిపి నేతలు తలసి యాదవ్, సురేష్, మురళీకృష్ణ, శరత్ యాదవ్, గురవయ్య, కృష్ణ యాదవ్, గురవయ్య, అరుణ యాదవ్, నీరజా రెడ్డిపై తిరుపతి పోలీసులు కేసు నమోదు చేశారు.

## గ్రూప్-1 నియామకాలపై మేం సిద్ధం... డిఎస్సీపై సిబిఐ విచారణకు

# చంద్రబాబు సిద్ధమా?

## వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సవాల్

**విజయవాడ, ఆగస్టు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** డిఎస్సీ అక్రమాల నుంచి తన కుమారుడు లోకేష్‌ను కాపాడుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఎపిపిఎస్సీ గ్రూప్-1 పోస్టుల భర్తీపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని వైపిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్ విమర్శించారు. ఎపిపిఎస్సీ గ్రూప్-1 పోస్టుల భర్తీపై సిబిఐ విచారణకు తాము సిద్ధమని అన్నారు. డిఎస్సీపై సిబిఐ విచారణకు చంద్రబాబు సిద్ధమా అంటూ సవాల్ చేశారు. డిఎస్సీపై సిబిఐతో విచారణ చేయించాలని ఇప్పటికే కేంద్రాన్ని కోరామన్నారు. ఎపిపిఎస్సీ గ్రూప్-1 ద్వారా ఉద్యోగాల్లో చేరిన వారి జీవితాలను నాశనం చేయాలని చంద్రబాబు టార్గెట్ చేశారని ధ్వజమెత్తారు. వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ డిఎస్సీ స్కామ్‌తో పాటు, రాష్ట్ర ప్రభుత్వం కేవలం డైవర్షన్ కోసం గ్రూప్-1 పరీక్షపై రాద్ధాంతం చేస్తుందన్నారు. డిఎస్సీలో జరిగిన తప్పులు గ్రూప్-1 ఉద్యోగాల భర్తీ విషయంలో జరగలేదన్నారు. 2019 ఎన్నికలకు ముందు అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ఎన్నికలకు ముందు హడావిడిగా ఈ గ్రూప్-1 నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాకముందే 2019 మే 26 ప్రిలిమ్స్ ఎగ్జామ్స్ కూడా అయిపోయాయని, తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రిలిమ్స్ ఫలితాలు ప్రకటించి, 2020లో డిసెంబర్ 14 నుంచి 20 మధ్య మెయిన్స్ నిర్వహించిందన్నారు. ఆ సమయంలో ఎంపికైన వారికి రాజకీయ రంగు పులుముతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కోవిడ్ కారణంగా ఫలితాలు ఆలస్యం కాకూడదని ఎపిపిఎస్సీ కమిషన్ డిజిటల్ మూల్యాంకనానికి వెళ్లాలని నిర్ణయించిందన్నారు. ఈ కమిషన్‌లో చంద్రబాబు ప్రభుత్వంలో నియమించినవారు కూడా సభ్యులుగా ఉన్నారని జగన్ చెప్పుకొచ్చారు. ఈ డిజిటల్ మూల్యాంకనంపై కొంతమంది హైకోర్టును ఆశ్రయించారని, హైకోర్టు సైతం స్పష్టంగా ఈ డిజిటల్ మూల్యాంకనాన్ని తప్పుబట్టలేమని చెప్పిందని, మాన్యువల్ మూల్యాంకనం చేసి ఆ మార్కుల ఆధారంగానే అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి 163మందికి పోస్టులు ఇచ్చామన్నారు. ఈ ప్రక్రియ మొత్తం హైకోర్టు ఆదేశాలతోనే జరిగిందన్నారు. ఈ ఉద్యోగాలకు ఎంపికైన వారు నాలుగేళ్లుగా ఉద్యోగాలు చేస్తుంటే చంద్రబాబు వారిపై విషం కక్కుతున్నారని జగన్ విమర్శించారు.



**పరీక్ష రాయకుండానే ఉద్యోగాలు:** 'డిఎస్సీ పరీక్ష రాయకుండానే ఉద్యోగాలు ఇవ్వడం రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ జరగలేదు. బహుశా దేశంలో కూడా జరిగి ఉండదు. అసలు పరీక్ష రాయకుండానే, స్పోర్ట్స్ కోటా కింద తమకు కావాల్సిన వారికి ఉద్యోగాలు ఇచ్చుకున్నారు. దీని కోసం జిఒలు జారీ చేసినట్లు తండ్రీ కొడుకులు ఇద్దరూ అసెంబ్లీలో ఒప్పుకున్నారు. ఇంకా దాన్ని సమర్థించుకుంటూ స్పోర్ట్స్ పర్సన్స్‌కు పరీక్ష పెట్టాల్సిన అవసరం లేదు, పివి సింధుకు నేరుగా ఉద్యోగం ఇచ్చారని, అలాగే ఇక్కడా ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. అలా ఏకంగా 372 ఉద్యోగాలు ఇచ్చామంటూ, దానికి దీనికి పొంతన పెట్టారు. పివి సింధు పేరు చెప్పి 372 ఉద్యోగాలను ఇచ్చార్లు అని జగన్ ఆరోపించారు. ఆ 372 మంది టీచర్లు పిల్లలకు ఎలా పాఠాలు చెబుతారు? అని ప్రశ్నించారు. ఇన్ని అక్రమాలు జరిగాయి కాబట్టే, తాము సిబిఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నామని వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్ పునరుద్ఘాటించారు.

# 'నడిచే విజ్ఞాన సరస్వతి మాలతీచందుర్'


**తిరుపతి, ఆగస్టు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** నలభై యేళ్ళ కిందట సామాజిక దృష్టితో పాఠకులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలందించిన డాక్టర్ మాలతీ చందుర్ ఆనాటి గూగులమ్మ అని పలువురు వక్తలు కొనియాడారు. ఈరోజు గూగుల్ అందిస్తున్న ఎన్నో విషయాలను అనాడే తన రచనల ద్వారా అందించిన గూగులమ్మగా, నడిచే విజ్ఞాన సరస్వతిగా ఆమెను పేర్కొన్నారు. తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖలో డాక్టర్ మాలతీ చందూర్ స్మారక ధర్మనిధి సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి తెలుగు శాఖ అధ్యక్షురాలు, కుప్పం ద్రావిడ విశ్వవిద్యాలయం ఆచార్య కొలకలూరి మధుజ్యోతి మాట్లాడుతూ మాలతి చందూర్ రచనలు సమున్నతమైన దృష్టితో రాశారన్నారు. తాను ఎంతో ముందుచుపుతో ప్రపంచ భాషలు నేర్చుకొని విశ్వసాహిత్యాన్ని పరిచయం చేసిన మహోన్నత మేధోజనిత వ్యక్తిగా ఆవిడను కొనియాడారు. ఆమెవి సామాజిక వాస్తవికతను, చారిత్రక స్పష్టతను ఇచ్చిన రచనలన్నారు. మాలతీ చందూర్ తన రచనల ద్వారా అందించిన వెలుగు సాహిత్య భవిష్యత్తు నిర్ణయిస్తుందన్నారు.



ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం డీన్ ఎస్.ఎస్.ఎస్. హెచ్ఎం ఆచార్య పి.విజయలక్ష్మి మాట్లాడుతూ మాలతీ చందూర్ 1980లోనే ఈరోజు మనం చెబుతున్న మానసిక శారీరక అంశాలను ఎన్నింటి నో తన ప్రశ్నలు జవాబుల ద్వారా అందించే వారని, అవి ఇప్పటికీ విలువైనవని కొనియాడారు. కుటుంబ విలువలను నిలుపుకోవాల్సిన అవస రాన్ని మాలతీ చందూర్ తన రచనల ద్వారా తెలియజేశారన్నారు. ఈ కార్యక్రమ సంచాలకు రాలు డాక్టర్ డి.యువశ్రీ మాట్లాడుతూ మాలతీ చందూర్ స్మారక ధర్మనిధి సదస్సు నిర్వహించుకో వడానికి ఆర్థిక సహాయమందజేసిన వారికి కృతజ్ఞ తలు తెలియజేశారు. మాలతీ చందూర్ జగమె రిగిన రచయిత అని, ఆమె ప్రతి రచన ప్రత్యేకమై నది అన్నారు. ప్రమదావనం శీర్షికను నడిపిన మొదటి మహిళగా కొనియాడారు. మన్నవ గంగాధర్ ప్రసాద్, ఆచార్య జె.నీరజ, వివిధ కళాశాలలు, విభాగాల ఆచార్యులు, విద్యార్థులు సాహితీ

# సమష్టిగా శ్రీవారి బహ్మోత్సవాలు విజయవంతం చేద్దాం

● సెప్టెంబర్ 15నుండి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు ● అక్టోబర్ 11నుండి నవరాత్రి బ్రహ్మోత్సవాలు ● సెప్టెంబర్ 15న తొలిరోజు సిఎం చంద్రబాబు పట్టువస్త్రాలు



శ్రీవారి బ్రహ్మోత్సవాలపై జిల్లా అధికారులతో టిటిడి ఇఒ రవిచంద్ర సమీక్ష

**తిరుమల, ఆగస్టు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ఈ యేడాది అధికమాసం రావడంతో కలియుగ వైకుంఠవాసుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి రెండు బ్రహ్మోత్సవాలు నిర్వహించుకోనున్నామని, ఈ బ్రహ్మోత్సవాలను టిటిడి, జిల్లా యంత్రాంగం సమిష్టిగా కృషి చేసి విజయవంతం చేద్దామని టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర కోరారు. ఇందుకోసం అన్ని విభాగాల, శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సెప్టెంబర్ 15వ తేదీ నుండి మొదలుకానున్న శ్రీవారి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు 23వ తేదీతో ముగుస్తాయి. బ్రహ్మోత్సవాలకు తొలిఘట్టంగా ధ్వజారోహణం జరిగే సెప్టెంబర్ 15 మంగళవారం రోజునే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఈ తొమ్మిదిరోజుల ఉత్సవాల్లో 19వ తేదీ గరుడసేవ, 20న బంగారురథం, 22న రథోత్సవం, 23న చక్రస్నాన మహోత్సవం, ధ్వజావరోహణం ప్రధాన ఘట్టాలు. కాగా నవరాత్రి బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 11వ తేదీ నుండి మొదలు కానున్నాయి. ఈ బ్రహ్మోత్సవాల్లో ప్రధానంగా అక్టోబర్ 16వ తేదీ గరుడవాహనం, 17న పుష్పపల్లకి, 19న స్వర్ణరథోత్సవం, 20న చక్రస్నాన మహోత్సవంతో ముగియనున్నాయి. రెండు బ్రహ్మోత్సవాల నిర్వహణ, ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యలపై గురువారం తిరుమల అన్నమయ్యభవన్‌లో టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, టిటిడి జెఇఒలు డాక్టర్ ఎ.శరత్, ప్రభల గోపీనాథ్, టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, తిరుమల అదనపు ఎస్పి ఐ.రామకృష్ణ, డిఎస్పీ విజయశేఖర్, టిటిడి డిప్యూటీ ఇఒలు లోకనాధమ్, భాస్కర్, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, పిఆర్ఒ నీలిమ తదితర విభాగాల అధికారులతో కలసి ఇఒ సమీక్షించారు. ఈ సందర్భంగా శ్రీవారి బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై అదనపు ఇఒ చౌదరి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు.

**సమన్వయంతో పనిచేద్దాం:** బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు తిరుమలలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టాలని ఇఒ రవిచంద్ర ఆదేశించారు. భక్తుల భద్రతకు ఎలాంటి సమస్య తలెత్తకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. గరుడ వాహనం రోజున అధిక మంది భక్తులకు దర్శనం కల్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని అందుకు తగిన విధంగా ఆర్టీసీ బస్సులను నడిపేలా ఏర్పాట్లు చేయాలన్నారు. స్వామివారికి నిస్వార్థంగా సేవలందించే శ్రీవారి సేవకులను గుర్తించి వారి సేవలను బ్రహ్మోత్సవాలకు వినియోగించుకోవాలని చెప్పారు.

**సెప్టెంబర్ 14లోగా పనులు పూర్తి చేయాలి:** బ్రహ్మోత్సవాలకు అవసరమైన ఏర్పాట్లు, సౌకర్యాల కల్పన తదితర అంశాలపై ఇప్పటివరకు చేపట్టిన పనుల పురోగతిని సమీక్షించి, మిగిలిన పనులను సెప్టెంబర్ 14లోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఇఒ ముద్దాడ రవిచంద్ర ఆదేశించారు. యేటా తిరుమలకు పెరుగుతున్న భక్తుల సంఖ్య, ఈ ఏడాదిరథసప్తమి సందర్భంగా సుమారు 3.75 లక్షల మంది భక్తులు, 15 వేల వాహనాలు వచ్చిన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని జరగబోయే బ్రహ్మోత్సవాల్లో భక్తుల రద్దీపై ముందస్తు అంచనాలు రూపొందించినట్లు తెలిపారు. తిరుమల, తిరుపతి ప్రాంతాల్లో భక్తుల రద్దీ, వాహన ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌తో బాటు ఆరోగ్యం, పారిశుద్ధం, అన్నప్రసాదం, ఘాట్‌రోడ్ల నిర్వహణ, అత్యవసర పరిస్థితుల నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించినట్లు వివరించారు. అనంతరం ఆలయ మాఢవీధుల్లో గ్యాలరీలు, సౌకర్యాలు ఏర్పాట్లుపై ఇఒ రవిచంద్ర అధికారులతో కలసి ఆలయ నాలుగు మాడ వీధులను తనిఖీ చేశారు. బ్రహ్మోత్సవ ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా యంత్రాంగం, పోలీసు, టిటిడి విభాగాల మధ్య సమన్వయంతో సమగ్ర ప్రణాళిక రూపొందించినట్లు అదనపు ఇఒ వెంకయ్యచౌదరి తెలిపారు. తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, పరస్పరం సమన్వయం పనిచేయడం ద్వారా బ్రహ్మోత్సవాలను విజయవంతంగా

## తిరుమల సమాచారం



### తిరుమలనంబి 1053 అవతార మహోత్సవాలు

**తిరుమల, ఆగస్టు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** వైష్ణవాచార్యులు తిరుమలనంబి 1053వ అవతార మహోత్సవం తిరుమలలో దక్షిణ మాడ వీధిలోని తిరుమలనంబి ఆలయంలో గురువారం జరిగింది. తొలుత వేద పండితులు వేద పారాయణం, ప్రబంధ పారాయణం, రామాయణం, ఇతిహాసాది పురాణాలను శ్రావ్యంగా పఠించారు. ఈ కార్యక్రమంలో తిరుమల నంబి వంశీయులు టి.కె.శేషాద్రి స్వామి, టి.కె.ముకుంద తాతాచార్యులు, తిరుమల నంబి వంశీయులు పాల్గొన్నారు. నేటి ఉదయం శ్రీవారి తొలి ఘంట నైవేద్యాన్ని తిరుమల నంబి వారికి సమర్పిస్తారు. అనంతరం 16 మంది ప్రముఖ పండితులు తిరుమలనంబి జీవిత చరిత్రపై ఉపన్యసిస్తారు.

### భక్తి జ్ఞానానికి ప్రతిరూపం తరిగొండ వెంగమాంబ



**తిరుమల, ఆగస్టు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** భక్తి, జ్ఞానం, యోగసాధనల సమన్వయంతో వెలుగొందిన మహనీయురాలు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అని టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యదర్శి డాక్టర్ మేడసాని మోహన్ అన్నారు. వెంగమాంబ భక్తి కేవలం ఆరాధనకు పరిమితం కాలేదని, సంపూర్ణ శరణాగతి, దైవానుభూతికి ప్రతిరూపంగా నిలిచిందని తెలిపారు. వేంకటేశ్వరస్వామివారిపై ఆమెకున్న అచంచలమైన విశ్వాసం, ఆత్మనివేదన ప్రతి రచనలోనూ ప్రతిఫలిస్తాయని చెప్పారు. తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో గురువారం తరిగొండ వెంగమాంబ 209వ వర్ధంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. "మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ – భక్తి తత్వం" అనే అంశంపై డాక్టర్ మేడసాని మోహన్ ప్రసంగిస్తూ భక్తి, భావోద్వేగం, ఆత్మానుభూతి సమన్వయంతో సాగిన ఆమె సాహిత్యం నేటికీ భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తోందని పేర్కొన్నారు. శ్వేత ఇన్‌చార్జ్ సంచాలకులు, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ ప్రాజెక్టు ప్రత్యేకాధికారి డాక్టర్ వేమా వేంకట రత్నం మాట్లాడుతూ తరిగొండ వెంగమాంబ జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయక మన్నారు. నైతిక విలువలను పాటిస్తూ ధార్మిక జీవనం సాగించాలని ఆమె జీవితం సందేశమిస్తుందని తెలిపారు. వెంగమాంబ రచనలు జనరంజకమైన, సరళమైన భాషలో ఉండటంతో అన్ని వర్గాల ప్రజలకు సులభంగా చేరువయ్యాయని చెప్పారు. ఆమె సాహిత్యంలో భక్తి, ఆధ్యాత్మిక చింతన, యోగసాధన, దైవానుభూతి స్పష్టంగా ప్రతిఫలిస్తాయని వివరించారు. వెంగమాంబ జీవితం, సాహిత్యం సమాజంలో భక్తి, ధర్మం, ఆధ్యాత్మిక విలువలను పెంపొందించే శక్తివంతమైన ప్రేరణగా నిలిచాయని అన్నారు. దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి పి.ఆర్. ఆనంతీర్థాచార్యులు శ్రీవారితో ఆమెకున్న అనుబంధం, ఆత్మీయ భక్తి ప్రతి రచనలోనూ ప్రతిధ్వనిస్తుందని తెలిపారు. సాహితీవేత్త గంగవరం శ్రీదేవి, శ్వేత ప్రతినిధులు అరుణా దేవి, ఎన్ సుశీల, ఎల్ఎన్‌వి రవికుమార్, పండితులు, శ్వేత సిబ్బంది, సాహితీవేత్తలు, కళాకారులు పాల్గొన్నారు.

## శ్రీవారి సేవలో బండ్ల గణేశ్

**తిరుమల, ఆగస్టు 20 ప్రభాతవార్త ప్రతినధి:** పద్మావతి శ్రీనివాసులు దేవతల రూపంలో సిఎం చంద్రబాబు నాయుడు, సతీమణి నారా భువనేశ్వరి తన కుమార్తె వివాహానికి హాజరయ్యారని సినీ నిర్మాత బండ్ల గణేశ్ తెలిపారు. ఇటీవల ఆయన కుమార్తెకు వివాహం జరగడంతో గురువారం ఉదయం నూతన దంపతులతో కలసి ఆయన తిరుమలకు వచ్చారు. గురూవారం ఉదయం విఐపి బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.



# సంస్కృత జ్ఞానాన్ని ఆధునిక తరానికి చేరువ చేయాలి

## మాజీ ఉపకులపతి ప్రొ. దేవనాథన్ ● వైభవంగా ముగిసిన ఉత్కర్ష మహోత్సవం-2026





**తిరుపతి(విద్య), ఆగస్టు 20 ప్రభాతవార్త:** ఆధునిక తరానికి సంస్కృత భాష, భారతీయ జ్ఞాన సంప్రదాయాన్ని చేరువ చేయాలని శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం, కర్ణాటక సంస్కృత విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ప్రొ. కె.ఈ. దేవనాథన్ సూచించారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో రెండు రోజులుగా నిర్వహించిన ఉత్కర్ష మహోత్సవం-2026 గురువారం ఘనంగా ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొ. దేవనాథన్ మాట్లాడుతూ సంస్కృతాన్ని గురుకుల పద్ధతిలో బోధిస్తూ ఆధునిక తరానికి అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, శాస్త్ర విజ్ఞానాన్ని పరిరక్షించడంలో సంస్కృతం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న న్యూఢిల్లీలోని లాల్ బహాదూర్ ఆచార్యుడు జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొ. మురళీ మనోహర్ పాఠక్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, భారతీయ జ్ఞాన సంపద సంస్కృత భాషలోనే నిక్షిప్తమై ఉందన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా సంస్కృత భాష, భారతీయ జ్ఞాన పరంపర విశిష్టతను ఆధునిక తరానికి తెలియజేయాలని సూచించారు. వచ్చే ఏడాది ఉత్కర్ష మహోత్సవాన్ని న్యూఢిల్లీలోని తమ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొ. జి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో రెండోసారి ఉత్కర్ష మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. సంస్కృత భాషాభివృద్ధితో పాటు సంస్కృతాన్ని ప్రతి ఒక్కరికీ చేరువ చేసే దిశగా విశ్వవిద్యాలయం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. మహోత్సవంలో భాగంగా 75 పుస్తకాలను ఆవిష్కరించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఆయా గ్రంథాలను అధ్యయనం చేసి శాస్త్ర విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

కేంద్రీయ సంస్కృత విశ్వ విద్యాలయం వరిష్ఠ ఆచార్యులు, దర్భంగా విశ్వవిద్యా లయం మాజీ ఉపకులపతి ప్రొ. సర్వనారాయణ ఝా మాట్లాడుతూ విద్యార్థులను భవిష్యత్ భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉత్కర్ష వంటి సదస్సులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. విద్యార్థులు శాస్త్ర జ్ఞానాన్ని సంపాదించడంతో పాటు భారతీయ జ్ఞాన సంప్రదాయాలను అర్థం చేసుకోవాలని సూచించారు. ఉత్కర్ష మహోత్సవ సమన్వయకర్త ప్రొ. గణపతి భట్ మాట్లాడుతూ రెండు రోజులపాటు పలువురు పండితులతో వివిధ అంశాలపై ప్రయోజనకరమైన చర్చలు నిర్వహించినట్లు తెలిపారు. శాస్త్రీయ జ్ఞానాన్ని ఆధునిక పద్ధతుల్లో ప్రజలకు చేరువ చేసేందుకు మహోత్సవం దోహదపడిందన్నారు. కార్యక్రమం విజయవంతానికి కృషి చేసిన అదనపు సమన్వయకర్తలు ప్రొ. భరత భూషణ్ రత్, ప్రొ. నాగరాజు భట్, డా. బుల్టీదాస్‌ను అభినందించారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ కడియం వెంకట నారాయణరావు అతిథులు, నిర్వాహకులు, విశ్వవిద్యాలయ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమానికి సభా నిర్వాహకులుగా సాహిత్య విభాగ ఆచార్యులు ప్రొ. సి.రంగనాథన్ వ్యవహరించారు. అకడమిక్ డీన్ ప్రొ. రజనీకాంత శుక్ల, పీఆర్వో ప్రొ. రమేష్ బాబు, ఏపీఆర్వో డా. కనపాల కుమార్, వివిధ పాఠశాలల డీన్లు, విభాగాధిపతులు, ఆచార్యులు, విద్యార్థులు,

21-08pg10:21-08pg10.qxd 8/20/2026 11:50 PM Page 1



## ఆసియాన్ చెస్ ఛాంపియన్‌షిప్..
# భారత్ బాలికల జట్టుకు కాంస్యం

**సింగపూర్:** సింగపూర్‌లో జరిగిన ఆసియాన్ ఏజ్ గ్రూప్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో భారత అండర్11 బాలికల జట్టు కాంస్య పతకాన్ని కైవసం చేసుకుని, ఈ అంతర్జాతీయ జూనియర్ టోర్నమెంట్‌లో తమ అద్భుతమైన ప్రదర్శనను ముగించింది. భారత జట్టులో వరేణ్య లక్ష్మి వకా, అలిగిరి అమృత హేమల్‌తో పాటు మాయ సిద్ధార్థ్ నరులా ఉన్నారు. భారత్ 14.5 పాయింట్లతో ఆతిథ్య సింగపూర్‌తో సమానంగా నిలిచినప్పటికీ, టోర్నమెంట్ టైబ్రేక్ నిబంధనల ఆధారంగా కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. వియత్నాం 19.5 పాయింట్లతో స్వర్ణ పతకాన్ని గెలుచుకోగా, సింగపూర్ రజత పతకాన్ని దక్కించుకుంది. ఈ ఛాంపియన్‌షిప్‌లో 27 దేశాలకు చెందిన 700 మందికి పైగా ఆటగాళ్లు పాల్గొన్నారు. పోటీ అంతటా భారత క్రీడాకారులు నిలకడ, పోరాట స్ఫూర్తిని ప్రదర్శిస్తూ, ఆసియా నలుమూలల నుండి వచ్చిన ప్రముఖ జూనియర్ క్రీడాకారులకు దీటుగా నిలిచారు. వారి ప్రదర్శన, అన్ని వయసుల వర్గాలలో భారత జూనియర్ చెస్ యొక్క పెరుగుతున్న ఆసక్తిని కూడా నొక్కి చెప్పింది. భారతీయ క్రీడాకారులు వయోవర్గ ఖండాంతర మరియు ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో నిలకడగా అద్భుత ప్రదర్శన కనబరుస్తూ, క్లాసికల్, ర్యాపిడ్ మరియు బ్లిట్జ్ ఫార్మాట్లలో పతకాలు గెలుచుకున్నారు.



## మహిళల హాకీ ప్రపంచ కప్..
# ఇంగ్లండ్‌తో భారత్ డ్రా




**కొలంబో:** హాకీ మహిళల ప్రపంచ కప్‌లో ఇంగ్లండ్‌తో గురువారం జరిగిన లీగ్ మ్యాచ్‌ను భారత్ డ్రా చేసుకుంది. దీంతో భారత్ అమ్మాయిల జట్టు పూల్ డిలో కీలక పాయింట్ సాధించి రెండో రౌండ్‌కు అర్హత సాధించింది. నాలుగు క్వార్టర్స్‌లోనూ ఇరు జట్లు ఒక్క గోల్ కూడా సాధించకపోవడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. తొలి క్వార్టర్‌లో భారత్ జట్టు అద్భుతమైన అటతీర్రు కనపరచింది. పెనాల్టీ కార్నర్‌లో నవ్‌నీత్ కౌర్ బంతిని నెట్‌లోకి పంపినప్పటికీ, అది భారత్ ప్లేయర్ శరీరానికి తగలడంతో గోల్‌ను అనుమతించ లేదు. మరోవైపు ఇంగ్లండ్‌కు వరుస పెనాల్టీ కార్నర్లు లభించాయి. అయితే భారతన గోల్‌కీపర్ సవితా పునియా, డిఫెండర్ సలీమా టెటే అద్భుతమైన డిఫెన్స్‌తో ఇంగ్లండ్‌కు గోల్ సాధించే అవకాశాలు ఇవ్వలేదు. కాగా పూల్ డి నుండి చైనా, భారత్ తదుపరి రౌండ్‌కు అర్హత సాధించగా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా జట్లు ఇంటి ముఖం పట్టాయి.



## మహిళల ఛాంపియన్స్ లీగ్..
# ఈస్ట్ బెంగాల్ విజయం

**న్యూఢిల్లీ:** ఏఎఫ్‌సి మహిళల ఛాంపియన్స్ లీగ్ 2026-27 ప్రాథమిక దశలో రోవర్స్ ఎఫ్‌సి (గ్వామ్) పై 12-0 తేడాతో ఘన విజయం సాధించిన తర్వాత ఈస్ట్ బెంగాల్ ఎఫ్‌సి వరుసగా తమ రెండవ విజయాన్ని నమోదు చేసుకుంది. ఈ విజయంతో ఈస్ట్ బెంగాల్ గ్రూప్ దశకు చేరుకోవడానికి మరో విజయం దూరంలో నిలిచింది. గురువారం ఇక్కడ జరిగిన మొదటి మ్యాచ్ రోజున రాజ్‌షాహి స్టార్స్ ఎఫ్‌సి (బంగ్లాదేశ్) పై 4-0 తేడాతో సునాయాస విజయం సాధించిన ఈస్ట్ బెంగాల్ ఆరంభం నుంచే ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఆరో నిమిషంలో ప్రియాంక దేవి నవోరేమ్ కొట్టిన బంతితో ఈస్ట్ బెంగాల్ ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. 15వ నిమిషంలో రోవర్స్ గోల్ కీపర్ జే అల్మోంటే బాక్స్ లోపలి నుండి అంజు చాను కయెన్‌పైబమ్ కొట్టిన షాట్‌ను వదిలేయడంతో మళ్ళీ గోల్ ఇచ్చింది. అయితే వేగంగా స్పందించిన అస్తమ్ ఒరాన్ రీబౌండ్‌ను గోల్‌గా మలిచింది. ఈస్ట్ బెంగాల్ తమ ఒత్తిడిని కొనసాగించగా, ఏడు నిమిషాల తర్వాత ప్రియాంగ తన గోల్స్ సంఖ్యను రెట్టింపు చేసింది. విరామం తర్వాత అదే రీతిలో ఆటను పునఃప్రారంభించారు. 48వ నిమిషంలో సులంజన రౌల్ బంతిని డ్రిబ్లింగ్ చేసుకుంటూ వెళ్లగా, ఆమె ఇచ్చిన క్రాస్ డిఫ్లెక్ట్ అయి ఒలివియా అనోక్యే వద్దకు చేరడంతో గోల్ చేసింది. ఒక నిమిషం తర్వాత, సౌమ్య గుగులోత్ కచ్చితమైన క్రాస్‌తో అబిగైల్ అంట్వికి బంతిని అందించగా, ఆమె గోల్ చేసి ఈస్ట్ బెంగాల్‌కు ఐదవ గోల్‌ను అందించింది 51వ నిమిషంలో జే రీబౌండ్‌ను గోల్‌గా మార్చింది. 58వ నిమిషంలో షాట్ కొట్టి ఒలివియా తన రెండవ గోల్ సాధించగా, 64వ నిమిషంలో అబెనా ఒపోకు గోల్ పూర్తి చేసింది. అబెనా (70), అంజు (73), సౌమ్య (93+3) గోల్స్‌తో ఈస్ట్ బెంగాల్ తమ ఆధిక్యాన్ని మరింత పెంచుకుని, సమగ్రమైన విజయాన్ని పూర్తి చేసింది.

# భారత్‌కు అసలైన పరీక్ష
## 8 టెస్టుల్లో 7 గెలిస్తేనే ఫైనల్‌కు ఛాన్స్

**న్యూఢిల్లీ:** శ్రీలంకలోని గాలే వేదికగా జరిగిన మొదటి టెస్టులో 165 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించిన తర్వాత భారత జట్టు డబ్ల్యూటీసీ ఫైనల్స్‌కు చేరే అవకాశాలు గణనీయంగా మెరుగుపడ్డాయి. ప్రస్తుతం టీమిండియా ఖాతాలో 53.33 శాతం పాయింట్లతో 5వ స్థానంలో ఉంది. అయితే ఫైనల్ రేసులో నిలవాలంటే కనీసం 60 శాతం మార్కును దాటడం అత్యవసరం. ప్రపంచ టెస్టు ఛాంపియన్షిప్ చరిత్రను పరిశీలిస్తే, 60 శాతానికి పైగా పాయింట్లు సాధించిన జట్లే పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలిచి ఫైనల్ సమరానికి అర్హత సాధించాయి.గతంలో జరిగిన మొదటి రెండు డబ్ల్యూటీసీ సైకిళ్లలోనూ టీమిండియా వరుసగా ఫైనల్స్‌కు చేరుకుంది. అయితే తొలిసారి న్యూజిలాండ్ చేతిలో, రెండోసారి ఆస్ట్రేలియా చేతిలో ఓటమి పాలై రన్నరప్గా నిలిచింది. ఇక మూడో సైకిల్లో ఆస్ట్రేలియా, సౌతాఫ్రికాల మధ్య ఫైనల్ జరగ్గా, అందులో దక్షిణాఫ్రికా విజయం సాధించి కొత్త చరిత్ర సృష్టించింది. ఇక ప్రస్తుత సైకిల్ విషయానికొస్తే, శ్రీలంకతో ఈ నెల 23 నుంచి ప్రారంభమయ్యే రెండో టెస్టులో విజయం సాధించి సిరీస్‌ను 2-0తో క్లీన్ స్వీప్ చేస్తే, భారత్ పాయింట్ల శాతం 57.57కు చేరుతుంది. శ్రీలంక పర్యటన తర్వాత న్యూజిలాండ్ వేదికగా రెండు టెస్టుల సిరీస్, ఆ తర్వాత స్వదేశంలో ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల హోరాహోరీ సిరీస్ ఆడాల్సి ఉంది. రాబోయే ఈ ఏడు మ్యాచ్‌లూ భారత్‌కు అత్యంత కీలకంగా మారనున్నాయి. మొత్తంగా మిగిలివున్న 8 టెస్టుల్లో టీమిండియా కనీసం 6 నుండి 7 టెస్టుల్లో విజయం సాధించాలి. 6 విజయాలు సాధిస్తే పాయింట్లు 60 శాతానికి చేరువవుతాయి. అదే 7 నుండి 8 మ్యా టెస్టులు గెలిస్తే టాప్2 స్థానం ఖాయమవుతుంది. గత సైకిల్లో స్వదేశంలో సౌతాఫ్రికా చేతిలో 2-0తో ఓడిపోవడం భారత్‌ను తీవ్రంగా దెబ్బతీసింది. ఆ సిరీస్ గెలిచి ఉంటే భారత్ ప్రస్తుతం పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉండేది. ప్రస్తుతం ఆస్ట్రేలియా 77.78 శాతంతో అగ్రస్థానంలో, డిఫెండింగ్ ఛాంపియన్ సౌతాఫ్రికా 75 శాతంతో రెండో స్థానంలో ఉన్నాయి. అయితే దక్షిణాఫ్రికాకు రాబోయే నాలుగు సిరీస్లలో



ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, బంగ్లాదేశ్లతో కఠిన సవాళ్లు ఎదురుకానున్నాయి. ఇది టీమిండియాకు సానుకూలంగా మారే అవకాశం ఉంది. ప్రస్తుతం న్యూజిలాండ్ 72.22 శాతంతో మూడో స్థానంలో, బంగ్లాదేశ్ 66.67 శాతంతో నాలుగో స్థానంలో కొనసాగుతున్నాయి. రాబోయే కివీస్ సిరీస్ భారత్ ఫైనల్ అర్హతను నిర్దేశించడంలో ఇవన్నీ కీలకం కానున్నాయి.




## ప్రపంచ ఛాంపియన్‌షిప్..
# సింధు సంచలన ఓటమి
### క్వార్టర్స్‌కు ట్రీసా-గాయత్రి



**న్యూఢిల్లీ:** ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత్ ప్లేయర్ పివి సింధు చైనా క్రీడాకారిణి వాంగ్ జియి చేతిలో ఓటమిపాలైంది. అయితే భారత మహిళల డబుల్స్ స్టార్లు ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్ గురువారం బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్స్ 2026లో ఒక పెద్ద విజయాన్ని నమోదు చేశారు. వారు రౌండ్ ఆఫ్ 16లో ప్రపంచ 7వ ర్యాంకర్ అయిన జపాన్ ద్వయం రిన్ ఇవానగా-కీ నకానిషిలను ఓడించి, పతకం సాధించడానికి కేవలం అడుగు దూరంలో ఉన్నారు. మొదటి గేమ్‌లో జపాన్ జంట చక్కగా ఆడటంతో ట్రీసా-గాయత్రి జోడి 9-13తో వెనుకబడింది. ఆ తర్వాత ట్రీసా కొన్ని శక్తివంతమైన స్మాష్‌లను సంధించి, జపాన్ జంట వ్యూహాన్ని అడ్డుకుంది. దీంతో ట్రీసా, జాలీలు అద్భుతంగా పుంజుకుని, వరుసగా 8 పాయింట్లు గెలుచుకుని తొలి గేమ్‌ను తమకు అనుకూలంగా ముగించారు. రెండవ గేమ్‌లో గాయత్రి కచ్చితమైన నెట్ షాట్‌లతో వెనుక ఉన్న ట్రీసాకు బంతిని అందించగా, ఆమె శక్తివంతమైన విన్నర్‌లతో పాయింట్లను ముగించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుని, తమ పతక ఆశలను సజీవంగా ఉంచుకున్నారు. ఇక రౌండ్ ఆఫ్ 16లో, భారత క్రీడాకారిణి పివి సింధు, మూడో సీడ్ చైనా క్రీడాకారిణి వాంగ్ జి యి చేతిలో మూడు గేమ్‌ల హోరాహోరీ పోరులో (21-11, 15-21, 21-17) ఓటమి చెందింది..వాంగ్ మొదటి గేమ్‌లో ఆధిపత్యం చెలాయించి, 7-7తో సమంగా ఉన్న స్కోరు నుండి సింధుపై ఆధిక్యం సాధించి, చివరికి అర్థమైన ఆధిక్యాన్ని కైవసం చేసుకుంది. సింధు, రెండవ గేమ్‌లో ఆరంభంలోనే ఆధిక్యం సాధించినా మధ్యలో కాస్త తడబడినప్పటికీ, అవసరమైనప్పుడు పాయింట్లు సాధించి నిర్ణయాత్మక గేమ్‌కు దారితీసింది. మూడవ గేమ్‌లో 18-17 స్కోరు వద్ద సింధు, వాంగ్ 54 షాట్ల సుదీర్ఘ ర్యాలీలో తలపడ్డారు. అయితే సింధు కోలుకోలేకపోవడంతో, వాంగ్ చిరస్మరణీయ విజయాన్ని సొంతం చేసుకుంది.

# 13.37 కోట్లకు పెరిగిన స్టాక్‌మార్కెట్ ఇన్వెస్టర్లు

**ముంబయి, ఆగస్టు 20:** భారత స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడిదారుల సంఖ్య భారీగా పెరుగుతోంది. ఈ ఏడాది జూలై నాటికి దేశంలో నమోదైన ఇన్వెస్టర్ల సంఖ్య 13.37 కోట్లకు చేరింది. 2019 ఆర్థిక సంవత్సరంమొదటి త్రైమాసికంలో ఉన్న 2.75 కోట్లతో పోలిస్తే ఇది దాదాపు ఐదు రెట్లు అధికం. పశ్చిమ భారతదేశానికే పరిమితమైన స్టాక్ మార్కెట్ భాగస్వామ్యం ఇప్పుడు దేశవ్యాప్తంగా విస్తరిస్తోంది. జూలైలో కొత్తగా 13.3 లక్షల మంది ఇన్వెస్టర్లు నమోదు చేసుకున్నారు. జూన్‌తో పోలిస్తే ఇది 14.1 శాతం పెరుగుదల. 2025 జూలైతో పోలిస్తే కొత్త రిజిస్ట్రేషన్లు 12.1 శాతం తగ్గాయి.మార్కెట్‌లో ఇన్వెస్టర్ల వయసు కూడా తగ్గుతోంది. 2026 జూన్ నాటికినమోదైన ఇన్వెస్టర్లలో 30 ఏళ్లలోపు వారు 37.9 శాతంగా ఉన్నారు. 30-39 ఏళ్ల వయసు వారు మరో 30.2 శాతం ఉన్నారు. నమోదైన ఇన్వెస్టర్ల మధ్యస్థ వయసు 33 సంవత్సరాలుగా ఉంది. 2027 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు కొత్తగా నమోదైన ఇన్వెస్టర్లలో 30 ఏళ్లలోపు వారు 59 శాతంగా ఉన్నారు. క్యూవన్26లో ఈ వాటా 56.4 శాతంగా



ఉంది. కొత్త ఇన్వెస్టర్ మధ్యస్థ వయసు కేవలం 27 సంవత్సరాలుగా నమోదైంది. జూలైలో ఉత్తర భారతదేశంలో 4.93 కోట్ల మంది నమోదైన ఇన్వెస్టర్లు ఉన్నారు. ఇది దేశ మొత్తం ఇన్వెస్టర్ బేస్‌లో 36.9%. పశ్చిమ భారత్‌లో 3.89 కోట్ల మంది ఇన్వెస్టర్లు ఉండగా, దేశ మొత్తం వాటాలో 29.1 శాతంగా ఉంది.దక్షిణ భారత్‌లో 2.82 కోట్లు, తూర్పు భారతదేశంలో 1.62 కోట్ల మంది ఇన్వెస్టర్లు ఉన్నారు. తూర్పు భారతదేశంలో ఇన్వెస్టర్ బేస్ ఆరు రెట్లు,దక్షిణ భారతదేశంలో 4.2రెట్లు, పశ్చిమ భారతదేశంలో నాలుగు రెట్లు పెరిగింది. రాష్ట్రాల వారీగా చూస్తే జూలైలో కొత్త ఇన్వెస్టర్ల చేరికలో ఉత్తరప్రదేశ్ ముందంజలో నిలిచింది. ఆ రాష్ట్రంలో 1.9 లక్షల మంది కొత్తగా నమోదు కాగా, మొత్తం కొత్త రిజిస్ట్రేషన్లలో ఇది 14 శాతం.మహారాష్ట్రలో 1.4 లక్షలు, గుజరాత్‌లో 1.2 లక్షలు, తమిళనాడులో 90 వేలు, పశ్చిమ బెంగాల్‌లో 80 వేల మంది కొత్త ఇన్వెస్టర్లు చేరారు. ఈ 5 రాష్ట్రాలు కలిపి జూలైలో నమోదైన కొత్త ఇన్వెస్టర్లలో 46.6% వాటాను కలిగి ఉన్నాయి.

**వాణిజ్యం**



# రూ.10వేల కోట్ల రియాల్టీ లావాదేవీలపై ఐటీ శాఖ నజర్

**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** ఐదు సరిహద్దు రాష్ట్రాల్లో రూ.10వేల కోట్లకు పైగా విలువైన రియల్ ఎస్టేట్ లావాదేవీలు ఆదాయపు పన్ను శాఖ పరిశీలనలోకి వచ్చాయి. పన్ను ఎగవేత, లావాదేవీలను తక్కువగా చూపించడం, తప్పుగా నివేదించడం వంటి పన్ను నిబంధనల ఉల్లంఘనఐటిశాఖ గుర్తించింది.ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు సంబంధించిన 2025-26 ఆర్థిక సంవత్సర లావాదేవీలను శాఖ పరిశీలిస్తోంది. మొత్తం 14,743 ఆస్తి లావాదేవీల్లో పన్ను నిబంధనలకు సంబంధించిన లోపాలను గుర్తించింది. ఇందులో 2,552 లావాదేవీలు అసలు నివేదించనివి ఉన్నాయి. విలువ పరంగా రూ.9,350 కోట్ల లావాదేవీల్లో తప్పులున్న ఫైలింగ్స్ గుర్తించగా, మరో రూ.1,628 కోట్ల విలువైన రియల్ ఎస్టేట్ లావాదేవీలు నివేదించలేదు. ఆస్తి లావాదేవీలకు సంబంధించిన రూ.63 కోట్ల నగదు లావాదేవీలను కూడా ప్రకటించలేదని శాఖ గుర్తించింది.రాష్ట్రాల వారీగా చూస్తే ఉత్తరప్రదేశ్ అత్యధికంగా రూ.4,081.27 కోట్ల లావాదేవీలతో ముందుంది. రాజస్థాన్ రూ.2,694.62 కోట్లు, గుజరాత్ రూ.1,795.65 కోట్లు, బిహార్ రూ.1,472.81 కోట్లు, పశ్చిమ బెంగాల్ రూ.554.15 కోట్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. పాన్ వివరాలను తప్పుగా నమోదు చేయడం, లావాదేవీల విలువను తక్కువగా చూపించడం, లావాదేవీలను నివేదించకపోవడం, తప్పు ఆర్థిక సంవత్సరంలో చూపించడం, నగదు భాగాన్ని వెల్లడించకపోవడం వంటి పలు లోపాలను ఐటీ శాఖ గుర్తించింది. ఐదు రాష్ట్రాల్లో పన్ను చెల్లింపులతో పోలిస్తే నగదు జమలు, ఉపసంహారణలు గణనీయంగా అధికంగా ఉన్నట్లు శాఖ విశ్లేషణలో వెల్లడైంది.ఉత్తరప్రదేశ్‌లో నగదు డిపాజిట్ పన్ను నిష్పత్తి 21.38 రెట్లుగా ఉంది. దేశవ్యాప్తంగా ఈ నిష్పత్తి 2.5 రెట్లు మాత్రమే. అలాగే నగదు ఉపసంహారణపన్ను నిష్పత్తి ఉత్తరప్రదేశ్‌లో 15.6 రెట్లు ఉండగా, దేశవ్యాప్తంగా ఇది 0.74 రెట్లు ఉంది.నగదు డిపాజిట్లు లేదా ఉపసంహారణలను చెల్లించిన పన్నుతో పోల్చి ఈ నిష్పత్తిని లెక్కిస్తారు. అసోంలో నగదు డిపాజిట్‌పన్ను నిష్పత్తి 17.31 రెట్లు, నగదు ఉపసంహారణపన్ను నిష్పత్తి 16.76 రెట్లుగా ఉంది.పశ్చిమ బెంగాల్‌లో ఈ రెండు నిష్పత్తులు వరుసగా 10.38 రెట్లు, 10.28 రెట్లుగా ఉన్నాయి. గుజరాత్‌లో 10.27 రెట్లు, 11.85 రెట్లు, బిహార్‌లో 7.63 రెట్లు, 8.41 రెట్లుగా నమోదయ్యాయి.

# లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, ఆగస్టు 20:** భారత స్టాక్ మార్కెట్ గురువారం భారీ లాభాల్లో ముగిసింది. వరుసగా ఏడు రోజులుగా కొనసాగిన నష్టాలకు ఈ రోజు బ్రేక్ పడింది. బీఎస్ఈ సెన్సెక్స్ ఏకంగా 628 పాయింట్లు లాభపడగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 153 పాయింట్లు లాభపడింది. ఐటీ, ఫైనాన్సియల్ స్టాక్స్ భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 77,468.45 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే సాగింది. గరిష్టంగా 77,611.11 పాయింట్లను తాకింది. చివరకు 628.04 పాయింట్లు లాభంతో 77,537.72 వద్ద ముగిసింది.



ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 153.55 పాయింట్ల లాభంతో 24,231.85 వద్ద ముగిసింది. బీఎస్ఈ 30 షేర్ ఇండెక్స్‌లో ఐటీసీ, కోటక్ బ్యాంక్, ఎటర్నల్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫినాన్స్ షేర్లు లాభపడ్డాయి. వీటిలో ఎటర్నల్ 2 శాతం పైగా లాభపడింది. మరోవైపు టైటాన్, ఇండిగో, టాటా స్టీల్, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. బ్రాడర్ మార్కెట్లలో నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 షేర్లు 0.68 శాతం లాభపడ్డాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ షేర్లు 2.13 శాతం లాభపడగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్స్ మాత్రం 0.50 శాతం నష్టపోయాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్‌షేర్లు 0.53శాతం క్షీణింస్తే స్మాల్‌క్యాప్ కూడా 0.48శాతం క్షీణించింది. బిఎస్ఇలో మొత్తం 2450 షేర్లు లాభపడగా 1874 షేర్లు పతనం చెందాయి. మరో 237 షేర్లుస్థిరంగా కొనసాగాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 93.94 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,490.60 వద్ద ట్రేడవుతోంది. రూపాయితో డాలర్ మారకం విలువ 95.71గా ఉంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా కోస్పి అత్యధికంగా 5.74 శాతం లాభపడింది. జపాన్ నిక్కీ 225, షాంఘై ఎస్ఎస్ఈ కాంపోజిట్ ఇండెక్స్, హాంకాంగ్ హ్యాంగ్ సెంగ్ ఇండెక్స్ కూడా లాభాల్లోనే కొనసాగుతున్నాయి. ఇక ఐపిఒలపరంగా టెంప్‌పెన్స్ ఇన్‌స్ట్రుమెంట్స్ 5.69 రెట్లు అధికంగా బిడ్లు రాబట్టిఇంది. ఐపిఒ ధరలు రూ.285 నుంచి రూ.300గా నిర్ణయించింది. గజా ఆల్టర్నేటివ్ అసెట్ మేనేజ్‌మెంట్ 2.36శాతం రెట్టింపు బిడ్లుసాధించింది. ఇష్యూధర రూ.152.నుంచి రూ.160గా నిర్ణయించింది. సన్‌షైన్ పిక్చర్స్ 105.34 రెట్లు బిడ్లు రాబట్టింది. సంకేష్ జ్యూయెలర్స్ 2.77 రెట్లు బిడ్లు సాధించింది. కనీసం 160 షేర్లు కొనుగోలుచేయాలి. రూ.88 నుంచి రూ.93వరకూ ఇష్యూధరలు నిర్ణయించింది.



# కీలక రంగాల ఉత్పత్తి వృద్ధి 5.4%

**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** ఎనిమిది కీలక రంగాల ఉత్పత్తిలో వృద్ధి 5.4 శాతంగా నమోదయింది. కేంద్ర మంత్రిత్వశాఖ మోస్పీ ఈ గణాంకాలు గురువారం విడుదలచేసింది. ఎనిమిది మౌలిక రంగాల్లో సిమెంట్ ఉత్పత్తి జూలైలో అత్యధికంగా 13.1 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేసింది. జూన్‌లో ఈ వృద్ధి 9.9 శాతంగా ఉంది. విద్యుత్ ఉత్పత్తి వృద్ధి జూన్‌లోని 11.4 శాతం నుంచి జూలైలో 9 శాతానికి తగ్గింది. బొగ్గు ఉత్పత్తి మాత్రం జూన్‌లోని 1.4 శాతం వృద్ధితో పోలిస్తే జూలైలో 7.6 శాతానికి పెరిగింది. ఎరువుల ఉత్పత్తిలో క్షీణత మరింత పెరిగి, జూన్‌లో నమోదైన 3.3 శాతం డీగ్రోత్ నుంచి జూలైలో 8 శాతం క్షీణతకు చేరింది.ఇనుప ఖనిజం ఉత్పత్తి జూలైలో వార్షిక ప్రాతిపదికన 29.5 శాతం పెరిగింది. ఇది మైనింగ్ కార్యకలాపాల్లో బలమైన వృద్ధిని ప్రతిబింబించింది. అయితే జూన్‌లో నమోదైన 44.5 శాతం వృద్ధితో పోలిస్తే ఇది తక్కువ. ఉక్కు ఉత్పత్తి 2.9 శాతం మేర పెరిగింది. జూన్‌లో ఈ వృద్ధి 5.6 శాతంగా ఉంది. మరోవైపు పెట్రోలియం రిఫైనరీ ఉత్పత్తుల ఉత్పత్తి జూలైలో 2.7 శాతం వృద్ధి సాధించింది. జూన్‌లో ఇది 4 శాతం క్షీణించింది.సహజవాయువు ఉత్పత్తి జూలైలో వార్షిక ప్రాతిపదికన 3.7 శాతం క్షీణించింది. అయితే జూన్‌లో నమోదైన 4.8 శాతం క్షీణతతో పోలిస్తే పరిస్థితి కొంత మెరుగుపడింది. ముడి చమురు ఉత్పత్తి జూలైలో 5.3 శాతం తగ్గింది. అంతకుముందు నెలలో ఇది 4.2 శాతం క్షీణించింది. సమిష్టి ప్రాతిపదికన ఏప్రిల్ జూలై కాలంలో ఎనిమిది కీలక రంగాల వృద్ధి 4.3 శాతానికి చేరింది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at E-30 & 31, A.K. Nagar, Industrial Estate, Nellore-524004. Ph: 2348108.Fax:2348106, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. RNI No.APTEL/2003/10109

# ఆఫీసులో ఐకమత్యం ఉందా !

ఐక మత్యమే మహా బలం.. చిన్నప్పుడు ఈ మాట చాలాసార్లే వినుంటారు కదా! పిల్లలకి కథలుగానూ చెప్పుంటాం. మరి ఆఫీసులో ఈ సూత్రాన్ని పాటిస్తున్నారా? కొందరి తీరు నచ్చదు. ఇంకొన్ని సార్లు మనం బాధపడుతుంటే చూసి ఆనందించేవారూ కనిపిస్తారు. స్నేహితులున్నా.. కనిపించ చని పోటీ. నేను మెప్పు పొందాలనే తత్వం.. తరచి చూస్తే పనిచేసే చోట ఎన్నో రకాల మనస్తత్వాల వారు కనిపిస్తారు. ఎలాగున్నా పని ముఖ్యం అనుకుంటేనే విజయం. అందుకు ఎద్దులు, సింహం కథే రుజువు. నాలుగు ఎద్దులు కలిసి ఉన్నప్పుడు సింహాన్నే ఎదిరిస్తాయి. వాటి మధ్య పొరపొచ్చాలు వచ్చి వేటికవే అయిపోయినప్పుడు అన్నీ ఆ సింహానికి ఆహారమవుతాయి. ఆఫీసులోనూ అంతే! కలిసి పనిచేయడం, ఒకరిపై మరొకరికి నమ్మకం తప్పనిసరి. అప్పుడే ఎంతటి కష్టమైన పనైనా సులువుగా పూర్తవుతుంది. పైఅధికారులు మెచ్చేలా, నా పని అన్నట్లుగా సాగితే ఆదుకునే వేల తోడుండేవారీ ఉండరు. ఇంట్లో ఒకతాటిపై నడిచేలా చేసేవాళ్లం మనం. పనిచేసే చోటూ అలాగే భావించి చూడండి. సమష్టి విజయాల్లో



# గర్భిణుల వ్యాయామం



స్టూలు మీద పాదాలు నేలకు ఆనించి కూర్చోండి. చిన్న నాపికిన్ లేదా టవల్ను అరచేతుల మధ్య పెట్టి చేతులను గుండె దగ్గరకు తీసుకు రావాలి. టవల్ అరచేతుల మధ్య ఉంచి మెల్లగా ఐదులెక్కపెడుతూ ఊపిరి బిగపట్టండి. నెమ్మదిగా శ్వాస వదలండి. రిలాక్స్ వండి. తిరిగి ఎక్సర్‌సైజులు మొదలుపెట్టండి. ఈ విధంగా 10సార్లు రిపీట్ చేయండి. ఇదే పొజిషన్‌లో కూర్చుని అరచేతులను ఎడమవక్షోజం దగ్గరకు తీసుకురండి. ఊపిరి ఐదులెక్కపెట్టేదాక బిగపట్టి మెల్లగా ఊపిరి వదలండి. రిలాక్స్ వండి. ఇదే విధంగా కుడివైపుకూడా చేయండి. □

# పేదవాడి యాపిల్‌గా..



దోరదోర జామకాయలను చూడగానే చట్టుకున్న కొరుక్కుని తినేయాలనిపిస్తుంది. పచ్చగా, చూడచక్కగా ఉండే వీటిలో పోషకాలూ ఎక్కువే. పేదవాడి యాపిల్‌గా పిలిచే వీటిల్లో ఉండే ఆరోగ్య ప్రయోజనాలెన్నో..

✦ వీటిల్లో విటమిన్-సి ఎక్కువగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచి.. తరచూ అనారోగ్యాల బారినపడకుండా కాపాడుతుంది. అంతేకాదు ఈ విటమిన్ తెల్లరక్తకణాలఉత్పత్తికీ తోడ్పడుతుంది. వీటిల్లోని యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీరాడికల్స్ బారి నుంచి శరీరాన్ని కాపాడతాయి. క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధిస్తాయి. వీటిల్లో ఉండే అధిక పొటాషియం గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. గుండెపోటుకు గురికాకుండా సాయపడుతుంది. ఇది రక్తపోటును నియంత్రించడానికీ తోడ్పడుతుంది. జామ కాయల్లో ఉండే పోషకాలు రక్తంలోని చక్కెర స్థాయిలను నియంత్రించడానికి సాయపడతాయి. ఎక్కువగా ఉండే పీచు పదార్థం జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అంతేకాదు మలబద్ధకాన్నీ పోగొడుతుంది.పీచు ఎక్కువగా ఉండటం వల్ల త్వరగా కడుపు నిండిన భావన కలుగుతుంది. అందువల్ల బరువు తగ్గాలనుకునేవారికి ఇవి సరైన ఎంపికకాగలవు. వీటిల్లో పుష్కలంగా ఉండే యాంటీఆక్సిడెంట్లు వృద్ధాప్య లక్షణాలను ఆలస్యం చేస్తాయి. □

# సకల సౌభాగ్య ప్రదాయిని శ్రీ వరలక్ష్మీ వ్రతం





భారతీయ సనాతన ధర్మంలో పండుగలు, నోములు, వ్రతాలకు ఎంతో విశిష్టమైన స్థానం ఉంది. హిందూ కేలండర్ ప్రకారం ప్రతి నెలా ఎన్నో పండుగలు వచ్చినప్పటికీ, ఆధ్యాత్మిక శోభతో, పవిత్రతతో పరిమళించే మాసం ఏదైనా ఉందంటే అది నిస్సందేహంగా 'శ్రావణ మాసం' అనే చెప్పాలి. శ్రావణ మాసం అనగానే మనకు టక్కున గుర్తుకు వచ్చేవి పవిత్ర నదీస్నానాలు, నోములు, పూజలు మరియు పండుగ వాతావరణం. వర్షాకాలం ఆరంభంలో ప్రకృతి అంతా పచ్చదనంతో కళకళలాడుతూ ఉంటే, మరోవైపు ఇళ్లన్నీ ఆధ్యాత్మిక శోభతో వెలిగిపోతుంటాయి. శివాలయాలు శివనామ స్మరణతో, వైష్ణవాలయాలు లక్ష్మీనారాయణుల పూజలతో పులకించిపోతాయి. ఈ పవిత్ర శ్రావణ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారానికి ఎంతో ప్రత్యేకత ఉంది. ఆ రోజే మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో, నిష్టతో ఆచరించే అద్భుతమైన వ్రతం 'శ్రీ వరలక్ష్మీ వ్రతం' అష్టలక్ష్మలలో కొలువైన వరలక్ష్మీ దేవిని ఈ రోజున ప్రత్యేకంగా పూజిస్తారు. "వర" అనగా భక్తులు కోరిన కోర్కెలను, వరాలను ప్రసాదించే తల్లి అని అర్థం. కేవలం పూజ చేయడం మాత్రమే కాకుండా, ఈ వ్రతాన్ని ఆచరించడం ద్వారా ఇంటా బయటా సిరి సంపదలు వర్ధిల్లుతాయని, సకల అరిష్టాలు తొలగిపోతాయని మహిళల గాఢమైన విశ్వాసం. నిత్య జీవితంలో ఎదురయ్యే ఆర్థిక ఇబ్బందులను, మనోవేదనలను తొలగించి, కుటుంబానికి రక్షణ కవచంలా నిలిచే ఈ వరలక్ష్మీ వ్రతం యొక్క సమగ్ర పూజా విధానం, కలశ స్థాపన వంటి పూర్తి విశేషాలు తెలుసుకుందాం. శ్రావణ మాసంలో శుక్రవారం రోజున అష్టలక్ష్మలలో ఒకరైన వరలక్ష్మీ దేవిని పూజిస్తారు. ఆదిలక్ష్మి, ధాన్యలక్ష్మి, ధైర్యలక్ష్మి, గజలక్ష్మి, సంతాన లక్ష్మి, విద్యలక్ష్మి, విజయలక్ష్మి, ధనలక్ష్మి అనే అష్టలక్ష్మల రూపమే శ్రీ వరలక్ష్మి. ఈ వ్రత ప్రాశస్త్యాన్ని గురించి శివుడుపార్వతీ దేవికి వివరించినట్లు పద్మ పురాణంలో చెప్పబడింది. మగధ దేశంలో చారుమతి అనే సద్గుణవతి అయిన ఇల్లాలికి స్వయంగా మహాలక్ష్మి కలలో సాక్షాత్కరించి ఈ వ్రతాన్ని ఆచరించమని చెప్పినట్లు ఐతిహాస్యం. అప్పటి నుండి ఈ వ్రతాన్ని మహిళలు ఎంతో భక్తితో ఆచరిస్తూ వస్తున్నారు. ఈ పవిత్రమైన వ్రతాన్ని ఆచరించడానికి క్రింది పూజా సామాగ్రిని సిద్ధం చేసుకోవాలి. అమ్మవారి ప్రతిమ లేదా రాగి/వెండి చెంబు, పసుపు, కుంకుమ, గంధం. అమ్మవారికి నూతన వస్త్రం (రవికె గుడ్డ), అక్షతలు, పూలు (తామర పువ్వులు, చామంతులు, గులాబీలు), మల్లెపూలు. ఇంకా పసుపు దారాలు (తొమ్మిది ముడులు వేసిన నోము దారాలు), గాజులు, అమ్మ వారికి తలగడ, అద్దం, దువ్వెన, కాటుక మొదలైన సౌభాగ్య ద్రవ్యాలు. నైవేద్యాలు పరమాన్నం, అప్పాలు, పులిహోర, పూర్ణాలు, పాయసం, వడలు, పండ్లు (అరటిపండ్లు మొదలైనవి), తాంబూలం (ఆకులు, వక్కలు, దక్షిణ).అలాగే అగర వత్తులు, కర్పూరం, ఆవు నెయ్యి, దీపారాధన కుందులు, వత్తులు, పూజా గంట, హారతి పళ్లెం సిద్ధం చేసుకోవాలి. శుక్రవారం తెల్లవారు జామునే లేచి ఇల్లంతా శుభ్రం చేసి, తలస్నానం ఆచరించి శుభ్రమైన నూతన వస్త్రాలు ధరించాలి.పూజా మందిరంలో లేదా ఇంటికి తూర్పు లేదా ఉత్తర దిశలో పీటను ఏర్పాటు చేసి, దానిపై బియ్యం పోసి దానిపై కలశ స్థాపన చేయాలి. ఆపై రాగి చెంబులో నీరు నింపి, పసుపు, కుంకుమ, గంధం రాసి, మామిడి ఆకులు ఉంచి, దానిపై పసుపు రాసిన కొబ్బరికాయను ఉంచాలి. కలశానికి అష్టదళ పద్మం లేదా లక్ష్మీ దేవి రూపాన్ని అలంకరించాలి. భక్తిశ్రద్ధలతో షోడశోపచార పూజలను నిర్వహించాలి. 'ఓం శ్రీ మహాలక్ష్మ నమః' లేదా అష్టలక్ష్మి నామాలను పఠిస్తూ అమ్మవారికి కుంకుమ పూజ, అక్షతలతో అర్చన చేయాలి. పూజ పూర్తయిన తర్వాత తొమ్మిది ముడులు వేసిన పసుపు దారాన్ని కుడి చేతికి కట్టుకోవాలి (నోము దారం). ముత్తైదువులకు తాంబూలం, రవికె గుడ్డ, పండ్లు ఇచ్చి వాయనం ఇచ్చుకోవాలి. వరలక్ష్మీ దేవి పూజ చేయడం వల్ల ఇంట నిరంతరం అష్టైశ్వర్యాలు వర్ధిల్లుతాయి. ఆర్థిక ఇబ్బందులు తొలగిపోయి లక్ష్మీదేవి నివాసం ఉంటుంది. కుటుంబంలో అందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు చేకూరుతాయి. భర్త దీర్ఘాయుష్షు కోసం, పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం మహిళలు ఈ వ్రతం ఆచరిస్తారు. ముత్తైదువులకు అఖండ సౌభాగ్యం, ధైర్యం, శాంతి లభిస్తాయి. భక్తి భావంతో అమ్మవారిని కొలవడం ద్వారా మనసులో ఉన్న భయాలు తొలగిపోయి సానుకూల శక్తి ప్రసరిస్తుంది. వరలక్ష్మీ వ్రతం కేవలం ఒక పూజ మాత్రమే కాదు ఇది మన సంస్కృతిలో మహిళల గొప్పతనాన్ని, కుటుంబ ఐక్యతను చాటిచెప్పే ఒక సుందరమైన సంప్రదాయం. ఆధ్యాత్మిక భావనతో ప్రతి మహిళ ఎంతో ఉత్సాహంగా జరుపుకునే ఈ పండుగ సమాజం లో శాంతి, ధర్మం, ...ంది

-పెద్దగోళ్ళ భాగ్యలక్ష్మి

# 'రసబలీ' స్వీట్



ఒడియా ప్రసిద్ధ పిండివంటల్లో 'రసబలీ' మిఠాయి ఒకటి. దీన్నెలా చేయాలంటే.. అడుగు భాగం మందంగా ఉన్న పాత్రలో రెండు కప్పుల పాలు పోసి, కాస్త కుంకుమ పువ్వు వేయాలి. సన్న సెగ మీద పాలు సగం అయ్యేవరకూ మరిగించాలి. అందులో అర కప్పు పంచదార వేసి.. అది కరిగాక, పావు చెంచా యాలకుల పొడి వేసి.. కలియ తిప్పి దించేయాలి. మరో పాత్రలో కప్పు పంచదార వేసి.. అది కరిగాక, పావు చెంచా యాలకుల పొడి వేసి.. కలియ తిప్పి దించేయాలి. మరోపాత్రలో కప్పు తురిమిన పనీర్. చెంచా చొప్పున ఉప్మా రవ్వ, గోధుమ పిండి వేసి బాగా కలిపితే.. మెత్తటి పిండిలా తయారవుతుంది. దాన్ని నిమ్మకాయంత భాగాలుగా చేసి, టిక్కీలుగా ఒత్తుకవోఆలి. సైజు, మందం అన్నీ సమానంగా ఉండేట్లు చేసి, కాగుతున్న నూనెలో బంగారు రంగు వచ్చేవరకూ వేయించాలి. వీటిని టిష్యూ పేపర్ మీదికి తీస్తే.. అదనంగా ఉన్న నూనె పీల్చేసుకుంటాయి. ఈ టిక్కీస్‌ను మరిగించిన పాలలో వేయాలి. అరగంట నానితే సరి. తియ్యటి రసబలీ మిఠాయి సిద్ధమైపోతుంది. సులువైన ఈ స్వీటు సూపర్ టేస్టీగా ఉంటుంది. తిని ఆనందించడమే తరువాయి. □

# తెర

## 'రంభ ఊర్వశి మేనక' ఫుల్‌లెంగ్త్ ఎంటర్‌టైనర్: చంద్ర మోహన్ చింతాడ



**ఈ టైటిల్ వెనుక ఉన్న కథ ఏమిటి?**
సక్సెస్ కోసం ప్రతి ఒక్కరం చాలా ఆత్రుతగా ఉంటాం. దాని కోసం ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటాం. ఏదో ఒక సందర్భంలో దేవతలు ప్రత్యక్షమై మన కోరిక తీర్చేస్తే బాగుంటుంది కదా అనే ఫీలింగ్ ప్రతి ఒక్కరికీ ఎప్పుడో ఒకసారి కలుగుతుంది.

**మీ నేపథ్యం గురించి చెప్పండి?**
మాది వైజాగ్. మా నాన్నబీఎస్ఎన్ఎల్‌లో ఎంప్లాయ్. నాకు సినిమాలంటే ఆసక్తి. దర్శకుడు కరుణాకరన్ గారి దగ్గర ఉల్లాసంగా ఉత్సాహంగా, డార్లింగ్‌కు పనిచేశాను.

**ఈ కథ నేపథ్యం ఏమిటి?**
ఒక వ్యక్తి తనకు అనుకున్నది జీవితంలో సాధించాలను కుంటాడు. హీరో కావాలనేది అతని కోరిక. అందుకోసం హైదరాబాద్, చెన్నై వెళ్లి ప్రయత్నించాలి. కానీ తాను ఉన్న ఊర్లోనే ఉండి హీరో అవ్వాలని అనుకుంటాడు.

**అల్లరి నరేష్‌కి కథ చెప్పినప్పుడు ఆయన ఎలా ఫీలయ్యారు?**
నరేష్‌కి ఈ కథ చాలా నచ్చింది. అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైన్‌మెంట్‌గా ఫీలయ్యారు. ఇందులో అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ ఉంటాయి. కాకపోతే ఈ సినిమాలో దాదాపు 25 నిమిషాల ఎపిసోడ్‌ను నేను ఇప్పటివరకు ఎక్కడా రివిల్ చేయలేదు. అది ఆడియన్స్‌కు బోనస్‌గా ఉంటుంది.నరేష్ నుంచి ప్రేక్షకులు కోరుకునే అన్ని ఎలిమెంట్స్ ఇందులో ఉంటాయి. ఆయన క్యారెక్టర్‌పై ఫుల్ లెంగ్త్ ఎంటర్‌టైన్‌మెంట్ ఉంటుంది.

**వెన్నెలకిషోర్ క్యారెక్టర్ ఎలా ఉండబోతుంది?**
వెన్నెల కిషోర్ గారి క్యారెక్టర్ చాలా ఎంటర్‌టైనింగ్‌గా ఉంటుంది. అలాగే సీనియర్ నరేష్ గారు, శ్రీనివాస్ రెడ్డి గారు వంటి చాలా అనుభవం ఉన్న నటులు ఇందులో ఉన్నారు. అందరూ అద్భుతంగా పెర్ఫార్మ్ చేశారు.

**హీరోయిన్స్ గురించి?**
సురభి, రాశి సింగ్, ప్రిషా, విష్ణుప్రియ అందరూ తమ పాత్రలకు చాలా బాగా సరిపోయారు. వాళ్ల స్క్రీన్ ప్రజెన్స్ చాలా బాగుంటుంది.

**మ్యూజిక్ గురించి?**
చేతన్ భరద్వాజ్ నాలుగు అద్భుతమైన ట్యూన్స్ ఇచ్చారు. ఇందులో హీరోయిన్స్, నరేష్ గారి మీద వచ్చే ఒక పాట ఉంటుంది. అది థియేటర్‌లో బద్దలైపోతుంది.

**దర్శకుడిగా మీకు బలమైన జోనర్ ఏమిటి?** నా బలం కామెడీ. నా తొలి సినిమా ఫాంటసీ కామెడీ కావడం చాలా హ్యాపీగా ఉంది.

## 'జనవరి 12 విడుదల' సంక్రాంతికి రిలీజ్



విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్, దర్శకుడు అనిల్ రావిపూడి క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, జీ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి. వెంకటేష్, కళ్యాణ్‌రామ్ ఫస్ట్ లుక్స్ ఇప్పటికే సినిమాపై క్యూరియాసిటీ పెంచగా, తాజాగా మేకర్స్ టైటిల్‌ను రివీల్ చేశారు. టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోను లెజెండరీ దర్శకుడు ఈవీవీ సత్యనారాయణకు ట్రిబ్యూట్ ఇస్తూ, ఆయన తెరకెక్కించిన 'అప్పుల అప్పారావు'లోని ఓ పాపులర్ కామెడీ సీక్వెన్స్‌ను గుర్తు చేసేలా మొదలుపెట్టారు. ఈవీవీ సత్యనారాయణ అనిల్ రావిపూడికి ఎంతటి ఇన్‌స్పిరేషన్ అనేది తెలిసిందే.వెంకటేష్, కళ్యాణ్ రామ్, కీర్తి సురేష్, కృతి శెట్టి కలిసి అనిల్ రావిపూడి దగ్గరకు వెళ్లి సినిమా టైటిల్ ఏంటని అడుగుతారు. వెంటనే అనిల్ రావిపూడి 'జనవరి 12 విడుదల' అని చెప్పడంతో వాళ్లంతా కన్ఫ్యూజ్ అవుతారు. తాము రిలీజ్ డేట్ గురించి కాదు.. సినిమా టైటిల్ గురించి అడుగుతున్నామని క్లారిటీ గా చెప్తారు. మొత్తం వీడియోలో అనిల్ రావిపూడి మార్క్ కామెడీ, టైమింగ్ స్పష్టంగా కనిపిస్తుంది. అదే సమయంలో ఈ మల్టీస్టారర్ ఎలా ఉండబోతుందో కూడా ఓ ఫన్‌ఫుల్ గ్లింప్స్ ఇచ్చింది. మరో ఆసక్తికరమైన విషయమేంటంటే.. టైటిల్‌తో పాటు సినిమా రిలీజ్ డేట్‌ను కూడా మేకర్స్ ఖరారు చేశారు. 2027 జనవరి 12న సంక్రాంతి కానుకగా ఈ చిత్రం థియేటర్లలోకి రానుంది. సంక్రాంతి సీజన్ అనిల్ రావిపూడికి బాగా కలిసొచ్చిన సీజన్. పండుగ సీజన్‌లో ఆయన సినిమాలు మంచి కమర్షియల్ సక్సెస్ అందుకున్నాయి.ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా, సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

## 'విశ్వనాథ్ సన్స్'కు అద్భుత స్పందన: వెంకీ అట్లూరి



**విశ్వనాథ్ సన్స్ సినిమాకి ఈ స్థాయి స్పందన రావడం ఎలా అనిపిస్తుంది?**
చాలా చాలా సంతోషంగా ఉంది. మేము ఊహించిన దానికంటే అద్భుతమైన స్పందన లభిస్తోంది.

**ఈ కథ వినగానే సూర్య రియాక్షన్ ఏంటి?**
కథ వినగానే సూర్య గారికి చాలా నచ్చేసింది. నిజానికి ఆయన ఒక ఫ్యామిలీ స్టోరీ కోసం చూస్తున్నారు. అదే విషయం నాకు చెప్పారు. ఈ కథ నా దగ్గర అప్పటికే సిద్ధంగా ఉండటంతో, ఆయనకు వినిపించాను. సూర్య కి కథ చాలా నచ్చింది.

**త్రివిక్రమ్‌రచనలో ఉండే బలం, మీ రచనలో కనిపిస్తుంది అనే ప్రశంసలు రావడం ఎలా ఉంది?**
నేను సినీ పరిశ్రమలోకి రావడానికి స్ఫూర్తి నింపినది మణిరత్నం, త్రివిక్రమ్. అలాంటిది త్రివిక్రమ్‌తో నన్ను పోల్చడం అనేది గౌరవంగా భావిస్తున్నాను.

**అసలు విశ్వనాథ్ సన్స్ కథ ఎలా పుట్టింది?**
వయసు వ్యత్యాసం ఉన్న బంధంపై కథ రాయాలని మొదట అనుకున్నాను. 40 ఏళ్ళు వచ్చినా పెళ్ళి చేసుకోకపోవడానికి బలమైన కారణం ఉండాలి. దాని చుట్టు అల్లుకున్న కథ ఇది. నా దృష్టిలో మనుషులు చెడ్డవారు కాదు. పరిస్థితుల వల్ల ఒక్కోలా ప్రవర్తిస్తూ ఉంటారు. అదే విషయాన్ని సినిమాలో చెప్పడం జరిగింది.

**విశ్వనాథ్ సన్స్ చూసి త్రివిక్రమ్ గారి రియాక్షన్ ఏంటి?**
త్రివిక్రమ్‌కి సినిమా చాలా నచ్చింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో రూపొందే సినిమాల నిర్మాణంలో ఆయన భాగస్వామిగా ఉన్నారు కాబట్టి, దాదాపు అన్ని సినిమాలు చూస్తుంటారు. అయితే త్రివిక్రమ్ సినిమా చూసిన తర్వాత చిన్న చిన్న మార్పులు చేర్పులు సూచిస్తూ ఉంటారు.

**ఈ సినిమా విషయంలో ఎడిటింగ్ ప్రభావం ఎంత ఉంది?**
నా దృష్టిలో ఏ సినిమా అయినా ఎడిట్ టేబుల్ మీద బెటర్ అవుతుంది.

**తమిళ వెర్షన్ లో షూట్ చేశారు కానీ, తెలుగులోనే ఎక్కువ వసూళ్లు వస్తుండటంపై మీ అభిప్రాయం?**
సూర్య మార్కెట్ ను దృష్టిలో ఉంచుకొని తమిళంలో చిత్రీకరించాము. తెలుగు రాష్ట్రాలతో పోలిస్తే తమిళనాడులో థియేటర్ల సంఖ్య తక్కువ. టికెట్ ధరలలో కూడా వ్యత్యాసం ఉంది. అందుకే అక్కడ వసూళ్లు తక్కువ వచ్చాయని అనిపిస్తుంది. కానీ, మన దగ్గరతో పోలిస్తే అక్కడ లాంగ్ రన్ ఉంటుంది.

## 'EPIC – FIRST SEMESTER' నుంచి హృదయాలను హత్తుకునే మూడో గీతం 'మనసా వాచా'



ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న 'నిశిది - నుంచి మధురమైన మూడో పాట విడుదల యువతను ఆకట్టుకునే యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న 'EPIC – FIRST SEMESTER' నుంచి మూడో పాట 'మనసా వాచా' విడుదలైంది. ప్రేమ, విరహం, అనురాగం వంటి సున్నితమైన భావోద్వేగాలను హృదయాన్ని హత్తుకునేలా ఆవిష్కరించే ఈ గీతం శ్రోతలను విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రముఖ సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ స్వరపరిచిన ఈ పాటకు దిగ్గజ గాయనీమణి కె. ఎస్. చిత్ర, ప్రముఖ గాయకుడు ఎస్. పి. చరణ్ తన గాత్రంతో ప్రాణం పోశారు. హేషమ్ అబ్దుల్ వహాబ్ మధురమైన స్వరకల్పనకు చిత్ర, చరణ్‌ల భావోద్వేగభరితమైన గానం తోడవడంతో మనసా వాచా ఓ అద్భుతమైన సంగీత అనుభూతిగా నిలిచింది.శ్రీ హర్ష ఈమని సాహిత్యం అందించిన ఈ పాటలో కథానాయకులు ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య పోషించిన పాత్రల మధ్య ప్రేమ, అనుబంధం, వారి మనసుల్లో చోటుచేసుకునే భావోద్వేగాలను ఎంతో అందంగా ఆవిష్కరించారు. పాటకు అనుగుణంగా తెరకెక్కించిన విజువల్స్ కూడా ఆ భావోద్వేగాలకు మరింత బలాన్ని చేకూరుస్తూ, వారి ప్రేమ ప్రయాణంలోని సున్నితమైన కోణాలను ఆవిష్కరిస్తున్నాయి.

## 'అమీర్ లోగ్' లాంటి చిత్రం ఇప్పటి వరకు రాలేదు: రమణా రెడ్డి సోమ



'అవ్వల్ నంబర్ ప్రొడక్షన్స్' బ్యానర్‌పై మాధవి రెడ్డి సోమ నిర్మించిన తొలి చిత్రం 'అమీర్ లోగ్'. ఈ మూవీకి రమణా రెడ్డి సోమ దర్శకత్వం వహించారు. ఈ సినిమాకి మనోహర్ రెడ్డి మంచురి సహ నిర్మాతగా వ్యవహరించారు. ఈ చిత్రంలో లీది హరి, మనోజ్, శశిధర్ ప్రధాన పాత్రల్లో నటించగా.. వేధా జలంధర్, రావణ్ నిట్టూరు, విశ్వేందర్ రెడ్డి, సాయోగి కీలక పాత్రలు పోషించారు. రానా దగ్గుబాటి సంస్థ 'స్పిరిట్ మీడియా' ఈ మూవీని తెలుగులో ఆగస్ట్ 21న గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోంది. దర్శకుడు రమణా రెడ్డి సోమ మాట్లాడుతూ.. .. అమీర్ లోగ్ సినిమాని ఇప్పటికి చాలా సార్లు చూశాం. కచ్చితంగా హిట్టు బొమ్మ. ఇప్పటి వరకు ఇలాంటి చిత్రం రాలేదు. అలాంటి ఓ గొప్ప అటెంప్ట్ నేను చేశాను. ప్రీమియర్లకు వచ్చిన రెస్పాన్స్ చూస్తే మేం హిట్ కొట్టేశాం, మేం అనుకున్నది సాధించేశాం అని అర్థమైంది. నిర్మాత మాధవి రెడ్డి సోమ మాట్లాడుతూ.. .. నన్ను ముందు నిలబెట్టి నడిపిస్తున్న నా భర్త రమణకి థాంక్స్. ఆయనే రైటర్, డైరెక్టర్, నిర్మాతగా అన్నీ పనులు చూసుకున్నారు. ఆయన ఈ అమీర్ లోగ్‌సినిమాని అందమైన పెయింటింగ్‌గా తీర్చి దిద్దారు. నటుడు లీది హరి మాట్లాడుతూ.. అమీర్ లోగ్ సినిమా నాకు మంచి అవకాశాన్ని, కుటుంబాన్ని, అనుభవాన్ని ఇచ్చింది.

## సంగీత్ శోభన్, ప్రణయ్ రావు, సాహు గారపాటి కొత్త సినిమా



సక్సెస్ ఫుల్ నిర్మాత సాహు గారపాటి షైన్ స్క్రీన్స్ బ్యానర్ వరుసగా ఆసక్తికరమైన ప్రాజెక్ట్స్ తో సర్ప్రైజ్ చేస్తోంది. ఇటీవల మలయాళంలోకి అడుగుపెట్టి బ్లాక్‌బస్టర్ అందుకున్న ఈ సంస్థ... అదే సమయంలో కంటెంట్ ఉన్న కథలకు కూడా ప్రాధాన్యత ఇస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా మరో ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్‌ను అనౌన్స్ చేసింది.ఈ సినిమాలో ప్రస్తుతం వరుస విజయాలతో దూసుకుపోతున్న టాలెంటెడ్ హీరో సంగీత్ శోభన్ లీడ్ రోల్‌లో నటించనున్నారు. ప్రణయ్ రావు ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. గతంలో ఆయన 'సాహో' సినిమాకు అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేయడంతో పాటు 'మ్యాడ్', 'మ్యాడ్ స్క్వేర్' చిత్రాలకు అడిషనల్ స్క్రీన్‌ప్లే వర్క్ చేశారు. శ్రీమతి అర్చన ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు.షైన్ స్క్రీన్స్ ప్రొడక్షన్ నంబర్ 15గా తెరకెక్కుతున్న ఈ సినిమా.. సంగీత్ శోభన్ హీరోగా నటిస్తున్న 5వ చిత్రం కావడం విశేషం. హీరో పుట్టినరోజు సందర్భంగా ఈ ప్రాజెక్ట్‌ను మేకర్స్ అనౌన్స్ చేశారు. సంగీత్ శోభన్‌ను ఇప్పటివరకు చూడని కొత్త తరహా పాత్రలో చూపించబోతున్న ఈ సినిమాకు ప్రణయ్ రావు ఆసక్తికరమైన కథను సిద్ధం చేశారు.

## 'ఇరుముడి' తప్పకుండా ఇష్టపడతారు: బేబీ నక్షత్ర



**ఇరుముడి అవకాశం ఎలా వచ్చింది?**
దర్శకుడు శివ నిర్వాణ ఇన్‌స్టాగ్రామ్‌లో నా రీల్స్ చూసి ముందుగా మా అమ్మగారిని సంప్రదించారు. ఇరుముడి నా తొలి తెలుగు సినిమా కావడం చాలా ఆనందంగా ఉంది.

**ఇరుముడి అయ్యప్ప స్వామి నేపథ్యంలో ఉన్న కథ కదా? మీది కేరళ. మీరు ఎప్పుడైనా శబరిమల వెళ్లారా?**
ఒకసారి శబరిమల వెళ్లాను. రవితేజతో వర్క్ చేయడం చాలా హ్యాపీగా అనిపించింది. ఆయన నాతో చాలా ఫ్రెండ్లీగా ఉంటారు. ఆయన అంటే నాకు చాలా ఇష్టం.

**ఇరుముడిలో మీ పాత్ర ఎలా ఉండ బోతుంది?**
ఇందులో నా పాత్ర పేరు మణికంఠ. నేను రవితేజ కూతురిగా కనిపించబోతున్నాను.

**మీరు చిన్న వయసులోనే పృథ్వీరాజ్ , శివరాజ్ కుమార్ రవితేజ లాంటి పెద్ద హీరోలతో పనిచేశారు కదా? ఎలా అనిపిస్తుంది?** చాలా హ్యాపీగా ఉంది. ఈ సందర్భంగా మా అమ్మకి థాంక్స్ చెప్తున్నాను.

**సినిమాలను, చదువును ఎలా బ్యాలెన్స్ చేస్తున్నారు?** ముఖ్యంగా మా టీచర్స్ నాకు చాలా సపోర్ట్ చేస్తున్నారు. మా పేరెంట్స్, టీచర్స్ సపోర్ట్‌తోనే నేను సినిమాలుచేయగలుగుతున్నాను.

**ఇరుముడిలో మీకు ఇష్టమైన పాట ఏమిటి?**
ఇరుముడ్డిలో పాటలన్నీ నాకు ఇష్టం. కాకపోతే యాలో యాలోపాట నా ఫేవరెట్.

**శివ నిర్వాణ దర్శకత్వంలో పనిచేయడం ఎలా అనిపించింది?**
శివ నిర్వాణ సపోర్ట్‌తోనే ఈ సినిమాను చాలా కాన్ఫిడెంట్‌గా చేయగలిగాను.

21-8pg8exHMNWJQE:21-8pg8exHMNWJQE.qxd 8/21/2026 12:25 AM Page 1



## రోడ్డు ప్రమాదంలో భార్య,భర్త దుర్మరణం




**వినుకొండ,ఆగస్ట్20,ప్రభాతవార్త:** పట్టణంలోని వెల్లటూరు రోడ్డులోని హనుమాన్ నగర్ వద్ద గురువారం తెల్లవారుజామున 5 గంటలకు ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్‌పై వెళ్తున్న భార్యాభర్తలను వెనుక నుంచి వచ్చిన బొలెరో వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మృతులను వల్లూరి రవి (58),వల్లూరి సావిత్రి (55) గా పోలీసులు గుర్తించారు. మృతురాలు సావిత్రి ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఇంట్లో వంట మనిషిగా పనిచేస్తున్నట్లు తెలిసింది. మిద్దె బావి కాలనీలోని కూతురి ఇంటి నుంచి బైక్‌పై వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బొలెరో వాహనం వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో ఇద్దరూ సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. విషయం తెలుసుకున్న చీఫ్‌విప్ జీ.వీ.,ఆయన సతీమణి లీలావతి దంపతులు మృతుల కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. మృతుల పార్థివదేహాలకు ఘన నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు.

# భక్తుల భద్రతకు రోబోట్ డాగ్ వినియోగం

**తిరుమల,ఆగస్టు 20ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలం అడవులు విస్తరించిన తిరుమల అటవీ ప్రాంతాల్లో రియల్‌టైమ్ మానిటరింగ్‌కు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంవినియోగించుంది. ఇందుకోసం అడవిలో వన్యప్రాణుల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంతోపాటు భక్తుల భద్రతను మరింత పటిష్టం చేసేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించే దిశగా టిటిడి చర్యలు చేపడుతోంది. గురువారం తిరుమలలోని పద్మావతి అతిథి గృహం వద్ద క్వాడ్రుపెడ్ రోబోట్ (నాలుగు కాళ్ల రోబోట్ డాగ్) పనితీరును టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి అధికారులతో కలిసి పరిశీలించారు. అటవీ ప్రాంతాల్లో మనుషులు వెళ్ళడానికి ఇబ్బందికరమైన, ప్రమాదకరమైన ప్రాంతాల్లో వన్యప్రాణుల కదలికలను పర్యవేక్షించేందుకు ఈ రోబోట్‌ను వినియోగించే అవకాశాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ రోబోట్‌లో ఆప్టికల్ కెమెరా, థర్మల్ ఇమేజింగ్ కెమెరా, 360 డిగ్రీల లైడార్, వివిధ సెన్సార్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తదితర ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉన్నాయి. వీటి సహాయంతో చీకటి, పొగమంచు వంటి పరిస్థితుల్లోనూ వన్యప్రాణుల కదలికలను గుర్తించి



పర్యవేక్షించే అవకాశం ఉంటుంది. రోబోట్‌లోని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వ్యవస్థ పెద్ద జంతువులు, మనుషులు, వాహనాలు,పశువులను గుర్తించి వర్గీకరించే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. వన్యప్రాణుల కదలికలను గుర్తించినప్పుడు జియోట్యాగ్డ్ అలర్ట్‌ను పంపడంతోపాటు లైవ్ వీడియో, థర్మల్ ఫీడ్‌ను కంట్రోల్ రూమ్, పెట్రోలింగ్ సిబ్బందికి అందించే విధంగా వ్యవస్థను వినియోగించే అవకాశాలను పరిశీలించారు. **కాలినడకమార్గంలో మరింత భద్రత:** ముఖ్యంగా అలిపిరి-తిరుమల కాలిబాటకు ఆనుకుని ఉన్న అటవీ ప్రాంతాల్లో చిరుతలు, ఇతర వన్యప్రాణుల సంచారాన్ని ముందుగానే గుర్తించి భక్తులను అప్రమత్తం చేయడంతోపాటు, అటవీ, విజిలెన్స్, భద్రతా సిబ్బంది వేగంగా స్పందించేందుకు ఈ సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగపడుతుంది. న్యప్రాణులభక్తులరాకపోకల ప్రాంతం వైపు వచ్చినప్పుడు రోబోట్‌లోని సౌండ్, లైట్ యూనిట్లను ఉపయోగించి ఎలాంటి భౌతిక తాకిడి లేకుండా వాటిని తిరిగి అటవీ ప్రాంతం వైపుమళ్లించే అవకాశాన్ని కూడాపరిశీలించారు. తద్వారా మనుషులు-వన్యప్రాణుల మధ్య ప్రత్యక్ష ఘర్షణకు అవకాశముండదు. ఈ రోబోట్ ఇప్పటికే అమల్లో ఉన్న కెమెరా ట్రాప్‌లు, ఫుట్ పెట్రోలింగ్, అటవీ సిబ్బంది నిఘా వ్యవస్థలకు ప్రత్యామ్నాయంగా కాకుండా, వాటికి అదనంగా మొబైల్ మానిటరింగ్ వ్యవస్థగా పనిచేసేలా వినియోగించే ఆస్కారం ఉంటుంది. అవసరాన్ని బట్టి వన్యప్రాణుల కదలికలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో దీనిని త్వరగా మోహరించే వీలుంటుంది. వన్యప్రాణుల కదలికలకు సంబంధించిన సమాచారాన్ని విశ్లేషించడం ద్వారా వాటి సంచారాన్ని మరింత సమర్థవంతంగా అర్థం చేసుకుని, అవసరమైన ప్రాంతాల్లో సిబ్బంది

## రాంగ్ రూట్లో వెళ్తున్న ట్రాక్టర్‌ని ఢీకొని ఒకరు మృతి

### ఇద్దరికీ తీవ్ర గాయాలు

**కావలి, (నెల్లూరు) ఆగష్టు 20, ప్రభాతవార్త:** రాంగ్ రూట్లో వెళుతున్న ట్రాక్టర్‌ను మోటార్ బైక్ ఢీకొని కావలి చంద్రబాబునగర్‌కు చెందిన గంజాం చందు(17) మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన కావలి డంపింగ్ యార్డ్ వద్ద రహదారిపై జరిగింది. కావలి టూ టౌన్ పోలీసుల సమాచారం మేరకు కావలి చంద్రబాబు నగర్ కు చెందిన గంజాం చందు, నాగులూరు బాబులు కావలి రూరల్ మండలం మున్నంగి దీన్నె గ్రామానికి చెందిన మొగిలి బబ్లు, లు ఎలక్ట్రికల్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవారిని తెలియజేశారు. గురువారం వీరి ముగ్గురు మోటార్ బైక్ పై కావలి రూరల్ మండలం రుద్రకోట గ్రామానికి బట్టలను తెచ్చుకోవడానికి వెళుతుండగా సూరా అంజిరెడ్డి ట్రాక్టర్లో చెత్తను డంపింగ్ యార్డ్ లో పడవేసి రాంగ్ రూట్లో రావడం జరిగిందన్నారు. బైక్ పై వస్తున్న ముగ్గురు అతివేగంగా ట్రాక్టర్ ను ఢీకొనడంతో గంజాం చందు అక్కడికక్కడే మృతి చెందడం జరిగిందన్నారు. మొగిలి బాబ్జి, నాగులూరు బాబులకు తీవ్ర గాయాలు కావడంతో ప్రథమ చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తీసుకువెళ్లడం జరిగిందన్నారు. అనంతరం ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ హాస్పిటలకు తరలించడం జరిగిందన్నారు. కావలి వన్ టౌన్ ఇన్స్పెక్టర్ రంగనాథ్ గౌడ్, ఎస్సై సుమన్ లు సంఘటన స్థలాన్ని పరిశీలించడం జరిగింది. వన్ టౌన్ ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మద్యం టెండర్ల కేసులో సిట్ దాఖలు చేసిన పీటీ వారెంట్ వాపస్

### కాసిరెడ్డి, వాసుదేవరెడ్డి వారెంట్‌ను తిరస్కరించిన ఏసీబీ కోర్టు

**విజయవాడ.ఆగస్టు 20,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం రవాణా టెండర్లలో జరిగిన అవకతవకల కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందానికి (సిట్) చుక్కెదురైంది. ఈ కేసులో నిందితులుగా ఉన్న కాసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, దొంతిరెడ్డి వాసుదేవ రెడ్డిలపై సిట్ అధికారులు దాఖలు చేసిన ప్రొడక్షన్ కమ్ ట్రాన్సిట్ (పీటీ) వారెంట్‌ను విజయవాడ ఏసీబీ కోర్టు తిరస్కరించింది.ఈ కేసులో కాసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, దొంతిరెడ్డి వాసుదేవ రెడ్డి, కారుమూరి సునీల్‌ను సిట్ నిందితులుగా చేర్చింది. అయితే, వీరిని అంతకుముందే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు. గతంలో సిట్ అధికారులు వీరిని పీటీ వారెంట్‌పై విజయవాడ ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. అయితే, తమ రిమాండ్ చెల్లదంటూ రాజశేఖర్ రెడ్డి, వాసుదేవ రెడ్డి హైకోర్టును ఆశ్రయించగా, వారికి అనుకూలంగా తీర్పు వచ్చింది. ఈ నేపథ్యంలో, రెండు రోజుల క్రితం సిట్ అధికారులు మళ్లీ కొత్తగా పీటీ వారెంట్‌ను దాఖలు చేశారు. దీనిని పరిశీలించిన ఏసీబీ కోర్టు, ఆ వారెంట్‌ను తిరస్కరిస్తూ వెనక్కి పంపింది.ఇదే కేసుకు సంబంధించి మరో ముగ్గురు నిందితులు కె. ధనుంజయ రెడ్డి, పి. కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్ప బుధవారం విజయవాడ ఏసీబీ కోర్టు ఎదుట హాజరయ్యారు. సమన్లు అందిన తర్వాతే విచారణకు హాజరు కావాలని జ్యుడీషియల్ అధికారి ఎల్. తేజోవతి వారికి సూచించారు.

# పోలీస్ వాహనంలో గంజాయి, మద్యంపై ఉన్నతాధికారుల దర్యాప్తు

- ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ హార్షవర్ధన్ రాజు అద్దంకి, సంతమాగులూరు సర్కిల్‌లలో ఆకస్మిక పర్యటన
- సంతమాగులూరు, అద్దంకిలో ఎస్సైలను ఏకాంతంగా విచారించిన ఐ.జి.
- ఈర్లకొండ ఆలయ పూజారి, వంట మహిళను కూడ విచారణ
- ఈర్లకొండ ప్రాంతాన్ని పరిశీలించిన ఐ.జి.,ఎస్.పి.
- కొమ్మాలపాడు మీదుగా అద్దంకి చేరుకున్న ఇరువురు అధికారులు



**అద్దంకి, ఆగష్టు 20, ప్రభాతవార్త :** అద్దంకి మండలం శంకవరప్పాడు వద్ద ఈనెల 16వ తేదీ సాయంత్రం సంతమాగులూరు, బల్లికురవ ఎస్సైలు నాగమల్లేశ్వరరావు, నాగరాజులు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురికావడం, అదే కారులో గంజాయి మూటలు, మద్యం బాటిళ్లు లభించిన వ్యవహారంపై పోలీస్ శాఖ ఉన్నతాధికారులు దర్యాప్తు మరింత వేగంగా జరుగుతుంది. ఈ నేపథ్యంలో గురువారం గుంటూరు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ట త్రిపాఠి, ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజులు ఆకస్మికంగా సంతమాగులూరు చేరుకోవడం, సంబంధిత ఎస్సైలను విడివిడిగా విచారించడం, అనంతరం ఈర్లకొండ ప్రాంతాన్ని పరిశీలించడం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ఎస్సై నాగమల్లేశ్వరరావును సంతమాగులూరు పోలీస్ స్టేషన్‌లోనే ఏకాంతంగా విచారించినట్లు సమాచారం. ఘటనకు ముందు జరిగిన పరిణామాలు, పోలీస్ పార్టీ కదలికలు, ఈర్లకొండకు వెళ్లిన సందర్భం, తిరుగు ప్రయాణం తదితర అంశాలపై ఉన్నతాధికారులు వివరాలు తెలుసుకున్నట్లు తెలుస్తోంది.అదే విధంగా బల్లికురవ ఎస్సై నాగరాజును అద్దంకి సర్కిల్ కార్యాలయానికి పిలిపించి ఉన్నతాధికారులు గోప్యంగా విడివిడిగా విచారించినట్లు సమాచారం. ఇద్దరు ఎస్సైలను ఒకేసారి కాకుండా వేర్వేరుగా విచారించడం ఈ దర్యాప్తులో కీలక అంశంగా మారింది.ఇది ఇలా వుండగా ప్రధానంగా ఈర్లకొండలోని ఆలయ పూజారి శ్రీనివాసరావును, అక్కడ వంట చేసిన మహిళ లక్ష్మిని కూడ సంతమాగులూరుకు పిలిపించి, ఐ.జి. వీరిద్దరితో కూడ విడి విడిగా మాట్లాడినట్లు తెలుస్తుంది. ఐజీ సర్వ శ్రేష్ట త్రిపాఠి, ఎస్పీ హార్షవర్ధన్ రాజులు బల్లికురవ మండలం కొనిదెన పంచాయతీలోని ఈర్లకొండను సందర్శించి, అక్కడి పరిస్థితులను పరిశీలించినట్లు తెలుస్తోంది. మీడియాలో పోలీస్ పార్టీ జరిగిన ప్రదేశంగా ప్రధానంగా ప్రస్తావనకు వచ్చిన ఈ ప్రాంతంలో ఉన్నతాధికారులు స్వయంగా పరిస్థితులను పరిశీలించడం చర్చనీయాంశంగా మారింది. ఈ పర్యటన అత్యంతం గోప్యంగా సాగింది. మీడియా ప్రతినిధులు అధికారుల పర్యటన వివరాల కోసం ప్రయత్నించినప్పటికీ ఎలాంటి అధికారిక సమాచారం అందుబాటులోకి రాలేదు. ఈర్లకొండ నుండి కొమ్మాలపాడు మీదుగా అద్దంకి-నార్కెట్‌పల్లి హైవే నుండి అద్దంకి చేరుకున్న ఉన్నతాధికారులు అద్దంకి సర్కిల్ కార్యాలయంలో కొంతసేపు ఉన్నారు. అక్కడ ఎస్సై నాగరాజుతో పాటు సంబంధిత అధికారుల నుంచి మరిన్ని వివరాలు సేకరించినట్లు తెలుస్తోంది. అనంతరం ఇరువురు ఉన్నతాధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ ఘటనరకు సంబంధించి 16వ తేది రాత్రి దర్శి డీఎస్పీ బాలమురళీకృష్ణ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈర్లకొండ వద్ద పూజలు ముగించుకుని అద్దంకి వైపు వస్తున్న ఎస్సైలు శంకవరప్పాడు సమీపంలో అనుమానాస్పదంగా కనిపించిన ఓ వ్యక్తిని ప్రశ్నించేందుకు కారు ఆపగా, అతను మోటార్‌బైక్‌పై ఉన్న మూటను కిందపడేసి పరారైనట్లు తెలిపారు. ఆ మూటలో గంజాయి, మద్యం బాటిళ్లు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు.అయితే మరుసటి రోజు సోమవారం జిల్లా ఎస్పీ హార్షవర్ధన్ రాజు అద్దంకి సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించి కారులో లభించిన గంజాయి, మద్యం బాటిళ్లు గత కేసుల్లో సీజ్ చేసినవని, వెల్లడించారు. ఈ రెండు ప్రకటనల మధ్య కనిపించిన వ్యత్యాసం ఇప్పటికే ప్రజల్లో పలు సందేహాలకు కారణమైంది. ఈ సంఘటన రాజకీయంగా కూడ ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ ప్రధాన అంశంగా తీసుకుంది. పోలీసులే గంజాయి, మద్యం విక్రయిస్తున్నారంటూ ఆ పార్టీ నేతలు తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రకాశం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి చింతలపూడి అశోక్‌కుమార్ ఒంగోలులో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఈ వ్యవహారంపై పలు ఆరోపణలు చేయడం, తన వద్ద ఆధారాలు ఉన్నాయంటూ ఫోటోలు ప్రదర్శించడం మరింత చర్చకు దారితీసింది. ప్రధానంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైతం ఈ అంశాన్ని సామాజిక మాధ్యమాల్లో, పాత్రికేయుల సమావేశాల్లో ప్రస్తావించడం ఈ వ్యవహారం రాష్ట్రస్థాయిలో రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. గురువారం రాష్ట్ర శాసనమండలిలో బొత్స సత్యనారాయణ కూడ ఈ అంశాన్ని ప్రస్తావించారు. ఈర్లకొండ పరిశీలన మరింత ఆసక్తిని రేకెత్తించింది. ఈ నేపథ్యంలో ఐజీ సర్వ శ్రేష్ట త్రిపాఠి, ఎస్పీ హార్షవర్ధన్ రాజు స్వయంగా రంగంలోకి దిగి ఎస్సైలు నాగమల్లేశ్వరరావు, నాగరాజులను వేర్వేరు ప్రాంతాల్లో, విడివిడిగా ఏకాంతంగా విచారించడం ఒక ఎత్తైయితే, పూజారి, వంట మనిషిని ప్రత్యేకంగా విచారించడం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ఉన్నతాధికారులు ఎస్సైలను ఏ అంశాలపై ప్రశ్నించారు? ఈర్లకొండలో ఏమి పరిశీలించారు? దర్యాప్తులో ఇప్పటివరకు ఏమైనా కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయా? తదుపరి ఎలాంటి చర్యలు తీసుకోనున్నారు? అనే అంశాలపై పోలీస్ శాఖ నుంచి అధికారికంగా ఎలాంటి వివరాలు వెల్లడికాలేదు. శంఖవరప్పాడు సంఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైన ఈ నేపద్యంలో పోలీస్ ఉన్నతాధికారులు తాజాగా గోప్య దర్యాప్తు, అనంతరం ఏమి జరగనున్నదనే పలువురులో ఉత్కంటతను రేపుతుంది.



## బంగ్లాదేశ్ కొత్త అధ్యక్షుడిగా మీర్జాఫఖ్రుల్ ఇస్లాం ఆలంగీర్ ఎన్నిక

**ఢాకా, ఆగస్టు 20:** బంగ్లాదేశ్‌లో దాదాపు 35 ఏళ్ల తర్వాత జరిగిన తొలి పోటీ అధ్యక్ష ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ సీనియర్ నేత మిర్జా ఫఖ్రుల్ ఇస్లాం అలంగీర్ విజయం సాధించారు. గురువారం జరిగిన ఎన్నికల్లో ఆయన దేశ 23వ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. మిర్జా ఫఖ్రుల్‌కు 255 ఓట్లు రాగా లిబరల్ డెమొక్రటిక్ పార్టీ అధ్యక్షుడు, జమాత్‌ఎఇస్లామీ నేతృత్వంలోని 11 పార్టీల ప్రతిపక్ష కూటమి అభ్యర్థి కల్నల్ ఒలి అహ్మద్‌కు 88 ఓట్లు లభించాయి. ఈ వివరాలను చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఏఎంఎం నసీర్ ఉద్దీన్ వెల్లడించారు. అధ్యక్ష ఎన్నికల్లో ఓటు వేసేందుకు మొత్తం 349 మంది పార్లమెంట్ సభ్యులు అర్హత కలిగి ఉండగా 343 మంది తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. మరో ఆరుగురు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాతీయ పార్లమెంట్ భవనం జాతీయ సంసద్‌లో పోలింగ్ నిర్వహించారు. బిఎన్పీలో అత్యంత సీనియర్ నేతల్లో ఒకరైన ఫఖ్రుల్ ఇస్లాం అలంగీర్ ఇప్పుడు దేశ అత్యున్నత రాజ్యాంగ పదవిని చేపట్టనున్నారు. ఆయన ఎన్నో ఏళ్లుగా ప్రతిపక్ష నేతగా కీలక పాత్ర పోషించారు. బిఎన్పీ తిరిగి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో చోటుచేసుకున్న రాజకీయ పరివర్తనలో భాగంగానే ఫఖ్రుల్ అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు అంతర్జాతీయ వార్తా సంస్థలు పేర్కొన్నాయి. మిర్జా ఫఖ్రుల్ ఇస్లాం అలంగీర్ శుక్రవారం సాయంత్రం బంగభవన్‌లో అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు సమాచారం. సాయంత్రం 7.30 గంటలకు యాక్టింగ్ స్పీకర్ కైసర్ కమాల్ ఆయనతో ప్రమాణం చేయించనున్నారు.

## కేన్సర్ చికిత్స ఔషధ పరిశోధనల్లో ముందడుగు

### మోడెర్నా, మెర్క్ సంస్థల ట్రయల్స్‌లో సత్ఫలితాలు




**న్యూయార్కు, ఆగస్టు 20:** కేన్సర్ చికిత్సలో మరో కీలక ముందడుగు పడినట్లు తెలుస్తోంది. మోడెర్నా, మెర్క్ సంస్థలు అభివృద్ధి చేస్తున్న ఎంఆర్ఎన్ఎ క్యాన్సర్ వ్యాక్సిన్ ఇంటిస్‌మెరాన్ ఆటోజీన్ పై చివరి దశ క్లినికల్ ట్రయల్‌లో సానుకూల ఫలితాలు వచ్చినట్లు ప్రకటించాయి. మెర్క్‌కు చెందిన విస్తృతంగా ఉపయోగించే ఇమ్యూనోథెరపీ కీట్రూడాతో కలిపి ఈ వ్యక్తిగతీ కరించిన కేన్సర్ వ్యాక్సిన్‌ను ఉపయోగించి నప్పుడు, మెలనోమా తిరిగి వచ్చే ప్రమాదాన్ని తగ్గించడంలో ప్రధాన లక్ష్యాన్ని సాధించినట్లు కంపెనీలు వెల్లడించాయి. క్యాన్సర్ శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపించే ప్రమాదానికి సంబంధించిన ద్వితీయ లక్ష్యాన్ని కూడా ఈ కాంబినేషన్ సాధించింది. ట్రయల్‌లో పూర్తిగా శస్త్రచికిత్స ద్వారా తొలగించిన స్టేజ్-2 బినుంచి నాలుగు వరకు ఉన్న మెలనోమా రోగులు మొత్తం 1,137 మంది పాల్గొన్నారు. కాంబినేషన్ చికిత్స తీసుకున్నవారిలో క్యాన్సర్ తిరిగి వచ్చే వరకు వ్యాధి లేకుండా ఉండే కాలంలో గణాంకపరంగా ముఖ్యమైన, వైద్య పరంగా ఆశాజనకంగా మెరుగుదల కనిపిం చినట్లు కంపెనీలు తెలిపాయి. క్యాన్సర్ శరీరంలోని దూర ప్రాంతాలకు వ్యాపించకుండా ఉండే విష యంలో చికిత్స ప్రయోజనం చూపిం చింది. సాధారణ వ్యాక్సిన్లు ప్రధానంగా ఇన్ఫెక్షన్లను నివారించేందుకు రూ పొందిస్తారు. కానీ వ్యక్తి గతీకరించిన క్యాన్సర్ వ్యాక్సిన్లు ఒక్కో రోగి క్యాన్సర్‌కు ఉన్న ప్రత్యేక జన్యు లక్షణాలను ఆధారంగా చేసుకుని రూపొందిస్తారు. క్యాన్సర్ కణితిని శస్త్రచికిత్స ద్వారా తొలగించిన తర్వాత, దానిలోని జన్యు మార్పులను విశ్లేషి స్తారు. ఈ మార్పుల్లో రోగనిరోధక వ్యవస్థ క్యాన్సర్ కణాలను గుర్తించేందుకు ఉపయోగపడే లక్ష్యాలను గుర్తిస్తారు. రోగి కణితిలో కనిపించే ప్రత్యేక జన్యుమార్పుల ఆధారంగా రూపొంది స్తారు. మెలనోమా చికిత్సలో ఇప్పటికే ప్రముఖ ఇమ్యూనోథెరపీగా ఉపయో గిస్తున్నారు. ఇప్పుడు దానికి రోగి కణితి ప్రత్యేక జన్యు లక్షణాల ఆధారంగా రూపొందించిచిన చికిత్సను జోడించడం వల్ల మరింత మెరుగైన ఫలితాలు రావచ్చనే ఆశలు కలిగాయి.

# పెంచలకోనకు రెగ్యులర్ డిప్యూటీ కమీషనర్ నియామకం ఎప్పుడో

- కోట్ల రూపాయిల ఆధాయం వున్న ఆలయానికి ఇన్‌చార్జ్
- పాలకమండలి లేక అభివృద్ధికి బ్రేక్

**రాపూరు, (నెల్లూరు) ఆగష్టు20ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి వారి ఆలయం ప్రతి నిత్యం వేలాది మంది స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులతో,వారికి స్వామి పై వున్న నమ్మకానికి ప్రతికగా వెలుగొందుతుంది. దీంతో పాటు జిల్లాలో డిప్యూటీ కమీషనర్ స్థాయి వున్న దేవాలయం ఇది ఒక్కటే కావడం విశేషం. అయితే ఇటువంటి దేవస్థానం పరిపాలన పట్ల పాలకులు వ్యవహరిస్తున్న తీరుపై భక్తులలో ఆసహనం వ్యక్తం అవుతుంది. ఏడాదికి రూ. 7 నుండి 8 కోట్ల రూపాయిల ఆదాయం వస్తున్నప్పటికి గత 5 నెలలుగా ఈ దేవస్థానానికి రెగ్యులర్ డిప్యూటీ కమీషనర్ లేకపోవడం విశేషం. గతంలో ఇక్కడ డిసిగా వున్న పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డిని ఏప్రిల్ నెలలో బ్రహ్మోత్సవాల ముందుర బదిలీ చేశారు. ఆయన స్థానంలో జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్‌గా పనిచేస్తున్న కొవూరు జనార్ధన్ రెడ్డిని ఇక్కడ ఇన్‌చార్జ్ ఇఓగా నియమించారు. అయితే జనార్ధన్ రెడ్డి ఇప్పటికే జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. దీంతో పాటు జిల్లా కేంద్రమైన నెల్లూరులోని మరో ప్రతిష్టాత్మక ఆలయం శ్రీ రాజరాజేశ్వరీ ఆలయం ఇఓగా కూడా ఆదనపు భాద్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో ఆయన పెంచలకోన ఆలయానికి చుట్టంచూపుగా ఎప్పుడో ఒకసారి శనివారం రోజు మాత్రం కోనకు వచ్చి వెలుతుంటారు. ఆయనకు ఈ ఆలయంతో పాటు జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్‌గా, రాజరాజేశ్వరి ఆలయం ఇఓగా భాద్యతలు నిర్వహించాల్సి వుండటంతో ఆయన కోన దేవస్థానంలో పూర్తిస్థాయిలో విదులు నిర్వహించలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆలయంలోని కింద స్థాయి సిబ్బందిపై పర్యవేక్షణ లోపించడంతో కోనలో కిందస్థాయి సిబ్బంది ఇష్టారాజ్యాంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇప్పటికే 27 నెలలు గడిచిపోయాయి. జిల్లాలో అన్ని ఆలయాలకు పాలకమండలిలు ఏర్పాటు చేసిన ఈ ఆలయంపై పాలకుల చిన్నచూపుతో ఆలయానికి ఇప్పటి వరకు పాలకమండలి ఏర్పాటు కాలేదు.దీంతో కోనలో అభివృద్ధి పనులు సైతం నిలిచిపోయాయి. కోనలో ఎప్పటి నుండో మాస్టర్ ప్లాన్ ద్వారా కోనను అభివృద్ధి చేస్తాం అని చెపుతున్న నాయకుల మాటలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన వుండిపోయాయే తప్ప ఆచరణలో పనులు మాత్రం జరగడం లేదు.దీంతో పాటు పెంచలకోనలోని శ్రీ ఆదిలక్ష్మీ అమ్మవారి ఆలయం పునర్‌నిర్మాణం కోసం రూ.6 కోట్లతో రాష్ట దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణలు సుమారు 6నెలల క్రింతం ఘనంగా శంకుస్థాపన నిర్వహించారు. అయితే ఈ పునర్ నిర్మాణం 6 నెలలుగా కేవలం శిలాఫలకానికే పరిమితం అయ్యింది. కోనలో పాలకమండలి, రెగ్యులర్ ఇఒ లేకపోవడంతో పాలన పూర్తిగా గాడి తప్పినట్లు ఆరోపణలు వున్నాయి. కోనలో వున్న దుకాణాలపై అధికారుల పర్యవేక్షణ లోపించడంతో కోనలో దుకాణదారులు గరిష్ట చిల్లర ధర(యంఆర్‌పి)కంటే అధిక ధరలకు వస్తువులు విక్రయిస్తున్నారన్న ఆరోపణలు భక్తులు నుండి వినవస్తున్నాయి. దూర ప్రాంతల నుండి వచ్చే భక్తులు తప్పని సరి అవసరాల నిమిత్తం వస్తువులు కోనుగోలు సమయంలో అధిక ధరలు చెల్లించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దేవస్థానం ప్రాంగణంలో వున్న దేవస్థాన దుకాణ సముదాయాల్లో యంఆర్‌పి ధరకే విక్రయాలు జరిగేలా చూడాల్సిన అధికారులు వాటిపై దృష్టి సారించడం లేదన్న ఆరోపణలు వున్నాయి. దీంతో పాటు కొన్ని దుకాణాలలో నిషిదిత వస్తువుల అమ్మకాలు కూడా జోరుగా సాగుతున్నయన్న ఆరోపణలు సైతం వున్నాయి. వాహనాల ప్రవేశ రుసుములు సైతం సంబందిత టెండర్ దారులు అధికంగా వసూళ్ళు చేస్తున్నారని భక్తులు అంటున్నారు. ఇదేమిటని ఎవరైనా ప్రశిస్తే తాము అధిక ధరకు టెండర్ పాడుకున్నామని ఇలా హెచ్చు మొత్తం వసూళ్ళు చేయకుంటే తామకు గిట్టుబాటు కాదని వారు అంటున్నట్లు చెపుతున్నారు. దేవస్థానం పార్కింగ్ రుసుము ఏ వాహనానికి ఎంత మేర నిర్ణయించింది అన్న విషయాలను పెద్ద సూచిక భోర్డును ఆలయ ప్రవేశ ద్వారం వద్ద ప్రదర్శించి వాటి రుసుముల మొత్తాన్ని ఆ బోర్డుపై ప్రదర్శించాలని భక్తులు కోరుతున్నారు. ఇప్పటికైనా రాష్ట దేవాదాయ శాఖా అధికారులు వెంటనే స్పందించి కోన ఆలయానికి రెగ్యులర్ డిప్యూటీ కమీషనర్‌ను నియమించి స్వామివారి ఆలయం ప్రతిష్టను మరింతగా పెంచేలా చేసి కోన మాస్టర్ ప్లాన్‌ను, అమ్మవారి ఆలయం పునర్ నిర్మాణ పనులును వేగవంతం చేయాలని భక్తులు కోరుతున్నారు.

## అప్పనపల్లి శివారులో ఘోరప్రమాదం

### బావిలోకి దూసుకెళ్లిన కారు

### ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృత్యువాత



**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి(దుబ్బాక), ఆగస్టు 20, ప్రభాతవార్త :** రోడ్డు పక్కన ఉన్న బావిలోకి కారు అదుతప్పి దూసుకెళ్లడంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందిన ఘటన బుధవారం అర్ధరాత్రి సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం అప్పనపల్లిలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి ఘటనలో దుబ్బాక మండలం బలవంతపూర్‌కు చెందిన భార్య భర్తలతోపాటు ఇద్ద రు పిల్లలు మృతి చెందారు. బల వంతపూర్ గ్రామానికి చెందిన రాజు(35), అతని భార్య భాగ్య(25), కుమారుడు నియాన్ (4), కుమార్తె శాన్విక(2)తో కలిసి సిద్దిపేటలో జరిగిన వేడుకల్లో పాల్గొన్ని తిరిగి రాత్రి సమ యంలో కారులో స్వగ్రామానికి వెళ్తుండగా కారు అదుపుతప్పి అప్పనపల్లి శివారు లోని రోడ్డు పక్కన ఉన్న బావిలోకి దూసుకెళ్లడంతో నలుగురు కుటుం బసభ్యులు మృతి చెందారు. ప్రమాదం జరిగిన బావిలోంచి నలుగురి మృత దేహాలను పోలీసులు క్రేన్ సహాయంతో వెలికితీశారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సజ్జల రామకృష్ణారెడ్డిపై సంగం డెయిరీ పరువు నష్టం దావా !

### సజ్జలతో పాటు ఎమ్మెల్సీ మాధవరావు, మరో మూడు సంస్థలకు నోటీసులు..

### సమాధానానికి సెప్టెంబర్ 2 కు కేసు వాయిదా

**గుంటూరు లీగల్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** టీటీడీకి నెయ్యి సరఫరా చేస్తున్న సంగం డెయిరీపై తప్పుడు ఆరోపణలు చేసి పరువు నష్టం కలిగించారంటూ వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డికి సంగం మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ దాఖలు చేసిన పరువు నష్టం కేసులో గుంటూరు మూడవ అదనపు జిల్లా కోర్టు నోటీసులు జారీ చేసింది. ఓ.ఎస్. నం. 200/2026గా 10 కోట్ల రూపాయలు చెల్లించాలంటూ పరువు నష్టం దావా దాఖలైంది. పాల సేకరణ చేయకుండా టీటీడీకి నెయ్యి సరఫరా చేస్తున్నారంటూ సజ్జల రామకృష్ణారెడ్డి సంగం డెయిరీపై ఆరోపణలు చేశారని దావాలో పేర్కొన్నారు. వాస్తవాలను కప్పిపుచ్చి, భక్తుల మనోభావాలు దెబ్బతినేలా తప్పుడు ఆరోపణలు ప్రచారం చేశారని సంగం డెయిరీ ప్రతినిధి దావాలో వివరించారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి నెయ్యి సరఫరా చేస్తున్న సంగం డెయిరీ చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల్లో ఆవు పాలను సేకరిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో సజ్జల రామకృష్ణారెడ్డితో పాటు, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, ఇందిరా టెలివిజన్ లిమిటెడ్ ను కూడా ప్రతివాదులుగా పేర్కొన్నారు. సంబంధిత సోషల్ మీడియా కంటెంట్‌కు సంబంధించి గూగుల్ ఎల్ఎల్‌సీ, మెటా ప్లాట్‌ఫామ్స్ ఇంక్. లను సైతం ప్రతివాదులుగా చేర్చారు. సాక్షి టీవీతో పాటు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో జరిగిన ప్రచారంపై కూడా న్యాయపరమైన చర్యలు కోరారు. కేసును పరిగణలోకి తీసుకున్న గుంటూరు మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి సిహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు ప్రతివాదులకు నోటీసులు పంపాలని ఆదేశిస్తూ, కేసును సెప్టెంబర్ రెండో తేదీకి వాయిదా వేశారు.

## గోదావరి ఘటనపై విజయసాయిరెడ్డి ప్రశ్నల వర్షం

### టిడిపి, వైఎస్సార్సీపీలు సూటిగా సమాధానం చెప్పాలి

**విశాఖపట్నం, ఆగస్టు 20, ప్రభాతవార్త:** గోదావరిలో పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజినీర్ నూకరాజు కుటుంబానికి సంబంధించిన ఘటనపై మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు. ఈ ఘటనకు సంబంధించి వస్తున్న ఆరోపణలు, మత మార్పిడికి సంబంధించిన అంశాలపై అధికార టీడీపీ, ప్రతిపక్ష వైఎస్సార్సీపీలు సూటిగా సమాధానం చెప్పాలని,ఖిఎక్స్‌ఖి వేదికగా డిమాండ్ చేశారు.నూకరాజు కుటుంబం గోదావరిలో దూకడానికి కారణం 'లవ్ జీహాద్' అని తెలిసినా ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. మత మార్పిడికి సాదిక్ ఖాన్ ఒత్తిడి చేశారన్న ఆరోపణలను ఆషామాషీ అంశంగా ఎందుకు చూస్తున్నారని నిలదీశారు.గోదావరిలో దూకి మృతి చెందిన సౌజన్య తన భర్త జగదీశ్వర్‌రెడ్డి మరణానికి కూడా సాదిక్ కారణమని తన మరణ వాంగ్మూలంలో పేర్కొన్నారని విజయసాయిరెడ్డి తెలిపారు. ఈ వ్యవహారాన్ని లవ్ జీహాద్, హత్యగా ఎందుకు పరిగణించడం లేదని, హిందూ బీసీలు, హిందూ రెడ్డి సామాజిక వర్గంపై దాడిగా ఎందుకు భావించడం లేదని టీడీపీ, బీజేపీ రాష్ట్ర నాయకత్వాలను ప్రశ్నించారు.మనుషులను హత్య చేసి మత మార్పిడులకు పాల్పడుతున్న మాఫియాలు ఏపీలో గ్రామగ్రామాన వివిధ పేర్లతో విస్తరిస్తున్నాయన్న ఆరోపణలపై ప్రధాన రాజకీయ పార్టీలు ఎందుకు మౌనం వహిస్తున్నాయని ప్రశ్నించారు. మైనారిటీ ఓట్ల కోసమేనా ఈ మౌనం అని నిలదీశారు. మత మార్పిడుల నిరోధానికి చంద్రబాబు ప్రభుత్వం చట్టం ఎందుకు తీసుకురావడం లేదని ప్రశ్నించారు. సాదిక్ ఖాన్ ఇప్పటివరకు ఎందుకు పట్టుబడలేదని, లేక అతడిని పట్టుకునే ఉద్దేశం లేదా అని ప్రశ్నించిన విజయసాయిరెడ్డి అతడు ఏ రాజకీయ పార్టీ కార్యకర్త, 2024 ఎన్నికల్లో ఏ పార్టీకి ప్రచారం చేశాడనే వివరాలను ఎందుకు బయటపెట్టడం లేదని నిలదీశారు. సౌజన్య, జగదీశ్వర్‌రెడ్డి దంపతుల కుమారుడు రియాన్ష్‌రెడ్డిని ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్, బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పరామర్శించి కుటుంబానికి అండగా నిలవాలని ఎందుకు భావించలేదని ప్రశ్నించారు. ఈ ఘటనను కేవలం వ్యక్తిగత వ్యవహారంగా కాకుండా సామాజిక సమస్యగా చూడాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఈ అంశంపై స్పందించాలని, ప్రతి ఇంట్లో చర్చ జరగాలని విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు.